ఫిబ్రవరి '71

17

సంస్కృతి—సాహిత్యము
కె. వి. రమణారెడ్డి

విప్లవ కథా సాహిత్యం
కొడవటిగంటి కుటుంబరావు

ఈనాడు హిందీలో విప్లవ కవిత
నిఖిలేశ్వర్

తెలుగు కవితా, నాటకరంగాలపై లెనిన్ ప్రభావం
శ్రీశ్రీ

ఫాల్ ఫాల్
జంపన పెద్దిరాజు

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

నిర్వాహణ: సాహితీ మిత్రులు

వెల: ఒక రూపాయి

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

17

ఫిబ్రవరి 1971

నిర్వాహణ

'సాహితీమిత్రులు'

---

100 పేజీలు ఒక రూపాయి

కవర్ డిజైన్
'శుక్తి'

ప్రతులకు, వివరాలకు :

సృజన
పోస్టుబాక్సు నెం. 67
వరంగల్-2 (ఆం. ప్ర.)

సంవత్సర చందా : పది రూపాయలు

అర్ధ సంవత్సర చందా : ఆరు రూపాయలు

విడిప్రతి : ఒక రూపాయి

ముద్రణ :

కమల్ ప్రింటర్సు,
హైద్రాబాద్-2.

ఫిబ్రవరి 1971 17

కవర్ డిజైన్

మాసపత్రికగా సృజన

సృజన మూడవ జన్మదిన సంచిక నుంచే ద్వైమాసికగా మార్చాలని ఆలోచిస్తున్నాం. పాఠకులుకూడ తొందరపరిచారు. కాని నాలుగవ జన్మదిన సంచికలో ఆ ఆలోచనను వాయిదావేసి సృజన ప్రచురణలు చేపట్టాం. నాలుగేళ్ళు నిరాటంకంగా పదహారు సంచికలు వెలువడ్డాయి.

ఇంతలో తెలుగుదేశంలో ఒక మహా ప్రభంజనం వీచింది. జూలై నెలలో హైదరాబాదులో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. పత్రికలు యీ సంచలనాన్ని పతాక శీర్షికలతో వేయక తప్పలేదు. సృజన – 16 కూడ యీ పరిణామాన్ని తన పరిధిలో ప్రజల ముందుంచింది. మళ్ళీ అక్టోబర్‌లో ఖమ్మంలో విప్లవ రచయితల సంఘం ప్రథమ మహాసభలు చారిత్రాత్మకంగా జరిగాయి. ఆ ఝంఝ త్రైమాసికగా నడుస్తున్న సృజనకు మాసపత్రికగా పరుగెత్తే జీవమిచ్చింది. ఈనాడు దేశంలో తల ఎత్తుతున్న భావ విప్లవ ఉద్యమాలే సృజనకు ఊపిరి.

మధ్యలో ఒక్క నవంబర్–జనవరి సంచిక మాత్రం మా పాఠకులకు యివ్వలేకపోయాం. ఎందరో అభిమానులు సృజన ఆగిపోయిందన్న వేదనతో రాసారు. వాళ్ళందరికీ ఒక్కొక్కరికీ విడిగా జవాబుకూడ యివ్వలేకపోయాం. ఈ అవకాశాన్ని తీసుకొని ఈ ఆలస్యానికి మన్నించ వలసిందిగా కోరుతున్నాం. ఇన్నాళ్ళూ సృజనను త్రైమాసికగా నడిపిన సామూహిక బలమే మాసపత్రికగా కూడ నడుపుతుందని మాకు తెలుసు. ఈ కర్తవ్యాన్ని నిర్వహించే బాధ్యతలో ఎప్పటికప్పుడు చైతన్య మార్గంలో కలిసివస్తున్న పాఠకుల సహకారానికి అభినందనలు అందిస్తున్నాం.

—'సాహితీ మిత్రులు'

సంస్కృతి–సాహిత్యము

కె. వి. రమణారెడ్డి

సమాజ జీవనంలోనే మానవచైతన్యం విప్పారి సొగసెక్కుతుందని మార్క్స్ బోధించాడు. ఈనాటివరకు నడచిన మానవ చరిత్ర నంతటినీ మనిషి తన పంచేంద్రియాలను అభివృద్ధిపరచుకొనే క్రమంగానే వర్ణించాడు. పశుపక్ష్యాదులకూ మనిషికీ మధ్య ప్రకృతిని పునస్సృష్టించడంలో ఒక ముఖ్యమైన భేదం ఉంది. అవి అక్కరకొద్దీ పునస్సృష్టిస్తాయి. అంతేగాక తమ దేహాలనుండే ఆ పునస్సృష్టి జరుగుతుంది. అక్కర ఏదీ తనకు లేకుండానే తన దేహానికి బాహిరంగాకూడా మనిషి అది ఆచరించగలడు. పైగా ప్రకృతిని పునస్సృష్టించే క్రమంలో సౌందర్యదృష్టి మనిషికి ఉంటుంది. ఈ దృష్టి సహజంగా పట్టుబడింది మాత్రమేగాక అలవరచుకొని పెంపొందించుకొన్నట్టిది కూడా.

మానవచైతన్యం భావజాలంగా బాహిరిల్లినప్పుడు ఆర్థిక, రాజకీయ, మత, దర్శన, సాహిత్య, కళా సంబంధి రూపాలెన్నో ఏర్పడి, వాటి సమాహార సంస్కృతి అనిపించుకొంటుంది. ఈ అన్నింటిలోనూ, మార్క్సిజం ప్రకారం, ఆర్థికానికే మౌలికమైన ఆధిపత్యం ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ పునాదిలాంటిదైతే తక్కినవన్నీ ఆ పునాదిపై లేచే కట్టుబడి లాంటివి. పునాదినిబట్టి కట్టుబడి జరుగుతుంది. పునాది మారితే కట్టుబడీ ముందువెనుకలుగా మార్పుచెందక తప్పదు. అయితే పునాదికీ కట్టుబడికీ మధ్య కార్యకారణ సంబంధంలాంటిది అమలు జరుగుతూ ఉండదనికూడా మార్క్స్ చెప్పాడు. ఒకటి కారణమూ ఇంకొకటి ఫలితం మాత్రమే అన్నట్లు ఆ సంబంధం ఉండదు.

ఆర్థికవ్యవస్థ ప్రతిబింబం భావజాలంలో అంతటా అచ్చుకు మచ్చు చందంగా అప్పటంగా ఉండదుకూడా. మానవ మస్తిష్కంలో చరిత్రాత్పూర్వ దశ తాలూకు భావాలు వెర్రిమొర్రి నమ్మకాలుగా అభూతకల్పనలుగా అంటిపెట్టుకొని ఉండి, విజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దికీ బలహీనపడి అంతరిస్తూ ఉంటాయి.

భావజాలం చిట్టచివరకు పునాదికి విధేయమే అయినా బానిసలా యజమానిని అనుసరిస్తూ ఉండదు. స్వచ్ఛందమేమో అన్న భ్రమనుకూడా కలిగించేట్లు స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఉన్నట్లుంటుంది. పునాదినికూడా స్పృశించి కదిపి వెయ్యగల సత్తా భావజాలానికి ఉంటుందని మార్క్సు గమనించాడు. అయితే, ఈ పారస్పర్యం యధార్థమూ బలీయమూ శాశ్వతమూ కాదు. ఆర్థిక పునాది తన సర్వాధిపత్యాన్ని స్థాపించుకోకుండా ఉండదు. అంటే, సంస్కృతి అనేది మార్పు చెందని పరబ్రహ్మపదార్థమేమీ కాదన్నమాట.

ఆర్థిక వ్యవస్థను బట్టి సంస్కృతి మారుతూంటుంది. ఆస్తి సంబంధాలను (ఉత్పత్తి సంబంధాలన్నా ఇవే) బట్టి వ్యవస్థ రూపొందినప్పుడు, ఉత్పత్తి సాధనాలమీద ఆధిపత్యం గలిగిన వర్గం (పాలకవర్గం అన్నమాట) తనకు అనుకూలమైన సంస్కృతినే సంఘంమీద మోపుతుంది. పాలకవర్గ సంస్కృతే ఆ దశలో యావత్సమాజ సంస్కృతి అని భ్రమగొలుపుతుంది. అంతేగాకుండా, ఉత్పత్తి విధానం చేరుకొన్న అభివృద్ధి స్థాయికి మించి సంస్కృతి రాణించదు. గడచిపోయిన చారిత్రకదశల తాలూకు భావాలను మిగుళ్లు నగుళ్ల చందంగా ఒక కొత్త దశలో నిలుపుకోగలదేమోగాని రాబోయేదశకు సంబంధించిన భావాలకు ఆకాంక్షల, కోరికల రూపంలో తప్ప సంస్కృతిలో జాగా ఉండదు. అంటే, సంస్కృతికి వర్గ స్వభావమనేది అనివార్యం. వర్గ సంఘర్షణకు అతీతమైన సంస్కృతి ఉండదు. It reflects social life through the prism of the class struggle అంటాడు లెనిన్.

లెనిన్ సూత్రీకరణలలో ఒకటి సంస్కృతికి సంబంధించినట్టిది. ఈ అంశానికి మరింత విరివి నిస్తుంది. ధనస్వామ్య వ్యవస్థలో ప్రతిజాతిలోనూ రెండు భిన్నమైన సంస్కృతులుంటాయి. ఆ వ్యవస్థకు సంబంధించి దాన్ని బలపరచేది మొదటిది. ఆ వ్యవస్థలోనే అంకుర ప్రాయంగా (rudimentary form) తలెత్త సాగే ప్రజాతంత్ర సామ్యవాద సంస్కృతి రెండోది. ఇందులో ఏ ఒక్కటికూడా జాతీయ సంస్కృతి బిరుదానికి తగదు. జాతీయ సంస్కృతి అంటూ విడిగా ఒకటేదీ లేదు. ఈ రెండున్నూ జాతీయ సంస్కృతులే.

వర్గాతీతమైన వస్తువుగా సంస్కృతిని సంభావించే బూర్జువా దృక్పథాన్ని విమర్శిస్తూ, జాతీయ సంస్కృతి అనేదొకటి విడిగా లేదనడమే గాకుండా ఆర్థిక, రాజకీయ సంఘర్షణలకు దూరంగా అతీతంగా సంస్కృతి ఉండజాలదని లెనిన్

సిద్ధాంతీకరించాడు. అలాగైతే వర్గప్రయోజనం స్థానే దానికి "జాతీయ" ప్రయోజనాన్ని ఆపాదించినట్లుకాగలదు. ఈ సంస్కృతి విశేషాలు రెండూ కలిసి ఒకేచోట మసలుతున్నప్పటికీ, ఒకే జాతీయ స్వరూపాన్ని కలిగి ఒకే భాషను ఆశ్రయించుకొని ఉన్నప్పటికీ, అవి పరస్పరం సంఘర్షిస్తూనే ఉంటాయి. సాహిత్యరంగంలో కూడా ఆర్థిక వైరుధ్యాల సమగ్ర స్వరూపం లెనిన్ కళ్ళబడింది.

అయితే సంస్కృతిలోని కొన్ని అంశాలకు వర్గాలతో సంబంధంలేని గుణం ఉంటుందనికూడా లెనిన్ గమనించాడు. ఈ అంశాలు సర్వజన సామాన్యమైనవి, సార్వకాలికమైనట్టివికూడా. అందుచేత సంస్కృతిలో ఒకానొక వర్గానికి మాత్రమే చెందిన అంశాలతోబాటు ఏ వర్గానికీ విడిగా చెందని సామాన్యాంశాలు కూడా జతజేరి ఉంటాయి. కాబట్టే వెనకటి చారిత్రక దశలకు చెందినదనే కారణం చేత, సంస్కృతిని మొత్తంగానే సోషలిజం కాలితో తన్నీవెయ్యదు, మొత్తంగానే తలపై పెట్టుకొని పూజించదు.

ఆ రోజుల్లో రష్యాలో కొందరు ప్రబుద్ధులు శ్రామిక వర్గాభిమానం అతిశయించగా సంస్కృతి విషయాల గురించి ఒక రాద్ధాంతం చేశారు. ఏమనంటే, ఏ వర్గాని కావర్గానికి విడిగా కేటాగా ఒక సంస్కృతి ఉంటుంది. మరో వర్గంతాలూకు సంస్కృతి శ్రామికవర్గం సంస్కృతిని స్పృశించనేగూడదు. మరికొందరు 'ప్రోలెట్-కల్ట్' పేరున ఒకకూటం కట్టి పెటీబూర్జువా అభిప్రాయాలతోటి శ్రామికవర్గ సంస్కృతి "పూర్తిగా" విశుద్ధమైన వర్గస్వభావం కలిగి ఉండాలని వాదించారు. బూర్జువా సంస్కృతి అఖండ పదార్థమనీ అందులో అభ్యుదయాంశే పూజ్యమనీ అది నిలవనీటి చందంగా మురుగుతో నిండిపోయిందనీ వర్ణించారు. వివిధ సాంఘిక ధోరణుల అభివృద్ధిని అది అడ్డుకొంటుందనికూడా అన్నారు. లెనిన్ ఈ వాదాన్నికూడా ఆమోదించలేదు. ఇది వాస్తవ చిత్రణకాదు. "ఆధ్యాత్మిక వైఖరి" (Metaphysical view) మాత్రమేనంటూ, ప్రతి జాతిలోనూ కనుపించే బూర్జువా సంస్కృతికి ఆ సంస్కృతిలోని ప్రజాతంత్ర, సోషలిస్టు అంశాలను పోటీగా నిలపవలెనన్నాడు. వివిధ దేశాల సంస్కృతులకు చెందిన ఇలాంటి అంశాలే కలిసి అంతర్జాతీయ ప్రజాతంత్ర సంస్కృతిగా పరిణమిస్తాయని చెప్పాడు. ధనస్వామ్య వ్యవస్థ ఇప్పటికే ప్రపంచ ఆర్థిక, రాజకీయ, భావసంబంధి జీవిత రంగాలను సమైక్యపరిచింది. సోషలిజం ఈ అంతర్జాతీయతను పూర్తి చేస్తుంది. అయితే అంతర్జాతీయ సంస్కృతి 'జాతీయ' సంస్కృతుల నన్నింటినీ

తనలో విలీనం (absorb) చేసుకోదు. ప్రతి జాతీయ సంస్కృతిలోనుంచీ నికర మైన ప్రజాతంత్ర, సోషలిస్టు అంశాలను మాత్రమే ఆమోదపూర్వకంగా స్వీకరించ గలదు. అంటే, సంస్కృతినుంచి అభివృద్ధి నిరోధకమైన, విహితంగాని మాలిన్యాన్ని తీసివేసి దానికి నిర్మలత్వాన్నీ ప్రయోజన పరత్వాన్నీ సమకూర్చా లన్నమాట. మత విహిత దృక్పథం, మార్మికవాద వైఖరి, జాతీయ దురహం కార ధోరణి, విజాతీయ సంస్కృతులనుంచి వచ్చిచేరిన పనికిరాని దిగుబళ్లు-ఇవన్నీ పరిహరించదగినవని లెనిన్ అభిప్రాయపడ్డాడు.

సంప్రదాయ నిరసన ధోరణి అతిశయించినప్పుడు సంస్కృతిని మొత్తం గానే నిరాకరించే ప్రమాదం గురించి లెనిన్ పదేపదే హెచ్చరించాడు. విప్లవకర కార్మికవర్గ సిద్ధాంతంగా మార్క్సిజం చారిత్రక ప్రాముఖ్యాన్ని పొందిందంటేనే, బూర్జువా దశకు చెందిన నిస్తుల విజయాలను అనాదరించడంగాక రెండువేల సంవత్సరాలకు పైబడిన మానవ సంస్కృతి అభివృద్ధి క్రమంలోని ప్రతీ ఒక విలువైన విషయాన్ని సొంతం చేసుకొని కొత్తరూపు నిచ్చిందని అర్థం!

Marxism has won its historic significance as the ideology of the revolutionary proletariat because, far from rejecting the most valuable achievements of the bourgeois epoch, it has, on the contrary, assimilated and refashioned everything of value in the more than two thousand years of the development of human thought and culture.

శ్రామికవర్గ సంస్కృతి అనే పదార్థం గాలితో పేనేదికాదు, గగనంనుంచి ఊడిపడేదీకాదు. మానవాభ్యుదయం సమస్తం సృష్టించిన సంస్కృతిని గుర్తెరిగి మార్చుకొన్నప్పుడే అది ఏర్పడుతుంది. ధనస్వామ్య, భూస్వామ్య, బ్యూరా క్రాటిక్ వర్గాల ఏలుబడిలో మానవులు సమకూర్చిపెట్టుకొనిఉన్న విజ్ఞాన నిధిని ఆధారం చేసుకొని అది క్రమవివర్ధనం చెందక తప్పదు. తన సాంస్కృతిక వ్యవహారాల మంత్రి అయిన లూనాచార్‌స్కీని పిలిచి లెనిన్ ఆదేశించినదేమంటే, పురాసంస్కృతిలో నవ్యంగా ఉన్నదనిపించే ప్రతీ విషయాన్ని జాగ్రత్తగా భద్రం చేసి పదిలపరచడంతోబాటు, కొత్త ధోరణులను విచక్షణ పూర్వంగా ఆదరించ వలెననికూడా. విప్లవ ప్రభావంవల్ల ఉదయిస్తూన్న ఈ నవ్యధోరణుల గుణా గుణాలను నిర్ణయించేప్పుడు, సౌందర్య దృష్టి ఒక్కటే (aesthetic point of view alone) కొలబద్ద కాగూడదని హెచ్చరించాడు. అంటే, ఈ కొత్త ఆ

పాతతోటి పోటీపడి సౌందర్యపరంగా నెగ్గజాలదని భయపడ్డాడన్నమాట. అలాంటి తారతమ్య పరీక్షవల్ల కొత్తది మన్నుగరిచి పాతది తొడవరిస్తే సంస్కృతి ఎదగడమంటూ ఉండదు. కొత్తది వచ్చి పోటీ తగిలినందువల్లనే పాతది కలదెలుసుకొని క్రమసంస్కారాన్ని పొంది మార్పు చెందగలుగుతుంది. ఆ పోటీయే లేకపోతే ఆత్మ సంతృప్తితో ఉన్నచోటనే ఉండిపోతుంది.

సాహిత్యం గురించి, ముఖ్యంగా పార్టీ సాహిత్యం గురించి లెనిన్ ప్రకటించిన అభిప్రాయాలనుబట్టి, రాజకీయానికీ సాహిత్యానికీ మధ్య ఉండవలసిన గాఢమైన అనుబంధం వెల్లడౌతుంది. మావోకూడా 'ఎనాన్ సాహిత్య సదస్సు'లో అలాంటి భావాన్నే ప్రకటించే ముందు లెనిన్ అభిప్రాయాన్ని ఉటంకించడం జరిగింది.

Literature mast become part of the common proletarion cause, a cog and a screw of one single great Social-Democratic mechanism, set in motion by the entire politically-conscious vanguard of the working class.

శ్రామికవర్గ రాజకీయ మహోద్యమానికి సారథిలాంటి పార్టీ యంత్రాంగంలో సాహిత్యం ఒక శీలగానో మరగానో ఉండి శ్రామికోద్యమాంతర్భాగమై పోక తప్పదన్నమాట. సాహిత్యమూ కళా, రాజకీయానికి అధీనమై (Subordinate) ఉండవలె నన్నప్పుడు మావో ఆదేశించిందీ ఇదే. అయితే లెనిన్ గానీ మావోగానీ సాహిత్యాన్నీ ఇతర ఉద్యమ రూపాలనూ ఒకే గాట కట్టివెయ్యలేదు. ఈ విషయంలో వారు చేసిన మినహాయింపు చాలామంది మార్క్సిస్టుల దృష్టి నుంచి తప్పిపోయి Politics in command అన్న సూక్తినే వాళ్ళు వల్లించడం జరుగుతూంది. లెనిన్ చేసిన మినహాయింపు ఏమిటంటే—

There is no question that literature is least of subject to the mechanical adjustment and levelling, to the rule of the majority over the minority. There is no question either, that in this field greater scope must definitely be allowed for personal intiative, individual inclinatiou, thought and fantasy, form and content.

ఇక మావో చెప్పిన మినహాయింపు ఇది :

In saying that art and literature are subordinate to politics, we mean class politics and mass politics, not the so-called politics of a few statesmen.

శ్రామిక మహోద్యమమే కుక్కలుచింపిన విస్తరిలాగా చిరిగి ఒకటికి మూడుగా చీలిన అసాధారణ పరిస్థితిలో, ఏ ఒక్క పార్టీ అనుసరించే రాజకీయ విధానాలను నిర్విచక్షణగా అనుసరించక మొత్తం ఉద్యమం శ్రేయోభివృద్ధిని ఉపలక్షిస్తూ సాహిత్య సృజన జరగవలసి ఉంది. మూడు కమ్యూనిస్టు పార్టీలు నడిపే ఉద్యమాలను తారతమ్య దృష్టితో పరిశీలించి తమ యోగ్యతనుబట్టి వాటిని బలపరచవలసినట్లుంది. ఇలాగన్న మాత్రాన్నే రాజకీయాలకు అతీతంగానో పోటీగానో ఉండిపోదామని మనం అనుకోవడం లేదు. విప్లవాశయం దృష్ట్యా రాజకీయానికీ సాహిత్యానికీ సమతుల్యత ఉన్నట్లుగాగూడా భ్రమపడడం లేదు.

ఈ చర్చకేమిగాని, లెనిన్ చేసిన మినహాయింపులో రచయితల స్వాతంత్ర్యానికి చెందిన మాటలనూ బూర్జువా-అరాజకవాదులు కోరే కళాసృజన స్వాతంత్ర్యంగా పొరబడగూడదు. పార్టీ అభిమానానికీ సృజన స్వాతంత్ర్యానికీ మధ్య వైరుధ్యమేదీ లేదని చెబుతూ, సమాజంలో జీవిస్తూకూడా సమాజంనుంచి స్వాతంత్ర్యాన్ని పొందడం ఏ వ్యక్తికైనా దుర్ఘటమని, అలా కోరడం lordly onarchism అని లెనిన్ వివరించాడు.

2

చరిత్ర క్రమంలో మానవజాతి సాధించి సమకూర్చుకొన్న సంస్కృతి నిధి గురించి మావోకూడా సదభిప్రాయం వెలువరించాడు. లెనిన్ చెప్పినట్టుగానే దాన్ని మొత్తంగా ఒప్పేసుకొనే వైఖరి ప్రదర్శించకుండా మార్క్సిస్టు పద్ధతితోటి దాని మేలుకీడులను నిర్ణయించి తర్వాతనే మేలిమిని స్వీకరించాలని చెప్పాడు. రష్యాలోలాగే చైనాలోనూ శ్రామిక మహోద్యమానికి తోడ్పడుతూనో దానిలోకి వచ్చి చేరో పెటీ-బూర్జువా ఎలిమెంట్లు సంస్కృతి గురించి విపరీత వ్యాఖ్యానాలు వెలయించినప్పుడు మావో విమర్శించవలసి వచ్చింది. చైనా రాజకీయ జీవితాన్ని కూడా కొత్త మలుపు తిప్పగలిగిన "మే 4 ఉద్యమం" సాంస్కృతికంగా ఎంతో సంచలనం కలిగించినా, దాని ముఖ్యమైనలోపం మావో ఎత్తిచూపాడు. చెడ్డదంటే పూర్తిగా చెడ్డది, మంచిది పూర్తిగా మంచిదనే Formalist వైఖరి పాక్షిక దృక్పథాన్నే కలిగించి వితండవాదంగా పర్యవసిస్తుందని చెప్పాడు.

విప్లవకర సంస్కృతి గురించి మావో ఆలోచనలు అనన్యమైనవి. విప్లవం ఘటిల్లక ముందునుంచీ అది భావజాలంలో మార్పు తీసుకువస్తూ విప్లవాన్ని సుగమం చేస్తుంది. విప్లవం ఘటిల్లినప్పుడేమో మొత్తం రంగంలో అది చాలా ముఖ్యమైన ఆవశ్యకమైన భాగమౌతుంది.

చైనా విప్లవం ముందునుంచీ సాహిత్య రంగానికి చాలా ప్రాముఖ్యం ఉంటూవచ్చింది. పార్టీ రచయితలు ఇతర రచయితలతో కలిసి United Front గా ఏర్పడాలని మావో సూచించాడు. అయితే పార్టీయేతర రచయితలూ కళాకారులూ పార్టీ ఎడల సానుభూతినైనా కలిగి ఉండాలి లేదా జపాను దురాక్రమణ నెదిరించే ప్రతిఘటనోద్యమాన్ని బలపరుస్తూనైనా ముందుకు రావాలని నిబంధించాడు. అంటే, ఐక్యతకోసం ఐక్యత అని మావో ఎన్నడూ ఎక్కడా చెప్పలేదు. విభిన్న రాజకీయ పక్షాలకు చెందిన రచయితల నందరినీ ఒక సంస్థలో కలిసి ఉండమనలేదు. ఐక్య సంఘటన అనగానే సంస్థా నిర్మాణమని అర్థంకాదు. శ్రామికోద్యమ సారథి అయిన కమ్యూనిస్టు పార్టీ ఎత్తుగడలకు అనుగుణంగానే ఈ పిలుపివ్వడం జరిగింది గాని అదే పరమార్థమనే దృష్టితోమాత్రం కాదు. ఈ ఐక్యత పరిమితమైన ఐక్యతేగాని సార్వత్రికమైనదికాదు. తక్షణావసరం గురించి ఐక్యతను సాధించినంతమాత్రాన ఇతర విషయాల గురించి ఐక్యత ఉన్నట్టుకాదు. జపాన్ దురాక్రమణను వ్యతిరేకించిన రచయితల కందరికీ ప్రజాతంత్రం గురించి భావైక్యతలేదు.

In a united front, unity to the exclusion of struggle, and struggle to the exclusion of unity are wrong policies.

విమర్శ, పోరాటమూ లేకుండా ఐక్యతకే అనుచిత ప్రాముఖ్య మివ్వడం మితవాద లొంగుబాటు వ్యవహారమైతే (Right capitulationism), ఐక్యత భంగపడే విధంగా విమర్శ, పోరాటమూ సాగించడం అతివాద వేర్పాటుతనం (Left exclusionism) కాగలదు. అందుచేత ఈ రెండు పెడధోరణులకూ లోనుగాకుండా పార్టీ రచయితలు జాగ్రత్తపడాలని మావో హెచ్చరించాడు: ఎన్నో లోపాలున్నప్పటికీ పెటీబూర్జువా రచయితలను శ్రామికోద్యమం వైపుకి తీసుకు రమ్మని ఆదేశించాడు. విప్లవ మేధావులకూ అలా కానివారికీ విప్లవ వ్యతిరేకులకూ తేడాలు చూపుతూ, కర్షక కార్మిక ప్రజలతో వాళ్ళు ఏకీభావం పొందగలరా, అలా పొందుతున్నారా అనేదొక్కటే గీటురాయి అని చెప్పాడు. మార్క్సిజానికి

వాచోవిధేయులై ఉంటేనేచాలదు, దానితో తాదాత్మ్యం చెందడమే విప్లవ రచయిత లను మిగత వారినుండి వేరుచేస్తుంది.

ఈ ఐక్యసంఘటన అయినా మార్పులేని జడపదార్థం కాదు. ఉదాహ రణకు, 1919 లో మే 4 ఉద్యమం ప్రారంభం గాకముందు, అంటే భూస్వామ్య వర్గ సంస్కృతికీ ధన స్వామ్యవర్గ సంస్కృతికీ మధ్య హోరాహోరీగా సంఘ ర్షణ జరిగిన రోజుల్లో, ధనస్వామ్య సంస్కృతిని బలపరచడం ఐక్యసంఘటన ఉద్దేశంగా ఉండేది. కాని, సామ్రాజ్యవాదం ఎగబడి వచ్చి కమ్యూనిస్టు, వలస వ్యతిరేక ఉద్యమాలు తలెత్తిన తర్వాత, ధనస్వామ్యవర్గ సంస్కృతి స్వభావం అభివృద్ధి నిరోధకం అయింది. కమ్యూనిస్టు సాంస్కృతిక భావజాలం అభివృద్ధి కర శక్తిగా పరిణమించింది. కాబట్టి సామ్రాజ్యవాదానికీ భూస్వామ్యానికీ వ్యతి రేకంగా ప్రపంచ శ్రామికుల సోషలిస్టు సాంస్కృతిక విప్లవభాగమైన నూతన ప్రజాతంత్ర భావజాలానికి అపూర్వ ప్రాముఖ్యం చేకూరింది. "మే 4 ఉద్య మం"లో కమ్యూనిస్టులు, విప్లవానుకూలమైన పెటీబూర్జువా, బూర్జువా మేధావులూ కలిసి పనిచేశారు. ఈ చివరి ఇరువర్గాలూ ఆ ఉద్యమంలో మితవాద పక్షంగా వ్యవహరించాయి. ఇంకా కొంత కాలానికి, కోమింటాంగు పార్టీకి అనుకూలమైన రైతాంగం వచ్చి కలిసింది. రెండు భావజాలాల మధ్య ఐక్య సంఘటన ఏర్పా టైంది. ఇక మూడవదశ (1927-1937) లో జాతీయబూర్జువావర్గం కూడా విప్లవ వ్యతిరేక శక్తులతో రాజీపడ్డాక, కమ్యూనిస్టులను పురుగులేరినట్లు ఏరే సైనిక కిరాతకచర్యలకు పూనుకొన్నాక, ఐక్యసంఘటన నిర్మాణం మళ్ళీ మార్పుకు లోనైంది. జపాన్ వ్యతిరేక యుద్ధకాలంలో సువిశాలమైన ఐక్య సంఘటన అవసరమైంది. ఈ దశగురించి మావో రాసిన మాట లివి:

The content of China's new national culture at the present stage is neither the cultural despotism of the bourgeoisie, nor pure proletarian socialism but the anti-imperialist and anti-feudal New Democracy of the people under the leadership of proletarian-socialist ideals of culture.

స్వదేశంలోని బూర్జువా సంస్కృతిలోని మంచినే గాక పరదేశాల బూర్జువా సంస్కృతులు తమ అభ్యుదయదశలో సాధించిన మంచినిగూడా స్వీకరిస్తూ, శ్రామిక ప్రజాసంస్కృతి వర్ధిల్లుతుందని మావో అన్నాడు.

3

బూర్జువా మానవతావాదానికీ సోషలిస్టు మానవతావాదానికీ మధ్య అపారమైన అంతరం ఉంది. దయ, జాలి, కరుణ, కన్నీళ్ళు, సానుభూతివంటి భావాలతో తమ వర్గస్వార్థాన్ని కప్పిపెడుతూ అట్టడుగున ఉన్న సామాన్య ప్రజలకు ఏ విధంగానూ ఉపచరించకపోవడం మొదటిదాని లక్షణం. ఇంకా చెప్పవలసి వస్తే, బూర్జువా సమాజంలోని అవలక్షణాలను అస్తవ్యస్తంగా విమర్శిస్తూ ధనస్వామ్యవ్యవస్థా దుష్ఫలితాలను అరాకొరా ఎత్తిచూపడానికే పనికి వస్తుంది తప్ప, అట్టడుగున ఉన్న పీడితులకు విమోచన పథాన్ని చూపెట్టదు. మార్క్స్ జీవిత కాలంలోనే సోషలిజాన్ని విమర్శించిన బూర్జువా రచయితలు ధనస్వామ్య వ్యవస్థమీద జరిగే విప్లవపోరాటాన్ని నిరసిస్తూ వచ్చారు.

సోషలిస్టు మానవతావాదం పూర్తిగా ఇంకొకలాంటిది. భౌతికావసరాలకే గాక భావరూపాలకుగూడా మనిషి చేయవలసి వస్తూన్న పరాధీనతకు గల మూల కారణాన్ని వెదికి పట్టుకొని, దాన్ని తొలగించడం ద్వారా స్వాతంత్ర్య పథాన్ని చూపెడుతుంది. చూపెట్టడమేగాక సాధ్యం చేస్తుంది. అందుచేత శ్రామిక మహోద్యమానికీ ఈ తరహా మానవతావాదానికీ అవినాభావ సంబంధమే ఉందిమరి.

వర్గ సమాజంలో "వర్గాతీతమైన" సాధారణ మానవతావాద వైఖరిలోని దగాను లెనిన్ బయటబెట్టాడు. వర్గ సంఘర్షణమూలంగానే అందులోనే శ్రామికుడు తన దాస్య మనస్తత్వంనుండి బయటపడగలడు; తన మానవతను మళ్ళీ సాధించుకోగలడు. బూర్జువా లోకబాంధవుల పరోపకార పరాయణుల మానవతావాదం ఈ స్వతంత్రభావనను శ్రామిక ప్రజలలో కల్గించదు. అది క్రియాశీలమైన వైఖరికాదు. ప్రైవేటు ఆస్తి అంతరించాకనే శ్రామికులకు పరిపూర్ణమైన మానవ పదార్థం (Human essence) సమకూరగలదు. మార్క్స్ రాసినట్లుగా

Communism, as the annulment of private property, is the justification of real human life......the advent of practical humanity.

శ్రామికవర్గ విప్లవం మానవ స్వాతంత్ర్యాన్ని సమగ్రంగా ఆవిష్కరించడానికి మార్గమన్నమాట. ఆ విప్లవంలోనే సాంస్కృతిక విప్లవం అంతర్నిహితంగా ఉంటుందని లెనిన్ భావించాడు. భౌతికదాస్య బంధాలనుంచి మాత్రమేగాక భావదాస్య బంధాల నుంచిగూడా మనిషి బయటపడి యథార్థ మానవుడు కావాలి. విప్లవ పరమార్థమల్లా, మనిషికి మానవత్వాన్ని సమకూర్చడమే (humanising man).

విప్లవ కథా సాహిత్యం

కొడవటిగంటి కుటుంబరావు

అభ్యుదయోద్యమం వాసన తగలని రచయితలు పత్రికలకి కథలు రాసినా, సినిమా కథలు రాసినా కూడా మనిషి మనస్తత్వం మారితే సంఘం బాగుపడుతుంది అనే వైఖరిలో ఉండేవారు. ఈనాటికీ ఉన్నారుగాని, వాళ్ళని ఎవరూ సీరియస్‌గా తీసుకోవటం లేదనుకుంటాను. ఇది ఒక విధమైన సంస్కరణ వాదం.

అభ్యుదయ వాదం అవలంబించిన వారిలో కూడా అనేకులు, మార్పు మనిషికి బాహిరంగానూ, సామాజిక వ్యవస్థ లోపలనూ వస్తేనేగాని సమాజ స్వరూపం అభ్యుదయకరంగా మారదని గుర్తించి కూడా, ఆ మార్పులు తెచ్చే బాధ్యత ఇంచు మించు పూర్తిగా ఇతరులకు—అభ్యుదయ దృక్పథంగల రాజకీయ వర్గాలకు వదిలేసి, జనాన్ని వర్గరహిత సమాజంకేసి సుముఖులను చెయ్యటానికీ, సమాజాన్ని విమర్శించటానికీ ఎక్కువగా పాటు పడ్డారు. పారతంత్ర్యం పోయి స్వాతంత్ర్యం వచ్చింది; పెట్టుబడిదారీపోయి సామ్యవాద వ్యవస్థ, రాజకీయ సంఘర్షణ ఫలితంగా, అదే వస్తుంది; సామ్యవాదం వెంబడే వర్గరహిత సమాజమూ, నిరక్షరతా, నిరుద్యోగ, దారిద్ర్యాదుల నిర్మూలనా, వైద్య సౌకర్యాలూ, న్యాయమైన ఆర్థిక వ్యవస్థా, దేశంయొక్క అభ్యున్నతీ క్రమంగా వచ్చి దేశం నందనవనమై కళకళలాడుతుంది అని నమ్మారు. ఇది ప్రగతివాదం.

అయితే ఇదేమీ జరగలేదు. స్వాతంత్ర్యం వచ్చింది గాని దాని వెంబడి నిరక్షరత పోలేదు. దారిద్ర్యం పెరిగింది, మాజీ దేశద్రోహ వర్గాలు పాలక వర్గాలతో లీనమై పోయాయి. రానురాను అసమానతా, అవినీతీ, జీవితంలో సంఘర్షణా పెచ్చుమీరాయి. అల్పసంఖ్యాకవర్గాలు అందలా లెక్కాయి. హీనంగా ఉన్నవాళ్ళు మరింత అణగారి పోయారు. 30 ఏళ్ళ పోరాట ఫలితంగా లభించిన ఈ స్వాతంత్ర్యాన్ని ఒకవంక డబ్బు సంచులూ, పోలీసు తుపాకులూ

సంరంక్షించ వలసిన దుస్థితిరాగా, మరోవంక పాతవలస విధానం స్థానంలో నయావలస విధానం వచ్చి దేశాన్ని గావుపట్టు పట్టేసింది.

ఈ స్థితిలో రచయితలు విప్లవవాదాన్ని అవలంబించటం జరిగింది.

విప్లవం అన్నది ఊర్ధ్వజ్వాల. కిందినుంచి పైకి మండుతుంది. విప్లవ సాహిత్యవాదం అన్నది చైతన్యం ప్రజలనుంచి పుట్టుకురావాలని గుర్తిస్తుంది. తమ కృషిలేకుండా ఏదో ఒరిగి ఒళ్లోపడుతుందన్న భ్రమ ప్రజలలో లేకుండా చేయటానికి ప్రయత్నిస్తుంది. జీవితాన్ని ఆమూలాగ్రం విమర్శిస్తుంది, కాని ప్రజలకు లేనిపోని ఆశలుపెట్టి, వారి జవసత్వాలను నిద్రపోనివ్వదు.

విప్లవ సాహిత్యం కవితలో ఉన్నంత పదునుగా కథలలో ఉండే అవ కాశం లేదని యువకథకులబాధ. రెండు విషయాలు గుర్తుంచుకోవాలి:

కవిత్వంలో ఉన్న నినాదాలు కేవల నినాదాలుగా ఎక్కువ సాఫల్యం పొందలేవు. వాటివెంటకూడా వాస్తవమైన, విశ్వసనీయమైన తర్కం ఉండాలి. "విప్లవంచెయ్యి", అనగానే తుపాకీతీసుకునేవాడు ఉంటే, వాడు, "దాన్ని అవతల పారెయ్యి!" అనగానే పారేసేవాడుగానే ఉంటాడు.

మానవ మనస్తత్వం ఎలా ఉంటుందంటే, హీనుడు తనహైన్యాన్ని వీలయినంతవరకు గుర్తించకుండా తిరుగుతాడు. "యామ"అనే రష్యన్ నవల గురించి, "The horror of it is that there is no horror," అన్నారు. అందులో పడపు వృత్తి చేసుకుంటున్నవాళ్లు, తాము హేయంగా జీవిస్తున్నామని గుర్తించరు. (అలా వేశ్యలు తమనుతాము తిట్టుకుంటున్నట్టు చేసే రచనలు పచ్చి అబద్ధాలు!) ఒకవేళ మరీదుర్భరమైనస్థితిలో తన జీవితాన్ని తానే తిట్టుకోవలసివస్తే నాడు "ప్రారబ్ధం"అనో, "నాకన్నా ఇబ్బందిపడే వాళ్లు ఉన్నారు", అనో మనసును సమాధానపెట్టుకునేటందుకు తగిన భావాలు వాళ్ల సంస్కృతిలో ఎప్పుడూ ఉంటాయి.

ఇలా సమాధానపడే శక్తి ఈనాడు మధ్యతరగతివాడికి ఉన్నంతగా మరే వర్గానికీలేదు. పైవర్గంవాళ్ళు తమక్షేమంకోసం హత్యలు చెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు. కిందివర్గంవాళ్ళు తమహక్కులకోసం చావటానికైనా సిద్ధమవు తున్నారు. ఈ రెండు వర్గాలవైఖరికీ పారస్పర్యం ఉన్నదన్న సంగతి కూడా గుర్తించలేని గుడ్డిస్థితిలో ఉన్నది మధ్యతరగతి.

దురదృష్టవశాత్తు ఈనాడు కథలు రాసే వాళ్ళలో అధిక సంఖ్యాకులూ, చదివేవాళ్ళలో ఇంకా అధికసంఖ్యాకులూ ఈమధ్యతరగతివాళ్ళు. తమకు కుడి ఎడమల మధ్య జరిగే ఈ సంఘర్షణలో జీవిత వాస్తవం ఉన్నదని మధ్యతరగతికి తెలియజెప్పటం అవసరం. మధ్యతరగతి ఆత్మవంచనను, కృత్రిమ విలువలను, దిగలాగుడు మనస్తత్వాన్నీ, తాము తప్పుగా పరిగణించే జీవిత ధోరణులతో రాజీపడి పోరాటంకన్న శ్మశానశాంతిమేలని భావించే వైఖరినీ తీవ్రంగా ఖండిస్తూ కథకులు కథలు రాయవచ్చు.

సాహిత్యంనుంచి విప్లవం పుట్టదు. సాహిత్యమూ, విప్లవమూ కూడా జీవితంనుంచి, అట్టడుగునఉన్న ప్రజలనుంచి, పుడుతాయి. ఈ రెండూ కలిసే కేంద్రం ప్రజాజీవితం. ఈ కలయిక సంభవించనినాడు రెంటికీ సంపర్కం ఉండదు.

"ప్రజలలో విప్లవశక్తులు విజృంభించకుండానే జీవితంలో విప్లవ పరిణామాలు వస్తాయి. ఈ విప్లవ పరిణామాలను కాంగ్రెసు అభ్యుదయవాదులు తెస్తారు; లేదా, మరొక లెఫ్టిస్టు పార్టీ తెస్తుంది," అనే వారు విప్లవ సాహిత్యవాదాన్ని ఆమోదించరు; వ్యతిరేకిస్తారు కూడానూ.

ప్రజలనుంచే విప్లవ చైతన్యం రావాలని నమ్మిన ఏ రచయిత అయినా విప్లవ సాహిత్య రచనకు తనకున్న అవకాశం మేరకు పూనుకోవచ్చు. ప్రజలలో విప్లవ చైతన్యం కలిగించటానికి ఏయే శక్తులు ఏయే మేరకు కృషి చేస్తున్నట్టు కనబడితే ఆ శక్తులను ఆ మేరకు సమర్థించవచ్చు.

"విరసం వాళ్ళు సాయుధ విప్లవం కావాలంటారటగా!" అని ముక్కుమీద వేలేసుకునే వాళ్ళున్నారు. శ్రీశ్రీ అన్నట్టు గుడ్డు పగలగొడితేగాని ఆమ్లెట్ రాదు. అందులోనూ ఈ మన దేశంలో ప్రతి స్వల్ప విషయాన్ని నరబలితోనే సాధించవలసిన రాజకీయ పరిస్థితి ఉన్నది. భాషా రాష్ట్రాలు అడగటం పెద్ద విప్లవంకాదు. భాషా రాష్ట్రాలు ఏర్పడటానికి ఎంతమంది బలికాలేదు!

కాంగ్రెసు మార్కు సోషలిజం తీసుకురావటానికి ధనిక వర్గాల పార్టీలతోనూ, మతోన్మాదుల పార్టీలతోనూ ఏకం కావటానికి సిద్ధంగా ఉన్న "సున్నా" కాంగ్రెసును చూస్తే "ష్వీక్" జ్ఞాపకం వస్తాడు. అతను యుద్ధరంగానికి పోతున్నానంటాడు, "యుద్ధ రంగం ఇటుంటే నువు అటుపోతున్నావేం?" "అంటే.

"నేనిటే యుద్ధ రంగానికి పోతాను," అంటాడు. ష్వీక్ హాస్యపాత్ర. మన పదవీ వ్యామోహ రాజకీయాలని చూసి నవ్వాలనైనా మనకు తట్టటంలేదు.

అందుచేత, చెప్పవచ్చిందేమంటే, మధ్య తరగతి జడ్డి మన స్తత్వాన్ని అంటిపెట్టుకుని ఉన్న విప్లవ విముఖతను వదిలించటానికి కృషిచేసే రచనలకు కూడా విప్లవ సాహిత్యంలో స్థానం ఉన్నది. జీవితాన్ని విమర్శించక తప్పదు. ఆ విమర్శ వెనక విప్లవంలో విశ్వాసం ఉండటం ప్రధానం.

ఈనాటి సమాజంలో విప్లవకరమైన పాత్ర నిర్వహించ గలవాళ్ళు శ్రామికులు. ప్రభుత్వ యంత్రాంగం వారిని మభ్య పెట్టడానికీ, వారిలో ఏమాత్రం చైతన్యం కనిపించినా రిజర్వు పోలీసుదళాలను పంపటానికీ సిద్ధంగా ఉంటున్నది. ఈనాటి మన క్షుద్రజీవితం ముందడుగు వెయ్యటానికీ, జీవితం వికాస వంతంగా తయారుకావటానికీ అడ్డంగావున్న శక్తులేవో, వాటిని బలపరచేది ఎవరో, అలా బలపరిచే శక్తులను ఏయే కళలు సమర్థిస్తున్నాయో, అలాంటి శక్తులను ఏయే కళా కారులు వ్యతిరేకిస్తున్నారో, అసలు దేశం నాలుగు మూలలా ఏమేమి జరుగుతున్నదో అర్థం అయితేనేగాని ఎవరికీ సరి అయిన సామాజిక దృక్పథం ఏర్పడదు.

— *కొడవటిగంటి కుటుంబరావు*

ఈనాడు హిందీలో విప్లవ కవిత

నిఖిలేశ్వర్

ఈనాడు రాజకీయ, సాంఘిక పరిణామాలు సాహిత్యాన్ని నడిపిస్తున్నాయి. సాహిత్యంలోని కవితాప్రక్రియ యథావిధిగా ఆ పరిణామాలకు స్పందించి లావాను ఎగజిమ్ముతోంది. కుళ్ళి గబ్బుగొడుతున్న ఈ నాటి వ్యవస్థను సమూలంగా మార్చి నూతన ప్రజాస్వామ్య స్థాపనకు భావభూమికను సిద్ధం చేస్తున్నది.

అభ్యుదయ కవిత్వం దాదాపు అన్ని భారతీయ భాషల్లో దిగజారి నీళ్ళు కారుస్తున్నది. మితవాద రాజకీయధోరణి జరుగుబాటుకోసం చేసుకున్న రాజీబేరం సాహిత్యంలోకూడా ప్రతిబింబించింది. ఈ రాజీబేరం చివరికి ఎంతగా దిగజారి పోయిందంటే జరుగుతున్న పోరాటాలను వికృతంగా చిత్రించి విప్లవచేవను వెన్ను పోటు పొడిచింది. మాజీ అభ్యుదయ కవులు-సాహితీ వేత్తలు తమ తరానికి అంటుకొన్న బూజును నూతన తరాలకు తగిలించ ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలోని భాగమే ఈనాడు యావత్ భారతదేశంలో ఈ మాజీ అభ్యుదయ రచయితలు ప్రవచిస్తున్న తిరోగమన వాదసూక్తులు—సాహిత్యం ద్వారా రాజకీయాల స్థితిగతులను చిత్రించవద్దని, ముందు తరాలను నడిపించే తీవ్రవాద రాజకీయ ధోరణిని ప్రచారం చేయవద్దని సజ్జాద్‌జహీర్ మహాశయులు ఉద్బోధిస్తున్నారు. కవులకు రాజకీయాల ప్రమేయం ఎందుకు ? అని ఏటుకూరి బలరామమూర్తిగారు అభ్యుదయ సాహిత్యం కాళ్ళ కింద భూమిని తొలిచేస్తున్నారు. అదేవిధంగా హిందీలోకూడా నామవర్‌సింగ్ ప్రభృతులు ఈ రాగాన్నే ఆలాపిస్తున్నారు.

కాని పదార్థ పరిణామం ఎవరికోసం ఆగనట్టే రాజకీయ పరిణామాలు కూడా ఈ మాజీ అభ్యుదయ సాహితీవేత్తల కోసం అలా ఆగిపోవు. విసిగి వేసారి కోపంతో చివరికి యువతరం తన భవిష్యత్తును తానే నిర్ణయించుకుంటోంది. రాబోయే సువ్యవస్థితమైన వ్యవస్థకోసం సాయుధపోరాటాలు జరుపు

తున్నది. అసలైన మార్క్సియన్ సోషలిస్టు అవగాహనతో ముందుకు, మరీ ముందుకు దూసుకుపోతున్నది. 'దారిపొడుగునా రక్తతర్పణం' అవసరం కాదనుకుంటే అది భ్రమనే అవుతుంది. ఏ దేశంలో ఎక్కడా రక్తపాతం జరగకుండా విప్లవాలు రాలేదు.

అందువల్లనే హిందీ కవిత్వం కూడా ఈనాడు తన మార్గాన్ని సుస్పష్టం చేసుకొన్నది. జరుగుతున్న పోరాటాలను గుర్తించినది. సమకాలీన స్పందనకు అనుగుణంగా ఊపిరి పీలుస్తున్నది. సమాజానికి నిజమైన మార్గాన్ని నిర్దేశించే బాధ్యతను హిందీ విప్లవకవిత్వం నెరవేరుస్తున్నది.

హిందీలో నయీకవిత తర్వాత అనేక ప్రయోగాలు కవిత్వంలో జరిగాయి. వాటిలో ప్రముఖంగా నిలుచుంది "అకవిత" అనే కవితోద్యమం. "వ్యక్తి అంతర్విరోధాల అన్వేషణతో, సంప్రదాయాల్ని ధ్వంసం చేస్తూ, భిన్నమైన మార్గం గుండా పయనిస్తూ మారిన సౌందర్య అవగాహనతో రాయడమే 'అకవిత' ("నయీ కవిత–ఆ తర్వాత" సృజన, నవం–జన 1968–69 సంచిక) అని కేవలం తిరుగుబాటు వైఖరితో ఆ 'అకవిత' కొనసాగింది. నగరజీవితంలో వ్యక్తిలఘుత్వాన్ని, నైరాశ్యభావాన్ని, ఏకాకితనాన్ని మాత్రమే ఆకళించుకొని చివరికి అతిలైంగిక పదాల శరణులో తప్పిపోయింది.

ఈ పరిస్థితుల్లో హిందీ కవిత్వం పాతుకొన్న వ్యవస్థతో మళ్ళీ రాజీపడవలసిన దుస్థితిలోకి దిగజారింది. అంతకు పూర్వం ఆక్రోశంతో–ఆవేశంతో వచ్చిన ఎన్నో చిన్న పత్రికలు తిరుగుబాటుదగ్గరే ఆగిపోయినాయి. ఆ సందర్భంలో కొందరు హిందీ యువకవులు తమ చిన్న పత్రికలను విప్లవమార్గం వైపు మళ్ళించారు. సామాజిక రుగ్మతలకు పరిష్కారమార్గంగా సాయుధ పోరాటాన్ని అంగీకరించారు. స్పష్టమైన మార్క్సియన్ అవగాహనతో ప్రతిబద్ధత ఏర్పరచుకొని నిర్భయంగా విప్లవ కవిత్వాన్ని రచిస్తున్నారు. సాంస్కృతికంగా రావలసిన మౌలికమైన మార్పులగురించి విస్పష్టంగా రాస్తున్నారు. ప్రజల్లోకి వెళ్ళి తమ విప్లవ కవిత్వాన్ని వినిపించి ఈనాటి క్లిష్టమైన పరిస్థితులను వివరిస్తున్నారు.

కవితలు, కథలు, నాటికలు, వ్యాసాలద్వారా ఈ విప్లవకరమైన భావభూమికను సుస్థిరం చేస్తున్న ఘనత వారణాసిలోని "జనకళామంచ్"కు దక్కుతుంది. వారణాసినుండి అంతకు పూర్వమే కంచన్‌కుమార్ అనే యువకవి

"ఆముఖ్" అనే పత్రిక ద్వారా తిరుగుబాటు రచనలను ప్రచురిస్తూవచ్చాడు. వర్తమాన హిందీ సాహిత్యంలో జరుగుతున్న రచయితల వ్యాపార మనస్తత్వాన్ని బట్టబయలుచేశాడు. గత సంవత్సరం బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఈ "ఆముఖ్" పత్రిక పైఅధికారుల స్థాయిలో చాలా అలజడికి దారితీసింది. అయినా కంచన్‌కుమార్ తమ ఇతర సహచరులతో 'జనకళామంచ్' స్థాపించి ఈనాటివరకు నాలుగైదు ముఖ్యమైన పుస్తకాలను ప్రచురించాడు. ఈ పుస్తకాలద్వారా విప్లవపథాన్ని చూపిస్తున్న కొందరు యువరచయితలు హిందీ సాహిత్యంలోకి దూసుకవచ్చారు. రామ్‌ధనీ, కంచన్‌కుమార్ తమ వ్యాసాలవల్ల; క్రాంతిమోహన్, విజయకౌశల్ తమ కవితలవల్ల అత్యాధునిక హిందీ కవిత్వంలో విప్లవకవిత్వానికి బలాన్ని ఇచ్చారు.

హైద్రాబాద్‌నుండి వెలువడిన పోస్టర్ పత్రిక "అంటార్కిటికా" రెండో సంచిక కూడా ఈ విప్లవమార్గాన్నే అనుసరించింది. మొదటి సంచికలో కేవలం తిరుగుబాటుతత్వాన్ని వ్యక్తం చేసిన కవితలు రెండో సంచికనాటికి 'అంటార్కిటికా' అనే శీర్షికలోని జడత్వాన్ని అర్థంచేసుకున్నాయి. అందువల్లనే 'అంటార్కిటికా' అనే శీర్షికను వ్యతిరేకిస్తూ విప్లవకరమైన అవగాహనతో ఇలా అంటున్నారు.

1. "దోపిడి, మతాశ్రితమైన సంస్కృతిని వ్యాపింపచేస్తున్న ప్లేగ్‌ను ధ్వంసంచేసి, పీడితుల ఉజ్వల నవసమాజాన్ని – సంస్కృతిని నిర్మించడమే మా ధ్యేయం".

2. "రాజకీయాలపట్ల తటస్థవైఖరిని అవలంబిస్తూ, నూతనతరాన్ని అపమార్గం పట్టిస్తూ ఈనాటి దోపిడి వ్యవస్థను కొనసాగించడానికి పెట్టుబడిదార్ల, గుత్తాదార్ల, జమీందారుల చేతులను శక్తివంతం చేస్తున్న ఈ సాహిత్య మేనేజర్లకు వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది."

3. "ఆకలి మన మౌలికమైన అవసరం. ఆ ఆకలిని తీర్చడానికి సాయుధ పోరాటంకూడా అంతే అవసరం. దేశంలోని పీడితులైన ప్రజల కంఠాలతో మా కంఠాలను జోడించి ఈ విశ్వాసాన్ని కలిగిస్తున్నాము".

4. "విప్లవాలు 'ఎన్నోనరకాలు' అని వుండవు. మార్గంలోని అడ్డంకులన్నింటిని తొలిగించుకుంటూ లక్ష్యం చేరడమే ప్రధాన ఆశయం."

అత్యంత ప్రధానమైన ఈ విప్లవకరమైన ఆశయాలతో తేజ్ రాజేంద్ర సింగ్, జైరామ్, వేణుగోపాల్, సురేశ్‌శర్మ కవితలు రచించారు. ఈ 'అంటార్కిటికా' రెండో సంచికలోనే వరవరరావు, ఎక్స్‌రే (తెలుగు-తిరగబడు కవులు) కవితల హిందీ అనువాదాలు కూడా ప్రచురించారు.

హిందీ కవిత్వంలో వస్తున్న ఈ విప్లవకరమైన పరిణామాలను తెలుగు కవులు, పాఠకులు అర్థం చేసుకోడానికి కొన్ని ముఖ్యమైన కవితాఖండికల తెలుగు అనువాదాలను ఇస్తున్నాము.

శ్రీకాకుళం :

"ఎండిన కొమ్మల వెనుక
ఎర్రని సూర్యుడు"

ప్రజల నమ్మకం నిండిన
కొండల్లో—కోనల్లో
ప్రేక్షకులు ఎవరూ లేరు
అందరూ పాల్గొంటున్నారు
నగ్నంగా, ఆకలితో వున్నవాళ్ళు
దోపిడి చేయబడుతున్నవాళ్ళు
ఆంధ్ర సముద్ర తీరాన
శ్రీకాకుళం గుడిసెల మధ్య
పొడుస్తున్న సూర్యుడితో
ఎండిన కొమ్మలకు
క్రూరాత్ముల వికృత ముఖాలు
వేలాడుతున్నపుడు
గోడలపై
వర్గశత్రువు రక్తంతో
వేలాది సంవత్సరాల బానిస
రాస్తున్నాడు
"తుపాకి గొట్టం ద్వారా
వస్తుంది పాలనాధికారం"

—విజయ్‌కౌశల్

"దోపిడిపాలన బైనెట్లకు వ్యతిరేకంగా"

ఊపిరి పీల్చడమే సర్వస్వంకాదు
విస్కీ, జిన్ తాగితేనే
కళ్ళు ఎర్రబడవు
కాఫీ హోటల్లో మాత్రమే
కవిత్వం రాయబడదు
పరుపుమీదే చావురాదు,
దోపిడి, హత్యాచారాలు
ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యం
నిరాహార దీక్షలవల్ల, అహింస
పార్లమెంటరీ ప్రజాస్వామ్యంవల్ల
అంతంకావు,
బాణం నిమరడం కోసం
మెచ్చుకోడంకోసం కాదు
సిద్ధాంతాలు కేవలం
చర్చించడంకోసం కాదు.
రైతుల—కార్మికుల
విముక్తి గీతాలు
కేవలం తుపాకులతోనే
రాయబడతాయి
దోపిడిపాలన బైనెట్లకు
జవాబు
రైతాంగ విప్లవ బైనెట్లు మాత్రమే.
చావుకు భయపడేది ఎవరు ?
భోషాణాలు నింపుకునే దోపిడీగాళ్ళు
వడ్డీమేసే గాడిదలు
క్రూరులైన భూఖామందులు.
మేం చావుకు భయపడం

వేలాది సంవత్సరాలనుంచి
చావంటే ఏమిటో మాకు తెలుసు.
భారతదేశంలో రాబోయే
రైతుల-కార్మికుల
ఎరుపురాజ్యంకోసం
మా అందరి శ్వాసలు ఆడుతున్నాయి
కృష్ణమూర్తి-బాబులాల్
ఇంకా ఇతరనిజమైన
విప్లవ వీరులకు లాల్ సలామ్!

—విజయ్ కౌశల్

"రహస్యజీవితానికి
వెళ్లేముందు"

నాకు తెలుసు
ఏరోజైనా
నువ్వు నన్ను కటకటాల వెనుక
బంధిస్తావని.
ఏరోజైనా
నువ్వు నన్ను దేశద్రోహివని
ప్రకటిస్తావని.
—లేదా
ఒకగ్రామం నుంచి మరో
గ్రామం వెడుతుండగా
కిరాయి తుపాకులతో మట్టుబెడతావని
ఆ తర్వాత
దోపిడివర్గాల కృతకమైన
ఆయుధాలైన
ప్రజలను తప్పుదోవ పట్టించే

నీ పత్రికల్లో ప్రచురిస్తావ్—

'.... ....

....నక్సలైట్లవధ
బాంబులు, తుపాకులు, కొన్ని
మావో పుస్తకాలు దొరికాయి,
మన పోలీసు ఒక్కడూ చావలేదు
చివరికి ఒక్కడైనా గాయపడలేదు
ఎర్రషర్టు, ఖాకీ ప్యాంటు వేసుకొన్న కొందరు
నక్సలైట్లు దట్టమైన
అడవుల్లోకి పారిపోయారు,
గాలింపు కొనసాగుతోంది.'

నాకు ఇదికూడా తెలుసు
నా విప్లవ సాహిత్యం మొత్తాన్ని
కాల్చివేస్తావని
లేదా గోదాముల్లో
ఎలుకలకి చెదళ్ళకి
వదిలివేస్తావని....
అయినా నా ఎర్రతుపాకి ఎక్కడున్నా
భూస్వాముల, వడ్డీ మేసే గాడిదల
షావుకార్ల, వాళ్ళతొత్తుల—
గొంతులపై మహావిప్లవాన్ని మోగిస్తూ
నిప్పులు చిమ్ముతూ
కాలుస్తూ-వణికిస్తూ
సజీవంగా వుంటుంది.

అయితే గియితే
నువ్వు ఒక పనిచేస్తావేమో
మత్తెక్కిన కళ్ళను
ఉన్నతమైన పదవులను
రకరకాల బహుమతులను

నిలువెత్తు డబ్బు ఘోషాణాలతో
ఆశ చూపించి
లేదా నువ్వు పెంచుతున్న
ఏజంట్లను—కుక్కలను
కొల్లగొట్టే ఉద్యోగ యంత్రాలను
పార్లమెంటరీ ప్రజాతంత్రాన్ని
రైతాంగ—కార్మిక శత్రువర్గాన్ని
అర్ధవలస—అర్ధ రాచరికాన్ని
అధికార దండాన్ని—రాజ్యాంగాన్ని
నామీదికి ఉసిగొల్పుతావని
కాని నేను వీటన్నింటిని
తన్ని తగిలేస్తాను.
సాయుధ రైతాంగ పోరాటంతో
గ్రామీణ ఎరుపు తుఫానుతో
నగరాలను చుట్టుముడుతాను
క్రూరులైన భూఖామందులను నరుకుతాను.

* * *

అక్టోబర్ విప్లవ మార్గం
చైనా పంథా మా మార్గం
నేను మొదటే నా అధ్యక్షుణ్ణి ఎన్నుకోను
నేను మొదటే నా నాయకుణ్ణి ఎన్నుకోను
రాబోయే రేపటికోసం
చస్తాను—జీవిస్తాను
నాకు తెలుసు
కోట్లాది భారతీయ ప్రజలు
ఎర్రని తుపాకులతో
ముందుకు దూకుతున్నారు
నాతోబాటే నడుస్తున్నారు
నువ్వు నన్ను నా మార్గంనుంచి తప్పించలేవు

నన్ను ఎప్పటికి చంపలేవు
నన్ను ఎన్నటికీ ఉరితీయలేవు
విప్లవం కోసం
నా తల్లి నన్ను కన్నది.

—విజయ్ కౌశల్

"జనకళామంచ్" ద్వారా వెలువడిన 'విజయ్‌కౌశల్' రచించిన ఈ మూడు కవితల తర్వాత 'అంటార్కిటికా'లోని మరో రెండు కవితల తెలుగు అనువాదాలు ఇస్తున్నాము.

"అసహ్యం"

అమాయకత్వపు దుప్పటిని
ఎండలో పరచి బొమ్మలు వేస్తూ
చెట్లల్లో, పక్షుల రెక్కల్లో
గీతాలనూ ఇరికిస్తూ
శ్వాసలను విరుస్తున్న
కుట్రలో నువ్వూ—నేను—అందరం వున్నాం.

*　　*　　*

మాంస పిండాల అగాధ సముద్రంలోంచి
తల ఎత్తి అరుస్తున్నాను
అసహ్యించుకుంటున్నాను
ఈ సూర్యుణ్ణి ఇచ్చిన వాళ్ళను.
అసహ్యించుకుంటున్నాను
నా జీవిత వ్యాకర్ణాన్ని రచించిన వాళ్ళను
ఆ అసహ్యపు పునాదులపై
ఆకాశపు రంగును పులుముతాను
మట్టి వాసనను లేపుతాను
ఎగజిమ్మే వర్గశత్రువు రక్తం,
నా రక్తంలోంచి ఉదయిస్తున్న

తామ్ర ఉషస్సు—
ఇదే నా జీవిత కవిత్వం
దీని నిజాయితీని శంకించకండి.

—తేజ్ రాజేంద్రసింగ్

నీతోబాటే నడుస్తాను

ఒకడు నడుస్తున్నాడు చేతిలో తుపాకితో
శతాబ్దాల శిథిల హృదయాల నిశ్శబ్దంలో
విప్లవాన్ని మేల్కొల్పాలని
చెదరిన పదాలను ఏరుకుంటూ
"అన్నార్తులారా ఏకం కండి
తుపాకి పట్టండి
చావును మోసుకుంటూ
నడుస్తూ సాగండి"
అనే లయతోపాటు నడుస్తున్నాడు
దూరంగా అక్కడ ఇంట్లో
భార్య - తల్లి - చెల్లెలు
దూరమైన ఆశలను
మరీ దూరంగా పక్కకునెట్టి
సూర్యుని తీక్ష్ణమైన కిరణాల్లో
సముద్రపు పొంగును చూస్తున్నారు
ఊరి అవతల
విషపుమొక్కలు అలుముకొన్న
మురికినీటి మడుగులో
ఎన్నో రాత్రులను
వేలాడదీసి
ఒకనాటి బూర్జువా నిద్రను
దండిస్తూ నిద్రిస్తున్నాడు

మరో భూస్వామి ఈనాడు
నక్కలపాలవుతాడు
ఈరోజు ఆ ఒకడు – అతని మిత్రులు
చిక్కి పాలిపోయిన చేతులను
రక్తస్నానం చేయించి
ప్రతి ఒక్కరు దోచుకోబడిన
తమ భూముల – మానాల లెక్కలువేస్తూ
ఈరోజు
ఇంటి గుమ్మం ముందు వేలాడదీసిన
తలకాయముందు
ఎగురుతున్న ఎర్రజెండా కాంతిలో
నినాదాలు చేస్తున్న జనం
పాణిగ్రాహీ విప్లవగీతం
అపారజన సమూహనృత్యం
జలపాతంలాంటి వేగంలా
ఉప్పొంగుతున్న ఆశల కెరటాల్లా
ఊరిలోని పసిపిల్లాది మనుష్యుల
నరాల్లో వేడిరక్తం పారుతోంది
ప్రేలుడు మందు వెలుగులో
ఇప్పుడు నేను
నీకు జోహార్లు అర్పించను
కాని నీతోబాటే నడుస్తాను

—"జైరాం"

ప్రభుత్వం నిన్ను క్షమిస్తున్నదంటే నువ్వు ప్రజాద్రోహి వన్నమాట.

—ఎస్. కె.

తెలుగు కవితా, నాటకరంగాల మీద లెనిన్ ప్రభావం

శ్రీ శ్రీ

ఒకప్పుడు, అనగా మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనూ, ఆ తర్వాత సంవత్సరాలలోనూ ఈ యిరవయ్యో శతాబ్దాన్ని అమెరికన్ శతాబ్దం అని అభివర్ణించే వారు. పిడుక్కీ అమెరికా, బియ్యానికీ అమెరికా, అన్నిటికీ అమెరికా! సాక్షాత్తూ అమెరికా అమరలోకమే అని నా చిన్నతనంలో ఎక్కడో చదివినట్లు జ్ఞాపకం! జర్మనీపొంగు చల్లారింది. డాయిష్లాండ్ (జర్మనీ) ఈబర్ అల్స్ (అన్నింటికీ పైది) కాలేకపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం మీద సూర్యు డస్తమించడం ప్రారంభించాడు. జపాన్ ఉదయసూర్యు డుదయిస్తూనే ఉన్నాడు. కాని రష్యన్ విప్లవపు నిజమైన ఎర్రసూర్యుడు అప్పుడే లేచాడు. యూరప్‌ను హడలకొట్టే భూతం లాగ కాక, మానవజాతి సమస్తాన్నీ వెలిగించే కాంతి గోళం లాగ! అందుకే నే నంటున్నాను ఇది లెనిన్ శతాబ్దం అని! (ఇంకా ఈ శతాబ్దం ముగియడానికి 30 ఏళ్లున్నా, ముందు కాలపు చరిత్రకారుల తీర్పును ఇప్పుడే పసికడుతూ!) పిడుగులాగ విరుచుకుపడ్డ లెనిన్‌ధాటి ప్రపంచ పర్యాప్తమైనది. ఎన్నెన్ని సంవత్సరాలకైనా ఇంకా ఇంకా లెనిన్ భావాలు మానవజాతిని ప్రభావితం చేస్తూనే ఉంటాయి.

ఈ లెనిన్ భావాలే ఈనాటి తెలుగు కవిత్వాన్నీ, నాటకాన్నీ ప్రభావితం చేస్తున్నాయని నే నంటే ఆర్భాటం అనిపించవచ్చు. నాది పాక్షికదృక్పథం అనవచ్చు. ఇతర ప్రోద్బలా లన్నింటినీ (అమెరికన్ ప్రభావంతో సహా) నిరాకరించానని నన్ను నిందించవచ్చు. సెక్సు, నేరం, హింస మొదలైన మనోవికారాలతో కూడిన అమెరికన్ విషవాయువుల విషయం త్వరలోనే ఎత్తుకుంటాను. ఇప్పటిమట్టుకు నేను విస్పష్టంగా చెప్పవలసిన దొక్కటే. ఔను నాది పాక్షిక దృష్టి, నేను సామ్యవాదోద్యమానికి నిబద్ధుణ్ణి! అనిబద్ధ రచనలన్నీ బాధ్యతా రహిత రచనలనే నా ఉద్దేశం. ఆఖరికి తిరోగమనకవులు సహా భూతకాల వైభ

వానికి నిబద్ధులే! ఒకాయన నిద్రలో గుర్రుపెడుతున్నట్టుండే నిర్నిద్ర ధారా వేగంతో రామాయణాన్ని చంపూకావ్యంగా తిరగరాస్తాడు. వర్ణాశ్రమ ధర్మాలని గుండెకు హత్తుకుంటాడు. ఏదో ఒక క్షుద్రదేవతను పట్టుకొని భక్తి పారవశ్యంతో పద్యాలు రాస్తాడు. పైగా తనకి జ్ఞానపీఠ బహుమతి ఇవ్వకుండా చేస్తున్నవారిని పడ తిడతాడు. (ఈ బహుమతి కేవలం ఐహికమే కాని ఆముష్మికం కాదన్న విషయంతో ఆయనకి నిమిత్తం లేదు).

ఇలాంటి కవులు సమకాలికులే కాని ఆధునికులు కారు. ఈ నూతన పౌరాణిక కవులని ఖండిస్తూ కూర్చోడానికి నా కిక్కడ వ్యవధిలేదు. హీనపక్షం ఇక వెయ్యేళ్ళయినా వీళ్ళు వెనకపడ్డారని నా అంచనా! విశ్వవిద్యాలయాలలో వీరి రచనలు అవశ్యపఠనీయా లవుతున్నాయంటే అందుకు విశ్వవిద్యాలయాల పట్ల విచారం ప్రకటిస్తున్నాను. అయినా నేను ఆశావాదిని. అనతికాలంలోనే మన విద్యావిధానంలో మౌలికమైన మార్పులు రాగలవని అతిదృఢంగా విశ్వసించే ఆశాభావం నాది.

పోతే ఇప్పుడు, ఏది కవిత్వం. ఏది నాటకం, ఈ రెండింటిలో ఏ ఒక దానితో, లేదా రెండింటితో లెనిన్ కేమిటి సంబంధం? చెప్పుకోదగ్గ కవిత్వమేదైనా అతగాడు వ్రాశాడా? కనీసం ఒక ఏకాంకనాటికైనా వ్రాశాడా? సాంప్రదాయక సాహిత్య విమర్శకుడు సదుపాయంగా ఇలాంటి ప్రశ్నలు వేసి, సాహిత్యాన్ని "పరిరక్షించా"నని భావించుకుంటాడు. లెనిన్ ఎవడు? కేవలం ఒక రాజకీయవాది! కావ్యాలూ, నాటకాలూ "అమూల్య"మైన కళా విశేషాలు. (ధనస్వామ్యం వాటి మూల్యాన్ని నిర్ణయిస్తూ ఉంటుంది లెండి). కళలు రాజకీయాలకి మీదుగా (లేక కిందుగా, విమర్శకుడికీ పాలకవర్గానికీ ఉన్న సంబంధాన్నిబట్టి) ఉంటాయి. ఆహా! పాలకవర్గం. పీడితవర్గం. వర్గాల సంఘర్షణ. సరిగ్గా ఈ గతి తర్కంమీదనే కార్ల్‌మార్క్స్ తన భావికాలపు స్వర్గభవనానికి స్పష్టమైన రేఖా చిత్రం గీశాడు. అయితే మార్క్స్ స్వప్నశీలి! ఏవో పిచ్చి ఆలోచనలు చేసేవాడు! ఆ స్వప్నాన్నే వాస్తవం చేశాడు లెనిన్. (ఈనాటికీ కొంతమందికి కమ్యూనిష్టు మానిఫెస్టో కరాళదుస్స్వప్నమే!) మయకోవస్కీ చెప్పినట్లు మార్క్స్-

"అదనపు విలువను దొంగిలిస్తున్న
కన్నపు దొంగల్ని కన్నంలోనే పట్టుకున్నాడు."

లెనిన్ అదనపు విలువ సృష్టిస్తున్న వారికి అధికారం హస్తగతం చేశాడు. ఆ సుముహూర్తంలోనే ఒక నూతన ప్రపంచం ఆవిర్భవించింది.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది."

అని పాడే డొక్క తెలుగు కవి. ఎవడోకాదు, ఇప్పుడు మీ యెదుట నిలుచున్నవాడే. ఈ మరో ప్రపంచం పిలిచిన క్షణంలోనే ఆధునికాంధ్ర కవిత్వం జన్మించింది. ఎలాంటి సందేహమూ లేకుండా ఈ గీతానికి కర్తృత్వం వ్లీడిమిర్ ఇల్యిచ్ లెనిన్‌కు అందజేస్తున్నాడు. (అప్పటికింకా నేను అమెరికన్ జర్నలిస్టు జాన్‌రీడ్ రాసిన "ప్రపంచాన్ని కుదిపి వేసిన పదిరోజులు" అనే గ్రంథాన్ని చదవక పోయినా).

శ్రామికజన విప్లవానికి మంత్రసానితనం వహించి లెనిన్ సామ్యవాదమనే "నగ్నమైన ఎర్ర నెత్తుటి కందు" జన్మించడానికి తోడ్పడ్డ సమయంలో పుట్టిన బిడ్డను పురిటిలోనే గొంతునులుమి చంపడానికి ప్రపంచంలోని అభివృద్ధి నిరోధకు లంతా శ్రీమాన్ విన్‌స్టన్ చర్చిల్ అండ్ కంపెనీ నాయకత్వంకింద గూడుపుఠానీ చేశారు. కాని ఆ ఆటలేవీ సాగలేదు. ఎంచేత ? "రష్యా జోలికి పోవద్దు" అని గర్జించింది యావత్ప్రపంచ కార్మిక వర్గం. "అన్ని అధికారాలూ సోవియట్లకే" అని ఆజ్ఞాపించాడు లెనిన్. బైబిల్ అంటుంది: "ప్రపంచమా! జన్మించు అన్నాడు భగవంతుడు. ప్రపంచం జన్మించింది" అని! బైబిల్‌ను భగవద్గీతగా నమ్మేవాళ్ల ఇదే సువార్తగా అంగీకరించుకోవచ్చు! కాని, నిరీశ్వరవాదినైన నేనుమాత్రం వాస్తవానికి దగ్గరలో ఉన్నానని భావిస్తూ, "సామ్యవాదమా జన్మించు! అని లెనిన్ అనగానే సామ్యవాదం జన్మించింది" అని నమ్ముతున్నాను.

ఈ లెనినిస్ట్ సింక్రోట్రాన్ (ఎలెక్ట్రాన్‌ల వేగం హెచ్చించే యంత్రం) నా భాషలోని అత్యుత్తమ సృజనాత్మక రచనలకి ఉత్తేజం ఇస్తోంది. మన దేశం లోని తతిమ్మా జాతీయభాష లన్నింటిలో ఏంజరుగుతోందో చెప్పగల అర్హత నాకు లేదుగాని అన్ని భాషల్లోనూ కొంచెం అటూఇటూగా కవిత్వం నూరు డిగ్రీల కొలతకు చేరుకుంటున్నట్లు నా చర్మంతో గ్రహిస్తున్నాను. చారిత్రకంగా తెలుగులో అభ్యుదయ సాహిత్యోద్యమం 1930-40 మధ్యని ప్రారంభమయింది. ఈ శతాబ్దంలోనే నా "మహాప్రస్థానం" గీతాలలో అనేకం రూపొందాయి.

సాహిత్యరంగంలో లండన్‌లోని ఇండియన్ అభ్యుదయ రచయితల ప్రణాళికా, రాజకీయరంగంలో ఆర్థిక మాంద్యమూ, తత్ఫలితమైన సామాజిక అశాంతీ సూటిగా నా రచనలెన్నిటికో ప్రోద్బలం ఇచ్చాయి. ఆ తర్వాత తెలంగాణా అగ్నిపర్వతం బద్దలయింది. అప్పుడు "త్వమేవాహం"అంటూ గొంతు చించు కున్నాడు ఆరుద్ర. (మొదట్లో ఆ కావ్యాని కతడుపెట్టిన పేరు "తెలంగాణా") అంతస్సుకీ, ఆకృతికీ సమన్వయం కుదిరిన కావ్యం "త్వమేవాహం." అంతస్సు ఆనాటి అశాంతి, ఆకృతి ఆరుద్రకి మాత్రమే సాధ్యమైన ఛందస్సర్కస్ !

జానపద కళారూపాలు విప్లవాత్మను సంతరించుకొని రంగంలోనికి దిగేయి. ప్రత్యేకాంధ్రరాష్ట్ర మహోద్యమానికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయ కత్వం వహించింది. ప్రజాబాహుళ్యం అందుకు బాసటగా నిలిచింది. అదే సమయంలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి అభ్యుదయ రచయితల సంపూర్ణ సహకారంతో "ముందడుగు", "మా భూమి" వంటి రక్తానికి విద్యుచ్ఛక్తినిచ్చే నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించింది. ఆంధ్రా, తెలంగాణా ఉద్యమాలనుంచి ఊపిరి పీల్చుకుంటూ, వాటికే ఊపిరిపోసిన ఈ నాటకాలు నాటక ప్రదర్శన ప్రక్రియను సమూలంగా మార్చివేశాయి. నిజంగా అదో ప్రజానాట్యవేదిక ! కల్పిత సన్నివేశాలులేవు, కృత్రిమ నటనా పద్ధతిలేదు. అది పసరుపచ్చిక బ్రదుకు. ఇక్కడది, ఇవాళది. (ఇక్కడో చిన్న తమాషా చెప్పానా ? ఈ నాటక ప్రదర్శనాలని ఉమ్మడి మద్రాసు మంత్రి చూసి కళ్లెంట నీళ్ళు పెట్టుకున్నాడు. మర్నాడు కమ్యూనిస్టు పార్టీని నిషేధించాడు).

కీ. శే. డాక్టరు రాజారావు ప్రజా నాట్యమండలికి ప్రచండ ప్రచాలకుడు. అతనో మనిషికాదు యంత్రం, మహానటుడు. ప్రాచ్య పాశ్చాత్య నాటక పద్ధతు లన్నీ క్షుణ్ణంగా ఆకళించుకున్నవాడు. సాధికారంగా నాటకరంగాన్ని శాసించ గలిగినవాడు. తాను చేబట్టిన అన్నింటికీ తన హృదయమూ మనస్సూ అంకితం చేసినవాడు. అతని మరణంతో మరణించింది ప్రజానాట్యమండలి. కాని నేనింకా ఆశావాదినే. టాపు లేపేస్తూ చిందులు వేసిన నటునికన్నా రంగస్థలం గొప్పది. మళ్ళీ త్వరలోనే పుంజుకుంటుంది నాట్యరంగం. ఇందు కీనాడు కనిపించే సూచ నలు కోకొల్లలు.

క్రమక్రమంగా, నిమ్మళంగా, కనిపించకుండా శిథిలమై పోయింది అభ్యు దయ సాహిత్యోద్యమం. అదే సమయంలో అమెరికన్ విషధూమాలు సర్వత్రా

పైచేయి సంపాదించాయి. సెక్సు, నేరం, హింస మొదలైన సంగతుల కంకిత మైన చవక పుస్తకాలు బైలుదేరి గ్రంథ విక్రయశాలలమీద దురాక్రమణ చేశాయి. హాలీవుడ్‌నుంచి వచ్చే ఫిలింలకి మన పవిత్ర సెన్సారులు "ఏ" సర్టిఫి కేట్లిచ్చారు. జాతీయ సినీమా (శిల్పచిత్రాలనితీసే నేరం ఎప్పుడూ చెయ్యనిది) ఎంగిలిమెతుకులమీద బతుకుతూ అవినీతిమీద బలిసింది. సెక్సు, డిటెక్టివ్ నవలలకి గిరాకీ హెచ్చింది. అంతర్జాతీయ అభివృద్ధి నిరోధికత్వానికి అది అడ్డులేని రహదారి, అమెరికావాడి విప్లవవ్యతిరేక ఎగుమతి గెలుస్తున్నట్టే ఉంది. ఏం? ఘనాలో ఎన్‌క్రుమా (ఆఫ్రికన్ లెనిన్ అనిపించుకున్నవాడు) పదభ్రష్టుడయాడు. ఇండోనీసియా డాలర్‌డెమోక్రసీకి సురక్షితమయింది. దక్షిణ అమెరికా (క్యూబా మినహా) ఓ. యే. యస్. గాళ్ళ, సి. ఐ. ఏ. గాళ్ళ గుప్పిట్లో ఇమిడింది. ఔనండీ అయ్యా! భూగోళపు పోలీసోడు అంకుల్‌శామ్ గొప్పగా వ్యాపారం చేస్తున్నాడు. యధాస్థితిని కాపాడుతున్నాడు. అందుకవసరమైన వెధవ లందర్నీ పోగుచేస్తున్నాడు.

లెనిన్, గొంతుచించుకుని అరిచిన పెట్టుబడిదారీ విధానపు అస్తవ్యస్తా లెక్కడ? మార్క్సిజానికి కాలదోషం పట్టిందా మన మధ్య తరగతి మేధావులు చెప్పేటట్లు? ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం ఏమయింది? ఎన్నాళ్ళుగానో మనం వింటూన్న వర్గరహిత సమాజం ఇప్పు డెక్కడుంది? ఇదిమాత్రం విస్పష్టం. లెనిన్ దేవుడి సాయంలేకుండా అన్నాడు ఇవాళ కాకపోతే రేపైనా నా మాట నిజం అని. పెట్టుబడిదారీ విధానపు అస్తవ్యస్తాలు పైపైకి పొక్కుతూనే ఉన్నాయి. భూగోళం సర్వత్రా ధనవంతులు ధనవంతులవు తున్నారు. దరిద్రం పెరిగిపోతోంది. ఫలితంగా అమెరికా మామయ్య భయంతో వణికిపోతున్నాడు. కార్ల్‌మార్క్సు భగవంతుణ్ణి సంహరించాడు కాబట్టి. రత్నా లొకవేపూ నత్తగుల్లలొకవేపూ చేరుకుంటున్నాయి. కాలదోషం పట్టింది మార్క్సి జానికికాదు. మధ్య తరగతి మేధావులకే. భగవంతుడూ, మధ్య తరగతులూ ఒకసారే అంతరించిపోతారు.

మరేం సందేహంలేదు. లెనిన్ ఎప్పుడూ భగవంతుడిమీద ఆధారపడ లేదు. మనిషిని నమ్మేడతను. మనిషిలో అంతర్గతమైన మంచితనాన్ని నమ్మే డతను. సామాజిక మానవుని సృజనాత్మక శక్తిని నమ్మేడతను. పాతరాతియుగపు మానవుడు తలకాయెత్తి నక్షత్రాలని చూస్తే, ఫ్రెంచి శిల్పి రొదాన్ తనలోకి

చూస్తూ పుణ్యపాపాలను సమీక్షిస్తే, మానవుణ్నే తలపోశాడు లెనిన్! సంపన్న సమాజం లెనిన్ ధ్యేయంకాదు. ఎవడిష్టం వాడిదనే సమాజం కూడా కాదు. లెనిన్ తన యావజ్జీవితం మనిషి శరీరవాంఛలకీ, మానసిక స్వాతంత్ర్యానికీ కావలసిన కారుణిక సంఘంకోసం కృషిచేశాడు. దీన్ని సాధించడానికి ఏ దేవుడి ఆశీర్వాదాలూ అతడు కోరలేదు. ఈ వ్యవహారాల్లోకి నువ్వు రావొద్దురా అని ఆ దేవుణ్ణి బహిష్కరించాడు.

అందుకే ఈనాటి అతి నవీన కవులంతా ఈ నిరీశ్వరవాదాన్ని తమదిగా స్వీకరించారు. లెనిన్ జెండా పట్టుకున్నారు. మార్క్స్ సందేశం అందుకున్నారు. "మనిషిని మనిషి పీడించడం పనికిరాదు!" అన్నదే వాళ్ళ పాటలకి పల్లవి. నిన్న వాళ్ళలో కొందరు దిగంబరకవులు, తిరుగబడుకవులు, సంఘర్షణకవులు. ఇవాళ ఈ 1970 నించి ఈ అందరూ ముక్తకంఠంతో ఇలా ఘోషిస్తున్నారు :

"జేహోవా మర్గయా! జిందాబాద్ లెనిన్".

సామాజిక దృక్పథం లేకుండా ఏ కళా శక్తివంతం కాలేదు. అది లోపించిన కారణంచేతనే కళలు ఇంతగా విజృంభిస్తున్నా, మన సంస్కృతి అధోగతికి దిగజారిపోతున్నది. సరయిన సామాజిక దృక్పథాన్ని అలవరచుకోవటానికి కళాకారులు పెద్ద తపస్సే చేయాలి; దానితోబాటు అంతులేని ఆత్మపరిశోధన కూడా చేసుకోవాలి. ఇది తప్పనిసరి.

—*కొడవటిగంటి కుటుంబరావు*

సాలీడు - ఈగ

ఐ వి

సాలీడు మనకందరికీ తెలిసిందే కదా! వెలుగురాని చీకటి మూలల్లో— బానకడుపునీ, వంకరకాళ్ల తో వికృతంగా వున్న శరీరాన్ని ఈడ్చుకుంటూ; నక్కి నక్కి పాకుతూ, అమాయకంగా ఎగిరే ఈగల్ని పట్టి పల్లార్చే ప్రాణాంతకపు వ్యూహాన్ని—తన వలని—అల్లుతోంది అక్కడ చూడండి. ఆ గాజుకళ్లతో తెప తెపా చూస్తూ, వాడిగా వంకర్లు తిరిగిన పొడుగాటి ముందు కాళ్లతో ఈగల్ని ఇట్టేపట్టి పీక నులిమేస్తుంది ఈ భూతం—ఇదే సాలెపురుగు.

చూడండి, చూడండి. ఆమూల చలనంలేకుండా ఎలా పొంచి కూచుందో. ప్రాణాంతకమయిన ఆ వలని ఎంత నాజూగ్గా, ఎంత సున్నితంగా, ఎంత అందంగా అల్లిందో చూడండి. ఏదైనా పురుగు అమాయకంగా యిటువచ్చి, ఆ వలలో చిక్కుకుని తనపాలపడేవరకూ అది అలాగే చలనం లేకుండా, నంగ నాచిలా పొంచి పొంచి కూచుంటుంది. తీరా, ఏదైనా ఎగురుతూవచ్చి ఆ గూట్లో చిక్కుకుంటే—ఒక్కసారి మీదపడి, అదిగిలగిలా తన్నుకుంటూవుంటే నిర్దాక్షిణ్యంగా పీకనులిమి చంపుతుంది. ఎంతగింజుకున్నాసరే ఒకసారి అందులోకి వచ్చిన పురుగు మరి బయటికిపోయే సందులేకుండా వుండడానికి తనవలని ఎంతో దృఢంగా, ఖచ్చితంగా తయారు చెయ్యడానికి ఈ కిరాతకపు సాలీడు ఎంతో కాలాన్ని వృధా చేస్తుంది; ఎంతో శ్రమపడుతుంది; ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. ముందు ఆ చివరనించి ఈ చివరికి ఒక దారం పేనుతుంది. తరవాత దానిమీద అటునించి ఇటూ, ఇటునించి అటూ అడ్డుగా, నిలువుగా, ఐమూలగా, చక్రాలుగా—అలా ఒకటి రెండు, మూడు—అనేకం దారాలు చిత్ర చిత్రంగా అల్లి వల ఎంతో దృఢంగా తయారు చేస్తుంది. అందుకే, అందులో చిక్కుకున్న జీవి మరణ వేదనతో కొట్టుకులాడినప్పుడు, ఆ వల చిరిగిపోదుసరికదా, ఒక్క దారమైనా తెగదు.

అలా వల తయారుచేసి, అంతా సిద్ధంచేసుకుని, ఇక ఎవరూ తప్పించుకోలేరని తేల్చుకుని సాలీడు తన మాటులోకి తప్పుకొని నక్కి కూచుంటుంది.

ఆకలితో ఎగురుతూ ఎగురుతూ ఆహారం వెతుక్కుంటూ ఏదో ఒక ఈగ అటు రాదా అని చూస్తూ వుంటుంది.

అలా ఎంతోసేపు వేచివుండే పనేలేదు. ఆకలితో అలమటిస్తూ అటూ ఇటూ ఎగురుతూ వచ్చి మరో గత్యంతరంలేని ఆ చిన్ని అమాయపుటీగ తన ముందు ప్రత్యక్షమైన ఆ అందమైన వలలో అనుకోకుండానే అడుగుపెడుతుంది. అంతే! ఇక అసహాయంగా అక్కడే అతుక్కుపోవల్సిందే! బయట పడ్డానికి గింజుకు గింజుకు ఇంక అలా అడుగంటి పోవల్సిందే!

అలాగే ఏదైనా ఒక పురుగు పట్టుబడ్డాక, సాలీడుగారు నెమ్మదిగా తమ మాటువిడిచి బయటికి వస్తుంది. తన కొక్కెల కాళ్ళు సవిరించుకుంటూ, రక్త దాహంతో ధీమాగా, తక్కుతూ, తారుతూ, తీవిగా పురుగుని సమీపిస్తుంది. ఒకసారి తన వ్యూహంలో చిక్కుకున్న జీవి ఇక వచ్చేవరకూ తప్పించుకుపోలేదని ముందే తెలుసుకదా! మరింక ఆతృత ఎందుకూ? మిడిగుడ్లు వేసుకొని, కొర కొరా చూస్తూ, నిదానంగా, ధీమాగా, విలాసంగా సాలీడు దగ్గరవుతోన్నకొద్దీ మన ఈగకి తెలివి తప్పినంత పనయి ప్రాణాలు తారెత్తుతూ వుంటాయి. దగ్గరవుతున్న మృత్యుదేవతని చూస్తూ, ఆ ప్రాణి భయంతో నిలువెల్లా వణికిపోతూ, శక్తినంతా కూడదీసుకుని, పెనవేసుకుపోతున్న ఆ వురితాళ్ళ నుంచి తప్పించుకోడానికి ఎంతగానో విఫల ప్రయత్నంచేసి, ఆఖరికి అలసటతో అసహాయంగా అలాగే పడిపోతుంది.

ఇవన్నీ వృథాప్రయాసలు. ఫలితంలేని పరుగులు!! గింజుకుంటున్న కొద్దీ వల మరీ బిగుసుకుపోతూవుంటుంది. సాలీడు మీద కురుకుతుంది. విడిపించుకోడానికి చేసే ఒకొక్క కదలికకీ, వురి మరింత బిగిసిపోతూ, మరిన్ని కొత్త దారాలు పెనవేసుకుపోతూవుంటాయి. అలా పెనుగులాడి పెనుగులాడి, అలసిపోయి ఇక పెనుగులాడే శక్తిలేక ఆ ఈగ నిస్సహాయంగా, ఇక చేసేది లేక ఆ దుష్ట శత్రువు చేతుల్లో చిక్కి, లొంగిపోక తప్పదు.

అప్పుడు ఆ రాక్షస సాలీడు, బొచ్చుతో వికృతంగా వున్న తన పొడుగాటి చేతులు చాచి, ఆ జీవిని అందుకొని, మేస్తుంది. మరణ భీతితో వజవజా వణికిపోతున్న దాని ఒంట్లోంచి విలాసంగా రక్తం పీల్చడం ప్రారంభిస్తుంది. ఒకటి, రెండు, మూడు—అలా తన ఇచ్ఛానుసారం ఎన్నిసార్లయినా తనివితీరే వరకూ రక్తం జుర్రుకుంటుంది. తన దాహం కొంత చల్లారితే, అప్పటికి ఆ

జీవిని సొంతం చావనియ్యకుండా అలాగే అట్టే పెడుతుంది. మరోసారి తిరిగివచ్చి మళ్ళీ రక్తం జుర్రడం ప్రారంభిస్తుంది. అలాగ ఆ పురుగు శరీరంలో రక్తం గాని. మరింక ఏమాత్రం తడిగాని మిగలనంతదాకా పూర్తిగా అడుగంటి పోయే వరకూ నిస్సంకోచంగా, నిర్దాక్షిణ్యంగా తృప్తిగా పీలుస్తుంది. అలా అడుగంటి పోయి దుర్భర మరణ హింసలు భరిస్తూ, ఆ చిన్న జీవి అక్కడే ఎంతోసేపు యాతన పడితేనే తప్ప చావుకూడా వెంటనే రాదు.

తన వలలో పడ్డ పురుగులో అణుమాత్రమైనా జీవంగాని; ఆ కళేబరంలో ఏ కొంచెమయినా రసిగాని వున్నట్టు అనిపించిందా, ఆ దురాశా పిశాచం మరింక తన దృష్టిని అక్కణ్నించి మరల్చదు. తన పాలబడ్డ ప్రాణిలో జవం. జీవం పూర్తిగా వూడ్చేసి రక్తం ఒక్క చుక్కకూడా మిగలకుండా లాగేసి. ఇక ఆ కళేబరంలో అనుమానించడానిక్కూడా ఏఁవీ లేదన్నప్పుడు మాత్రమే–ఇక అది ఎందుకూ పనికి రాదనుకుంటేనే–దాన్ని వదిలేస్తుంది.

రక్త మాంసాలు వూడ్చి పెట్టుకుపోయి, చచ్చి, బెండులా ఎండిపోయి, తేలిగ్గా చిన్న చెత్త కాయితం ముక్కలా పడివున్న ఆ నిరుపయోగమైన శేషాన్ని, దయామయమైన ఒక మరుద్వీచిక ఆ వలనించి తొలగించి, దూరంగా తీసుకు పోతుంది— ఇహ అప్పుడేఁ వుంది గనక ?.... అంతా సరి !!

ఆ సాలీడు మాత్రం, తృప్తిగా త్రేనుస్తూ తన సింహాసనానికి తిరిగి చేరుకుని; లోకఁవంతా నందనవనంలా వుందనీ, న్యాయంగా బతికేవాళ్ళకి ఎప్పుడూ ఏ లోటూ వుండదనీ అనుకుంటూ నిమీలిత నేత్రాలతో భుక్తాయాసంతో పాటు నెమ్మదిగా నిమురుకుంటూ పరవశించి పోతుంది !!!

....

మీ రక్తంతో పెరవారి కండలు పెంచుతూ, చచ్చేదాకా పీల్చి పిప్పిచేయ బడుతూ, పీడించబడుతూ, పట్టణాల్లో పల్లెల్లో కాయకష్టం చేస్తున్న కార్మిక కర్షకులారా, మీరు—మీరే మీరంతా యీ దౌర్భాగ్యపు ఈగలు. బానిసలుగా పడి గాపులు పడుతున్న దేశాలు, జాతులు, మేధస్సును కుదువబెట్టి పొట్ట గడుపుకో జూచే వుద్యోగులు. కార్ఖానాల్లో పనిచేసే కార్మికులు, దౌష్ట్యాలకు అదిరి పోతున్న అమాయకురాండ్రైన ఆడపిల్లలు, కనీసపు హక్కుల్నీ అవసరాల్నికూడా నోరు తెరిచి అడగలేక పడక గదుల్లో వంట యిళ్ళల్లో పడి మగ్గిపోతున్న యిల్లాళ్ళు,

సైన్యంలోచేరి తమ యిష్టాలకు వ్యతిరేకంగా, నిస్పృహతో బతుకీడ్చే సిపాయిలు. యితరుల వుపయోగానికి మాత్రమే బతుకు పరిమితమై పోయి-బతుకులు బండబారి పోయిన వాళ్ళు. సంపదనంతా సృష్టించే మూలపురుషులు, దేశానికి మేధస్సు, శక్తి, జవము, జీవము—అంతా మీరే అయిన వాళ్ళూ, మర్యాదగా పడివుండి, నోరు మెదపకుండా నిర్భాగ్యంగా అంతం కావడం తప్ప యిక యే హక్కూ పొందని వాళ్ళూ, మీరు—మీరంతా ఈగలు కాగా; మీ తెలివితేటలతో, మీ శ్రమతో. మీ శక్తితో, మీ రక్తంతో పెరిగి. బలపడి, కొవ్వెక్కి, మీమీద అధికారం చెలాయిస్తున్నవాళ్ళు, మిమ్మల్ని అణిచేస్తున్న వాళ్ళు, మీ కధినేతల మంటున్న వాళ్ళు, వాళ్ళే ఆ దుర్మార్గపు సాలీళ్ళు.

అధికారులు, భాగ్యవంతులు. ధనోన్మాదులు, దోపిడీదారులు, వ్యాపారులు, పెట్టుబడిదారులు. వంచనాపరులు. మతాధికారులు. పీఠాధిపతులు, సమాజంమీద పడి బతికేవాళ్ళు, దురహంకారులై నిరంకుశత్వం చెలాయించేవాళ్ళు, న్యాయం పేరుతో వూపిరాడకుండా చేసే యీ ఉక్కు చట్టాల్ని, 'న్యాయ' సూత్రాల్ని రచించిన నియంతలు. మనల్ని బానిసలకన్న కనాకష్టంగా పీడించే వాళ్ళు—వాళ్ళంతా ఆ సాలీడు పిశాచాలు. మన శ్రమ శక్తిమీద, జన సామాన్యపు కష్ట ఫలంమీద బతుకుతూ, మనల్ని పాదాల కింద తొక్కివుంచి. మన బతుకుల్నీ బాధల్నీ వెటకారం పట్టించి ఆనందిస్తూ, విముక్తికి మనం జరిపే పోరాటాన్ని అవహేళనచేసే పందికొక్కులు వీళ్ళు—వీళ్ళంతా సాలెపురుగును మించిన రాక్షసులు.

పొట్టకూటికై కష్టంచేస్తూ ఫ్యాక్టరీ యజమానులు విధించే అమానుష శాసనాలకి గురిఅవుతున్న నిర్భాగ్యులైన కార్మికులే యీ ఈగలు. రోజుకు పన్నెండు పదమూడు గంటల పనిరాబడుతూ, ప్రతి కూలీ శ్రమకూ పదింతలు పైని లాభాన్ని గుంజుకుంటూ. ఆ కార్మికుడికి బతికేందు కవసరమైన కనీసపు కూలి యివ్వడానికికూడా యిష్టపడని పెట్టుబడిదారులు. పారిశ్రామిక వేత్తలు—వీళ్ళే సాలీళ్ళు.

వూపిరాడని చీకటి గుహల్లాటి గనుల్లో మగ్గిపోతూ భూగర్భంలోని సంపద వెలికితీసి, అందులో అణుమాత్రంకూడా తమకి అందక అలమటిస్తున్న గని కూలీలు మన ఈగలు.-కూలీల కష్టఫలాన్ని దోచుకుంటూ లాభాలు విపరీతంగా పెంచుకుంటూ ఎంతకూ సంతృప్తి చెందని దురాశాపిశాచాలు, పైసా కూలి

ఎక్కువ అడిగితే 'తిరుగుబాటుదారు'లని పేరు బెట్టి కిరాయి మూకల్ని పిలిచి మట్టుపెట్టించే రాక్షసులు—వీళ్ల సాలీళ్లు.

ఇంటా బయటా కార్ఖానాల్లో తమ వయస్సుకు, తాహతుకు మించిన చాకిరీ నెత్తిన వేసుకుని, కాయకష్టంచేసి నాలుగు డబ్బులార్జిస్తే తప్ప బతుక్కి భరోసా లేని చిన్న పిల్లలు యీ నిర్భాగ్యపు ఈగలు. అయితే, వీళ్ళను లేతవయస్సు లోనే తలకు మించిన పని భారానికి తరుముతున్న వీళ్ళ తలిదండ్రులు కాదు సాలీళ్ళు. వాళ్ళు తమ యిష్టానికి వ్యతిరేకంగా, కుటుంబ భద్రతకి గొడ్డలిపెట్టుగా పిల్లలచేత పని చేయించుకోక తప్పని అవసరం కల్పిస్తూ, మరొక గత్యంతరం లేకుండా చేస్తున్న యీ దుష్ట వ్యవస్థ-యీ విషవలయం-దీన్ని భద్రంగా కాపాడుతున్నవాళ్ళు—దీనికి కారకులైనవాళ్ళు—వీళ్ళే యీ సాలీళ్ళు.

ఎంత నీతిగా నిజాయితీగా బతుకుతెరువు గడుపుదామనుకున్నా, ఫ్యాక్టరీ యజమానులకీ, అధికారులకీ వాళ్ళ ఆశలకీ బలి అయి మానంకూడా పణంగా పెడితే తప్ప పని దొరకని గతిమాలిన ఆడకూతుళ్ళు మనం చెప్పుకుంటున్న నిస్సహాయపు పురుగులు. వ్యక్తిత్వంలేని భోగ్య వస్తువుల్లాగ, అవసరానికి వాడుకుని అక్కర తీరగానే—అపేక్ష, మానవత, జాలీమాట అటుంచి—కనీసపు సానుభూతి అయినా లేకుండా-తాము ప్రసాదించిన మాతృత్వాన్నయినా లెక్క చెయ్యకుండా—కేవలం తమ 'మర్యాద' కాపాడుకోడానికి, వాసనచూసి పారేసే పువ్వుల్లా ఆడపిల్లల్ని అనుభవించి అవతలకి నెట్టేసే యీ 'మర్యాదస్థులు' సోమరిపోతు నయవంచకులు-వీళ్ళే సాలీళ్ళు. అశుభం శుభం తెలీని ఆడ కూతుళ్ళని చెరబట్టడం, దిగవిడవడం వీళ్ళకి పరిపాటి—సరదా. అసలు ఎంత ఎక్కువ మందిని చెరిస్తే అంత మర్యాదస్తులయినట్టు గొప్పలు పోతారీ సాలీళ్ళు.

హలంపట్టి పొలం దున్ని చెమటోడ్చి చేలను పండించే ఓ కూలీ! రైతూ!! నువ్వు, నువ్వు యీనాడు ఈగవు. విత్తులు నాటేది నువ్వు. పంటలు పట్టుకుపోయేది యింకెవడో. పళ్ళు పండించేది నువ్వు. ఫలహారం చేసేది యింకొకడు. పేద రైతుల్ని, రైతు కూలీల్ని, రోజంతా కాయ కష్టంచేసే వాళ్ళనీ, క్షణం విశ్రాంతిలేని శ్రమ పాలుచేసి, ఏటేటా ధరలు పెంచేసి, కూలీ రేట్లు తగ్గించేసి, శ్రమ శక్తి దోచేసి తాము మాత్రం కడుపులో చల్ల కదలకుండా సోమరిపోతులుగా ఖుషీలు, విలాసాలు వెలగబెట్టే నాటురకం భూస్వాములు-వీళ్ళంతా సాలీళ్ళు.

దేవుడిపేర, మతంపేర భయవిశ్వాసాలకు కట్టుబడిపోయి మఠాధిపతుల శాపాలకు గురిఅయినవాళ్ళం, పీఠాధిపతుల విలాసాలకీ గొప్పలకీ మనలోమనం కొట్లాడుకునేవాళ్ళం, ఒళ్ళువంచి నడుంవిరిగేలా కష్టపడుతూ ఆ కష్టఫలాన్ని యింకొకడు దౌర్జన్యంగా దోచుకుంటూవుంటే-మూఢవిశ్వాసాలతో నిర్వీర్యమై పోయిన మనస్సుల్ని యిది మన 'కర్మంలే' అని సరిపుచ్చుకు పడివుంటున్న వాళ్ళం—పీడితులం, తాడితులం మనం అందరం యీ పురుగులం. నిర్మలమైన మన మనస్సుల్లో తమ నీచమైన బోధలతో లొంగుబాటుతత్వం, బానిసత్వం నింపి, భక్తిపేరిట నరనరాల్లో పిరికితనాన్నీ చేతకానితనాన్నీ ఎక్కించి జాతి జాతినే నిర్వీర్యంచేసి ధ్వంసంచేసే పూజార్లు, శాలువలు కప్పుకు జాణతనం నెరిపే పండితులు-మఠాధిపతులూ వీళ్లే సాలీళ్లు.

ఇంతెందుకు, అణచబడిన వాళ్ళూ, దోపిడీ చెయ్యబడ్డవాళ్ళూ, బానిసలు గావించబడ్డవాళ్ళూ—వీళ్ళు—వీళ్ళంతా ఈగలు. అధికారులు, పెట్టుబడిదార్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, నిరంకుశాధికారంతో – డబ్బుతో కష్టజీవి శ్రమను దోచుకుని వాణ్ణి అణిచివుంచగలవాళ్ళు – వీళ్ళు – వీళ్ళంతా సాలీళ్ళు.

పూర్వం యీ సాలీళ్ళు పెద్దపెద్ద జమీందారీ భవంతుల మీదనుంచి రాజ ప్రాసాదాల మీదనుంచి తమ వలలు విసిరేవి; యిప్పుడు ప్రతి పారిశ్రామిక కేంద్రము వీటికి నిలయమైపోయింది. పట్టణాల్లోనేకాదు, పల్లెపట్టుల్లోకూడా యిప్పుడు ఎక్కువయి పోయేయి యీ సాలీళ్లు. ఇక్కడ అక్కడ అని తేడా లేకుండా ఎక్కడెక్కడ సామాన్యుణ్ణీ శ్రమజీవినీ మోసం చేసేందుకు అనువు దొరుకుతుందో అక్కడల్లా, ఎక్కడెక్కడ కార్మికులు, చేతిపనులవారు, కూలీలు, చిన్న రైతులూ దరిద్రులయి, పెట్టుబడిదారుల, వ్యాపారుల, దళారీల చేతుల్లో యిరుక్కుని నికృష్టంగా బతుకీడుస్తున్నారో అక్కడల్లా యీ సాలెగూళ్లు విజృం భిస్తూనే వున్నాయి.

పల్లె పట్టణం అనే తేడా లేకుండా అన్నిచోట్లా యీ నిర్భాగ్యులు శత్రువుల వలల్లో తగులుకుని ఎలా అటమటిస్తున్నారో, బయటపడటానికి ఎంత వృథా ప్రయత్నం చేస్తున్నారో, ఎలా గిలగిల తన్నుకుని యాతనలుపడి కృశించి నశించి పోతున్నారో మనం నిత్యం ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాం.

శతాబ్దాల తరబడి యీ ఘోరాలు ఎలా నిరాఘాటంగా సాగిపోతున్నాయో, బలహీనులకీ రక్తదాహంతో విజృంభించిపోతున్న ధనవంతులకీ మధ్య సాగే

పోరాటంలో ఎన్నెన్ని ఘాతుకాలు జరిగిపోతున్నాయో చరిత్ర గతి చెబుతూనే వుంది. చరిత్ర అంతా రక్తసిక్తమేకదా! సర్లెండి గతించిన దానికి బాధపడి ప్రయోజనంలేదు. జరగవలసింది చూద్దాం.

బలహీనులకు - బలవంతులకు జరిగే యీ పోరాటాన్ని నిశితంగా పరిశీలిద్దాం. మరింత స్పష్టంగా అర్థం చేసుకుందాం. పోరాటాన్ని సృష్టించిన యీ వైరుధ్యాలను పూర్తిగా ఆకళింపు చేసుకుందాం. శత్రువు మనకోసం పన్నుతున్న యీ వ్యూహాన్ని శ్రద్ధగా పరిశీలించి వాడి కూహకాలు కుట్రలు బట్ట బయలుచేసి ఎండేద్దాం. మనం అందరం కలిసి తిరగబడదాం. మనం ఒకొక్కరుగా యీ విష వలయాన్ని తెంచలేకపోవచ్చు. అందరం కలుద్దాం. మన సంకెళ్ళు వదిలించుకుని శత్రువుని మాటునుండి బయటికి లాగి అంతటా వెలుగులు నింపుదాం. మళ్ళీ మళ్ళీ శత్రువు అజ్ఞానాన్ని ఆసరా చేసుకుని చీకటి మూలల నుంచి తన ఘాతుకపు వ్యాపారం సాగించే వీలులేకుండా, అంతటా జ్ఞానాన్నీ వెలుగునీ నింపుదాం.

మనం ఈగలమే కావచ్చు; ఖచ్చితంగా నిశ్చయించుకుని నడుం బిగించి అందరం కదిలితే మనశక్తి అజేయం. సాలీళ్ళు యీనాడు బలవంతులే కావచ్చు. కాని వాళ్ళెంత మంది? అంతా కల్సివచ్చినా మనముందు ఆగలేరు. ఈనాడు మనం బలహీనులమే కావచ్చు. ఇప్పుడు మనకు ఆయుధాలుకూడా లేకపోవచ్చు. కాని జనమంతా మనమే. మనవేఁ తల్చుకుంటే, మనఁవంతా కలిసి రేగితే, ఒక్కసారి రెక్కలల్లార్చితే చాలు మనల్ని యీనాడు ఆకలితో మాడ్చి, అన్యాయంగా వంచి, నిస్సహాయంగా బంధించి వుంచిన యీ వలలూ సంకెళ్ళూ యిట్టే తునాతునకలయిపోక తప్పవు.

ఇన్నాళ్ళయి మనల్ని మగ్గ పెడుతున్న యీ దారిద్ర్యం, నిర్వేదం, దౌర్భాగ్యపు బతుకులు, ఆకలి చావులు అన్నీ ఒకసారే మటుమాయం అవుతాయి. అయితే మంత్రాలతో కాదు, మంతనాలతోకాదు, నినాదాలతో అసలేకాదు. అంతా నిర్భయంగా నిశ్చయంగా పోరాడితే యీ పరిస్థితి తప్పక మారుతుంది. మారి తీరుతుంది. పోరాటం ఒకటే మార్గం.

కాబట్టి ఓ కార్మిక కర్షక పీడిత ప్రజాసోదరులారా! అంతా ఏకంకండి. సిద్ధంకండి! పోరాడండి! పోటెత్తిన సప్తసముద్రాల్లా తిరగబడే జనవాహినికి ఎదురు నిలవగలవాడు లేడు. తిరుగులేని నిర్ణయం తీసుకోండి. తిరగబడ్డమే న్యాయం. పోరాడ్డమే కర్తవ్యం!

('లీబ్నెక్టిచ్' జర్మన్ మూలానికి ఇంగ్లీషునుంచి తెలుగు సేత)

కొక్కొరోకో

రెంజిమ్

కొక్కొరోకో అని కోడికూసింది
మబ్బులన్నీ దాటి మన అన్న సూరీడు
మారేడు కొండల్లొ మాటుకాశాడు!
చీకట్ల దొరలను చీల్చి వేస్తున్నాడు!
కొక్కొరోకో అని కోడి కూసింది!
నిదురపోయే సీమ కదల బారింది!

ఈనీన వరిచేను పాలుబోసింది
పాలుబోసిన చేను అ్రరువంచింది
అ్రరువంచిన చేను కోతకొచ్చింది
కోతకొచ్చిన చేను కోతకోరింది!
కక్కుకొట్టాలిరా కొడవళ్ళకు - ఇంక
పదును పెట్టాలిరా! కొడవళ్ళకు!
కొక్కొరోకో అని కోడికూసింది!
నిదురపోయే సీమ కదలబారింది!

ఏత మెత్తినవాడ! ఏరుకట్టినవాడ!
నారు పోసినవాడ! నీరు పోసినవాడ!
దుక్కిదున్నినవాడ! మొక్కనాటినవాడ!
కలుపుతీసినవాడ! కలతమోసినవాడ!
కోతకొచ్చిన చేను కోతకోరింది
కోతకాలము నిన్ను కోరి పిలిచింది!

కక్కు కొట్టండిరా! కొడవళ్ళకూ - ఇంక
పదను పెట్టండిరా! కొడవళ్ళకు!
కొక్కొరోకో అని కోడికూసింది!
తూరూపు కొండంత జేవురించింది!
నీలాటి రేవంత నిగ్గు తేలింది!
కోతకొచ్చిన చేను కోత కోరింది!
కోతకాలమె నిన్ను కోరిపిలిచింది!

విప్లవ పరివ్రాజకుడు

వినాకపాణి

అర్జెంటైనాలో పుట్టి,
క్యూబా విప్లవ విజయపతాకం ఎగురవేసి,
బొలీవియాని విముక్తిచేసే సంకల్పంలో,
ట్రూజిల్లో, బాటిస్టా మొదలైన
నరహంతక నియంతలపై
తిరుగులేని తిరుగుబాటుజెండా ఎగరేసిన,
ఒక నిజమైన అంతర్జాతీయవాది
కన్ను మూశాడు.
తాత్కాలికంగా విషాదం తాండవించినా
ఇది గర్వపడతగిన సమయం!
ఒక స్వచ్ఛమైన కమ్యూనిస్టు సైనికుడు
జీవితానికి ఆశయాలకి
వైరుధ్యం లేదని

మరోసారి ఋజువు పరిచాడు!
అల్పుల అల్పత్వాన్ని మరోసారి
బహిర్గతపరిచాడు!
దేశ దేశాల ఎర్రజెండాలు
కోట్లాది ప్రపంచ శ్రామిక హృదయాలు
అవనతం చెయ్యండి!
ఇది గర్వపడతగిన సమయమే ఐనా
తాత్కాలికంగా విషాదకర సమయమే
నీ మరణాన్ని మా హృదయాల్లో ధరించి
తిరుగుతున్నాం
హంతకులెప్పుడూ అనామకంగానే
ఉండిపోతారు
వీరులస్మృతి శతాబ్దాలమీదుగా
కోట్ల కోట్ల హృదయాలమీద
చరిత్ర పుటలమీద
శాశ్వతంగా పరుచుకొంటుంది!
విప్లవాన్ని గువేరా అని పిలుద్దాం!
సాహసాన్ని గువేరా అని పిలుద్దాం!
త్యాగాన్ని గువేరా అని పిలుద్దాం!
మనుష్యుడిలోమండే స్వాతంత్ర్యకాంక్షని
మనుష్యుడిని కదిపే మానవత్వాన్నీ
ఆదర్శాలని, ఆశయాలనీ
గువేరా అని పిలుద్దాం!!

*   *   *

నత్తల్లాంటి, వానపాముల్లాంటి, బొద్దింకల్లాంటి
బ్రతుకులు బ్రతికేవాళ్ల

నిన్ను కీర్తించటానికి తగరు
అర్థం లేని బ్రతుకులు ఏళ్ళతరబడి పొడిగిస్తూ
షష్టిపూర్తులూ, సన్మానాలూ చేయించుకునేవాళ్ళకు
నిన్ను కన్నెత్తి చూడటానికికూడా హక్కులేదు
పనికిరాని సభల్లో
వ్యర్థమైన వాదోపవాదాలు సాగిస్తూ
అదే సర్వస్వం అని భ్రమించేవాళ్ళకు
నీ కార్యాచరణని గురించి
తలపోసే హక్కుకూడా లేదు.
ఆత్మహత్యలు చేసుకొనేవాళ్ళు,
అయిదు రూపాయలకి అయిదేళ్ళ
స్వాతంత్ర్యాన్ని అమ్ముకొనేవాళ్ళు,
ఇంక్రిమెంట్లకి సంతృప్తి పడేవాళ్ళు,
లంచాలు, మామూళ్ళమీద బ్రతికేవాళ్ళు,
దేశదేశాలా అడుక్కుతినే వాళ్ళు
ఆత్మగౌరవం లేని దౌర్భాగ్యులు
వీళ్ళకి గువేరా పేరు వింటే
గుండెలు స్పందించవు

* * *

సర్వసుఖాలు త్యజించి
విప్లవం కోసం పరివ్రజించిన
గువేరా భావనని మనం పంచుకొందాం:
కమ్యూనిజం నా భవిష్యత్తు
ప్రియురాలి కౌగిలి
కవితోద్రేకం
అద్భుతావహ సంగీతార్ణవం

ప్రథమ ప్రణయపు పులకరింపు
మేధో ప్రేరక కల్లోలం
ఇన్ని కోట్లాది మానవులకు
హార్దిక సంఘర్షణలు,
ఆర్థిక సంక్షోభాలు
లేని సమాజాలు ఏర్పడి
మనస్సులు శాంతితో నిండితే
పువ్వులింకా అందంగా వికసిస్తాయి!
ఉషఃకాలాలింకా అందంగా ఉదయిస్తాయి!
నక్షత్రాలింకా అందంగా వెలుగుతాయి!
అందాకా జీవితాలు
సంఘర్షణకీ విప్లవానికీ అంకితం కావాలి!

ఎన్నికల గారడీ

ఎర్రయ్యా

నిరుపేద ఓటరూ,
నీ నెత్తురంతా చెమటలో కరిగించి
నీ శక్తినంతా మట్టిలో కురిపించి
నీ ఆశలన్నీ ఓటులో మరిపించి
నీ పోరాటం స్వభావాన్ని మరిపించి
నీ బులెట్ చేవను
బ్యాలెట్ కాగితాల్లోకి మార్చుకుంటున్నారు
దోపిడీ దొంగలు.

ఆయుధంవంటి నీ చెయ్యి
నాగలివంటి నీ చెయ్యి
కొడవలివంటి నీ చెయ్యి
గొడ్డలివంటి నీ చెయ్యి
అనేకానేక బలవంతమయిన పనిముట్లను
తాకితేచాలు సంపదలుగామార్చే నీ చెయ్యి
మిట్టలూ, పల్లాలు, బురదా, రాళ్ళూ
దున్నేసి
కంచెలూ కలుపూ కోసేసి
చెట్లూ గడ్డలూ అడ్డాలు నరికేసి
జలప్రవాహంలా సాగిపొయ్యే నీ చెయ్యి
లోని ఐదువేళ్ళరక్తం
ఐదేళ్ళరాజీ పత్రంమీద
(వేలి)ముద్ర వేయడానికే అమ్ముడుపోతుందా
ఒకసారి కళ్ళు తెరిచిచూడు
ఓట్లకోసం ఎన్నికలపై పంచెపరచి
పార్టీలగారడీవాళ్ళు
వాగ్దానాల మాయావృక్షాలు మొలిపిస్తున్నారు
శ్రమఫలం విలువతెలిసిన నువ్వు
కనుకట్టుగారడీవిద్యకు మోసపోతావా

న్యాయం అవసరంలో కలిసిపోతున్నది.

—రామరాజు జనార్దనరావు

జీవితం అంటే

మరువాడ రాజేశ్వరరావు

జీవితం అంటే, సర్వేశ్వరా!
అంతా నీ సృష్టి
అంతా నీ లీల!
అని వెనుకటికో వెఱ్రి బ్రాహ్మడంటే
'ఎవర్నడిగేడా' అని
చెట్టు, పుట్ట, కొండ, గుట్ట
మొహాలు చూసుకొన్నాయిట
ఎండ పీల్చుకుని,
చెమట కక్కుకుని,
పగళ్ళు, రాత్రుళ్ళు
ఒళ్ళు పిండుకుని
పండించిన ఫలితాన్ని
భూస్వామికి ధారపోసి
నీరసంగా యిల్లు చేరుకున్న
రైతు కూలీని చూసి,
జీవితం అంటే
అంధ విశ్వాసం కాదని
చెప్పబోయి, చెప్పలేక...
చెప్పలేదు నేల తల్లి
పళ్ళు, పాలు భోంచేసి
కాళ్లు పిసికించుకుంటూ
మిథ్యాకర్మ సిద్ధాంతాలు

వమనం చేసే మతాధిపతుల
అజ్ఞాన వ్యాపారం
జీవితం కాదని
చెప్తున్నాయి కాషాయాంబరాలు
మొగాడి శక్తిని, ఆడదాని శీలాన్ని
బంధుత్వాల అనురాగాన్ని
ధర్మదేవత కుంటికాలుని,
న్యాయస్థానాల పునాదిరాళ్ళని
బజారులో బేరం చేసేది
జీవితం కాదని
సత్తు అర్ధ రూపాయొకటి
చెప్పింది నిన్న.
అధికారం అనుభవించే ఆశతో
ఎప్పుడూ పంట్లాలు దించుకుని
ఎదురు చూసే
ప్రజా ప్రతినిధుల
అరాచక రంకు లంజా స్వామ్యం
జీవితం కాదని,
వోటు ముద్రపడ్డ
కాగితం ముక్క చెప్తోంది
జీవితం అంటే,—
రోజులు కాదు,
నెలలు కాదు,
ఏళ్లు కాదు,
తరాలు...
తరాలుగా

చెమటోడ్చి శ్రమిస్తూ
నాగరికత పండించి,
సంపదలు పెంచి,
సుఖాలు పూయించి
అధికారపుముళ్లు గుచ్చుకుంటూ,
దారిద్ర్యపు ఎరువుమోస్తూ,
రోగాలనీ, రొచ్చునీ
కన్నీళ్లనీ, అశాంతినీ
వారసత్వంగా భరిస్తున్న
సామాన్యుడి సృష్టి...
వేల వేల, యుద్ధాల
క్షతగాత్రుల
విముక్తిపోరాటం!
కూలి, నాలి, కర్షక, కార్మిక మహాజనం
పరాక్రమించి
స్వాధీనం చేసుకునే
ప్రాథమిక హక్కు!

ఒక్క తిండేకాదు— ఈనాడు నిరుద్యోగమూ, తిండీ, బట్టా, ఇల్లూ, రోగులకు మందులూ లేకపోవటమూ, నిరక్షరతా— అన్నీ కృత్రిమంగా ఏర్పడినవే. వాటన్నిటికీ ధనస్వామ్యమే కారణమని అతిసులువుగా ఎవరన్నా గ్రహించవచ్చు. ఇవన్నీ విధినిర్ణయంవల్లా, పూర్వజన్మ దుష్కర్మల ఫలితంగానూ ఏర్పడతాయని రాస్తున్న పేరుబడ్డ రచయిత లున్నారు. వారి అజ్ఞానం ఆశ్చర్యకరం.

— కొడవటిగంటి కుటుంబరావు

మందు పేరుతో విషం

వి. వి. ముకుంద్

వాళ్ళ అభయహస్తాలు
భస్మాసురుడి బాపతువి
వాళ్ళ అభినయముఖాలు
మారీచుల సంతతివి

సభావేదికల కూతలు
మైరావణ మంత్రాలే
లోకసభల చర్చలు
శకుని మామ పాచికలు

సుస్వాగత కౌగిళ్ళు
గ్రుడ్డిరాజు ప్రేమలు
ప్రజాస్వామ్య పరిపాలన
శల్యునిసారథ్యం

పత్రికా గోష్టితో ప్రసంగాలు
నెత్తిపైనుంచి కొంగుకప్పి
మనసూరించే భోగందాని బూటకాలు

ప్రజలకి ఉద్బోధించే నీతి సూక్తులు
కోడలికి బుద్ధిచెప్పి రంకుకు మరిగి
బొంకనేర్చిన అత్తల తొత్తు మాటలు

ఇంకా ఆ వాక్చాతుర్యం భ్రమలో పడ్డావా
నీ పుండుపై వాలిన దోమలైనా
తోలలేక పోతుంది నీలో జవం!

ఇంత చేసినా

ఎక్స్ - రే

రైతుకూలీల ఆడపడచులు
నడుం వంచి దినమంతా
వానలో తడుస్తూ
పదాలు పాడుకుంటూ
మనపొలాల్లో నాట్లు వేస్తారు

మళ్ళీ
చలికాలం
తెల్లారే
చలికి గడగడ వణుకుతూ
పనిలోకి వచ్చి
కొడవళ్ళతో పంట కోస్తారు
మోపులను నెత్తిన మోసుకుంటూ
కళ్ళాలకి వెళ్తారు
ధాన్యం రాల్పుతారు

ఇంతచేసి
తింటానికి కూడుండదు వాళ్ళకి
ఆకలితో కంటికి నిద్రుండదు
ఎంత చీకినా
పిల్లా పీచుకి తల్లినించి పాలురావు

మార్కెట్లో
కిలోల రూపాయిలు మోగుతుంటాయి
కోటల్లో పాములు
నెత్తురు విస్కీ తాగుతుంటాయి.

ముట్టడి

లోచన్

ఈకంచు కోటని ముట్టడించండి
ఈపాముల పుట్టని నేలమట్టం చేయండి
దీని ఒక్కొక్క యిటుకా ఒక్కో బతుకుని నొక్కేసింది
ఎన్ని జీవితాలో వెక్కివెక్కి యేడ్చి
దీని పునాదుల్లో పూడ్చుకుపోయినాయ్
ఈ గోడల మీద రక్తపు చారలు
ఇక్కడి వాళ్ల ఆయిల్ పెయింట్ అలంకారాలు
ఈ కిటికీలు
కనిపించిన కన్నెపడుచుకెల్లా కన్నుకొట్టి
బతుకు విశ్వాసాన్ని మంటకలిపినాయి
ఈ ద్వారాలు కోరలుసాచి వర్తమానాన్ని మేసి
యింకా దూరదూరాలకి పోతున్నాయ్
అందుకే దీన్ని డైనమైట్లతో కూల్చివేయండి

నాటుబాంబు

శివకుమార్

గానుగెద్దు గుమాస్తా గానో
బ్రతకలేని బడిపంతులు గానో
అక్కర కొస్తావన్న ఆశతో
శత్రువు ఏర్పాటు చేసిన స్కూల్లో

నీకు పనికి వచ్చే నాలుగు ముక్కలు నేర్చి
నాటు బాంబులు చేసి
వాడి పైననే విసురుతున్నావా
శెహబాష్ తమ్ముడూ, శెహబాష్!
పండక్కి టపాకులు మినహా
మరో ధ్వని విని ఎరుగని శ్రవణేంద్రియాలు
ఆకతాయివని దూషించినా
పోయిం దేమీలేదు
విగత సంస్కృతీ సంకలనాలకు మారుగా
నాటు బాంబులతో సంచి నింపుకొని
సాగిపోతున్న రణకౌశల విద్యార్థీ!
శెహబాష్!
గిరులలో ధనుస్సులతో
నగరుల నాటు బాంబులను నేస్తం కట్టించి
అథుగాస్యతను అందలాల పైనుంచి దించి
పాదరక్షా రహితులతో జత కట్టించావా
శెహబాష్ తమ్ముడూ, శెహబాష్!
అదుగో అటు సందుచివర పహారాశకటం
ఇదుగో ఇటు పొదలప్రక్క పొంచిన
గస్తీదళం
అటో, ఇటో ఎటు విసరినా
ప్రేలే దది శత్రువు పైనే

ఆత్మను తృప్తిపరచడమే సాహిత్య ప్రయోజనం అనడం అబద్ధం. ఆత్మను మేలుకొల్పి ఉద్దీపింపజేయడమే సాహిత్యం కనీసం చేయదగింది.

—మాక్సిం గోర్కీ

విప్లవ గీతం

కిషన్

కత్తుల్ని నూరారు
జనం
కసరత్తు చేశారు.
కాహళ్లు ఊదారు
జనం
కావళ్ళు కాస్తారు.
చెప్పేదొకటి చేసేదొకటి పాలకుల
చిత్రవధ చేస్తారు
జనం
పంక్తి భోజనంలాంటి ప్రజాశ్రేయో
స్వామ్యవాదం చిత్తర్వు గీస్తారు జనం.
పత్రపుటికలో కోల్పోయిన దాన్ని
పత్తిచేలో వెతుక్కోమని చెప్పే
పాత భావాల కుటిలత్వాన్ని
పట్టుకొని గొంతుల్ని కోస్తారు జనం
ఒకటిగా అల్లుకొని లేస్తారు
ఒకే పువులోని దళాలై పూస్తారు.
జనం
అణువణువు చీల్చుకొని చూస్తారు
అమరమో సమరమో తేల్చుకుంటారు—
తిరుపతీ శ్రీరంగ క్షేత్రాల 'మోక్ష' వాయువు లొల్లరిక
వైష్ణవం క్రైస్తవం కీర్తనల గానలోలత వద్దు-వద్దు.

భక్తి భావాల,
పట్టు శాలువలోని పాపోసు చూశారులే జనం.
చిదంబర రహస్యం దిగంబర మయింది
చిన్మయానంద మొక దగా అంటున్నారు.
చూడనే చూశ్ళేదు ఇన్నాళ్ళు
జనం
ఈనాడు సూటిగా చూశారు పొరపాటు—
అందుకే కడలిలా లేచారులే
జనం
గాడ్పులా సాగారులే—
చెయ్యేదో కులమనీ
కాలుదో కులమనీ
కన్నుదో కులమనీ
వెన్నుదో కులమనీ
శరీరం చీలికలు చేశారు భావకులు
చెట్టు ఒకటే ఐతే—
కొమ్మ కొమ్మకు కులం అంటగట్టారు గంటుపెట్టారు
ఎప్పుడే కొమ్మ ఎదిగినా, నరికి పోగులుపెట్టి
నీ జోలికి మేము రామన్నారు భావకులు
గుండె గుండెకు నడుమ గండ్లు పెట్టారు, కాచి కొట్టారు-
కండ్లు తెరిచిన జనం గండ్లు పూడ్చారులే
బాటబాటకు పూలచెండ్లు గుచ్చారులే—
విచారం శరీరం కాల్చారు
వివాదం మిల్లుల్ని పేల్చారు
సాగారు జనం ఒక సరికొత్త జగంకై
పొంగారు జనం దొంగ సంఘాల శత్రులై —

మూల మూలలు వెతికి, మూల సంపద కెలికి
పండగలు పంపకం చేస్తారులే—
జనం
బతుకె ఒక పండగని పాడ్తారులే...
అరే ఖద్దరూ, కాపిటలిష్టూ
అరే జగద్గురువూ, జై సీతారాం,
అరే బిషప్పూ, బిస్మిల్లా,
తుపాకీ, శాసనం, గుడీ, మసీదూ
యజ్ఞాలు, యాగాలు—
ఏ శక్తి మీ భోగభాగ్యాల కాచదిక
ఏ శక్తి ఈ జనా న్నెదురుకో లేదింక
కత్తుల్ని నూరారులే
జనం
కసరత్తు చేశారులే...
ఏ కన్ను ఇన్నాళ్ళు మూతపడి ఉన్నదో
ఆ కన్ను తెరిచారులే జనం,
ఇక తెరచాప లెత్తారులే.

ఇంతటితో ఆగకు

కోట సత్యనారాయణ

ఏం చేశావని
ఏం చూశావని
ఇంతటితో ఆగకు
ఇంకా ముందుకుసాగు
నిన్నటి జ్ఞాపకాల భయం

నిన్నింకా వదల్లేదు
ఆల్జీర్స్‌లో ఫ్రాన్సు వురి తీసిన
శవాల శిరస్సులింకా వూడి పడనేలేదు
హిట్లర్ కోసిన జ్యూల మొండాలింకా
కొట్టుకోవడం ఆపనేలేదు
రష్యా విప్లవానికి బలైన కోటిమంది
కంతా లింకా కసి తీర్చుకోనేలేదు
విను దూరంగా తోడేళ్ళ అరుపులు.
మహోజ్వల వేగంతో
మందగించక ముందుకుసాగు
మట్టుపెట్టు మానవుల మధ్య
దానవాధముల్ని—
ఈ ఉద్రేకం క్షణికం కారాదు.

విప్లవ శంఖారావం

సి. వి. రమణ

సూటిగా చూడు
చికిలి కళ్ళు చిట్లిస్తున్నావు
జరుగుతూన్న నిజాల్ని కను
విప్లవ శంఖారావాలు విను !

బజారులో సజావుగా చూస్తూ నడూ
అత్యద్భుతాలు కన్పిస్తున్నాయి కదూ !
వంగిపోకు

సరిగ్గా నిల్చో
వయస్సులో ఉన్న ఆరోగ్యవంతుడివి
నీరసంగా మూల్గుతున్నావు
ముసలితనంలో మరింకేం చేయబోతావు ?

గలగలా మాట్లాడు
కుంచించుకపోకు
పదిమందిలో బ్రతకాలని ఉందా నీకు ?!

నీ కళ్ళల్లో కారం జల్లి
నీదున్నదంతా దోచుకొని
నీ మొహాన పేడనీళ్ళు జల్లి పన్నీరనుకోమంటున్నారు !

చూశావా ?
ఇంకా చూస్తూనే ఉన్నావా ?
నాయకమ్మన్యుల నయ ప్రియ వచనాల్ని చీల్చిచెండాడు
ప్రతి ఐదేళ్ళకూ జరిగే ప్రత్యక్ష దోపిడీలో
పార్టీల మార్పిడీలో గూండాల స్వేచ్ఛా విహారంలో
జరిగే అత్యద్భుతాల జాబితా తయారుచెయ్ !

బందిల దొడ్లో చేరిన పశువుల్లా కొట్లాట
కుక్కలకన్నా హీనంగా పదవులకై కొట్లాట
మొహాన తుబుక్కున ఉమ్మి
ఫెళ ఫెళార్భాటాలతో నిప్పులు విరజిమ్ము !

పైశాచికంగా స్వార్థం ప్రజ్వరిల్లింది
మతం మత్తుమందు ప్రతి కొట్లో దొరుకుతోంది
సారాకంపు గుప్పు గుప్పున వ్యాపిస్తోంది
పార్టీల్ని ధ్వంసం చేసిపారెయ్ !

ఎన్ని అమానుషాలు జరిపిస్తున్నాయో చూశావా ?
ఎంత అమాయకంగా ఇన్నేళ్ళూ భరిస్తున్నావు ?

పట్టపగలు దోపిడీలో ఆరితేరిన చేతుల్లో
పెద్ద బీరువా తాళంచెవుల్ని ఉంచేశావా ? ఇన్నాళ్ళూ !
దోచిన అధికారాన్ని పంచుకోవడంలో పేచీలొచ్చి
దభీ దభీ బాదుకుంటున్నారు !
ఎత్తులపై పైఎత్తు లేసుకొంటూ
తలలు బాదుకుంటున్నారు చూడటంలేదూ !

ఇంకా నీ రక్తంలో సెగల పొగలు
నీ మస్తిష్కంలో విప్లవ దుందుభులు
రేగటంలేదూ ? మ్రోగటంలేదూ ?
నీవిలా నీరసంగా చూస్తూన్నంత కాలం
నిన్ను కాల్చుకతింటాయి ఈ కొరివి దెయ్యాలు !
సూటిగా చూడు
నిటారుగా నిలబడి తిరగబడి కలబడు !

ప్రాయశ్చిత్తం

ప శు ప తి

నా రక్తంలోని
ఒకొక్క అణువును
ఒకొక్క సంపూర్ణ వ్యక్తిగా తీర్చి
మీ కన్నీటిని తుడవాలని
ఎంత ఆవేదన పడుతున్నాను.

నా రుధిరంలోని
ఒక్కొక్క పరమాణువును
ఒక్కొక్క పరశువుగా మార్చి
మీ కళ్ళకు కుండలు కట్టి
కన్నీళ్ళను సైతం ఒడ్చుకుంటున్న
కసాయివాళ్ళ చేతుల్ని
నిలువునా నరికి కుప్పలు పెట్టాలని
ఎంత ఊగిపోతున్నాను.
ఇన్నేళ్ళ దాస్యవృత్తికి మిగిలింది
సున్నానికి కూడా పనికిరాని ఎముకల కుప్ప
ఇన్నాళ్ళు మోరెత్తి ఆకాశంకేసి
ఎదురుచూస్తూ నిలిచినందుకు
గగనం గుండ్రాళ్ళను దొర్లించింది.
ఈ ఇరవై మూడేళ్ళ పారతంత్ర్యానికి
మిగిలింది
నిరంతర ధారాపాత దారిద్ర్యం
మురికి పట్టిన వ్యవస్థ.
మకిలబట్టి చీకిపోయిన
రాజకీయాల ఇంటికప్పు.
ఇన్నాళ్ళు మిమ్మల్ని
జోకొట్టినందుకు — మీకు
మత్తుమందు పెట్టినందుకు
మెస్మరిజం నడిపినందుకు
ఈనాడు
బడితెపూజ తప్పదు.
ఇన్నాళ్ళ

హోమీల పురాణ కాలక్షేపానికి
ఈనాడు
చావగొట్టి చెవులు మూయడం
ప్రాయశ్చిత్తం.

మాటలు

యాదగిరి

నా మాటల్ని కత్తుల్తో కోద్దామనీ
తుపాకులతో కాలుద్దామనీ
చూస్తున్నారు కదూ
నా మాటలు మీ దౌర్జన్యాన్ని ప్రతిఘటించాయని
మీ నిరంకుశత్వాన్ని ఖండించాయని
వాటిని బంధించాలని అనుకుంటున్నారు కదూ
నా మాటలు రాబోయే తరానికి
విప్లవ భావాల్ని పండించే ఎరువులు
నా మాటల్ని మీరు శపించనూలేరు
నా మాటల ధమనులు మీ కత్తిపోట్లతో
నెత్తురు స్రవిస్తూ
వాటి చీమ కాళ్ళతో
నేలను రక్తంతో సారవంతం చేస్తూ
మెల్లగా—మెల్ల మెల్లగా
నేలంతా వ్యాపిస్తాయి.



జంపన పెద్దిరాజు చనిపోయా డన్నవార్త విన్నప్పుడు శ్రీరంగం రాజేశ్వరరావు గుర్తుకొచ్చాడు, శారద గుర్తుకొచ్చాడు. ప్రజాయోధులు నేలకొరిగినప్పుడు వచ్చిన నష్టాలు లాంటివి ఇవి సాహిత్యంలో.

శ్రీశ్రీ షష్టిపూర్తి సభలు తెలుగు సాహిత్యానికి ఒక కొత్త వేగాన్నిచ్చాయి. అక్కడ పాల్గొన్న రచయితలు సాహిత్యాన్ని ఒక కొత్త ఉద్యమ దిశకి తిప్పారు. నిజాయితీ, ఉత్సాహం, కార్యశీలత, యువతరంపై విశ్వాసం, పట్టుదల, పోరాటశీలత, సామాజిక బాధ్యత ఇవన్నీ ఆ సభల్లో పాల్గొన్నాయి. వీటన్నిటి చురుకైన రూపమే జంపన పెద్దిరాజు.

విశ్వవిద్యాలయ విద్యార్థుల కథల సంకలనం వేసారు ఎమెస్కోవాళ్ళు మొదటి ప్రయత్నంగా. దాంట్లో 'ఫాల్ ఫాల్' చదివిన ప్రతి రచయిత పెద్దిరాజు గురించి చర్చించాడు. వస్తువులో కొత్తతనానికి శిల్పంలోని ప్రత్యేకతనీ, బలాన్నీ జోడించాడు. అందుకే శ్రీరంగం రాజేశ్వరరావు గుర్తుకురావడం. అందుకే శారదను మరచిపోలేకపోవడం.

జననం 16-7-1946 జువ్వల పాలెంలో పశ్చిమ గోదావరిజిల్లా.

హైస్కూల్ చదువు ఏలూరుపాడులో. తర్వాత భీమవరం, బెజవాడ కాలేజీల్లో. ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు ఎమ్మే '69లో.

ఉద్యోగం తెలుగు లెక్చరర్‌గా డి. ఎన్. ఆర్. కాలేజి భీమవరం. మరణం 19-10-70.

చాలా పత్రికల్లో కథలూ, గేయాలు ప్రచురితమయ్యాయి. 'సృజన' వచ్చే సంచికలో పెద్దిరాజు అముద్రిత కవిత వస్తుంది.

ఫౌల్ ఫౌల్

జంపన పెద్దిరాజు

టెన్నిస్

ఆడటానికికాదు

చూడటానికి

వందలు, వేలు జనం—కార్లు—స్కూటర్లు—సైకిళ్ళు—పిల్లలు—పెద్దలు—ముసలాళ్ళు—అంతా—టెన్నిస్ ఆడటానికికాదు, చూడటానికి.

స్త్రీ టెన్నీస్-ఆడటెన్నీస్ (అంటే ఆడపిల్లలాడేది)—యూనివర్సిటీలో వందలు, వేలు జనం—ఆడటానికికాదు, చూడటానికి!

మూడు రోజులనుండి మిస్ టానియా పేరు అంతులేని ఆకాశంలా వుంది. ఒడ్డులేని సముద్రంలా వుంది. టానియాకు నేలపై నడవ బుద్ధికావటం లేదు. కోర్టులో తన నడకలో ప్రతి కదలికను మింగుతూ—కొన్నివేల కళ్ళు, కొన్ని వందల కళ్ళజోళ్ళు.

టానియా టాపులేని కారులా కోర్టులో తిరిగింది. కోడి పుంజులా తల పైకెత్తింది. పైకిలేస్తున్న కెరటంలా వెళ్ళి బాల్‌తీసేది.

'ఆటలో అందం వుంది.

నిర్లక్ష్యం వుంది.

తెలివి వుంది.'

మద్రాసుపై రెండుసెట్లు వరసగా తీసుకుని ఫైనల్సుకు రాగానే వచ్చిన కామెంట్స్ ఇవి.

'టానియా, హిపీప్

టానియా జిందాబాద్!'

టానియాబ్యాట్‌కు బాల్ తగలగానే చప్పట్లు సముద్ర కెరటాల్లా విరుచుకు పడుతున్నాయి.

టానియా నవ్వింది.

ఏదో టానిక్ అందరి గుండెల్లో ఒలికింది.

గళ్ళకోట్లు, కళ్ళద్దాలు, రంగురంగుల మేజోళ్ళు, ఆడపిల్లలముందు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న వాలంటీర్లు.

అదొక తీర్థం

అదొక సంత

రావణాసురుడి సభలో తోకచుట్టపై బైఠాయించిన హనుమంతుడిలా అంపైర్ యెక్కడో ఆకాశంలో ఒబ్బిడిగా ఆసీనుడై ఉన్నాడు.

ఆట ముగిసింది.

మహా సముద్రంలా ఉన్న జనాన్ని కేంటీన్ కొంత లోపల ఇముడ్చుకొని మిగతా కక్కేసింది. కక్కబడ్డ జనం రోడ్లమ్మట.... జనం జనం జనం—జజజజజజజనం.

టానియా చెయ్యి—గుళ్ళో గంటలా, పూజారి తీర్థంలా ముట్టుకొని వెళ్ళిపోతున్నారు.

ఎదరవరసలో కూచున్న ఆఫీసర్ల అందమైన ఆడముఖాలు, అజ్ఞానం లాంటి నల్లద్దాలు పెట్టుకొన్న తెల్ల ఏనుగులు, కారుడ్రైవర్ల కోసం చూస్తూ హుందాగా టానియా నభినందించాయి. ఖరీదయిన మూడు కోట్లు వాళ్ళింటికి రాత్రికి డిన్నర్‌కు పిలిచాయి.

"మన సమాజంలో స్త్రీలు వంటయిల్లు వదలి ధైర్యంగా అన్ని రంగాల్లోకి దూకుతున్నందుకు నా కెంతో సంతోషంగా ఉంది." టౌన్ మహిళామండలి అధ్యక్షురాలు ఆవేశంతో అంది. లిప్‌స్టిక్ పెదాల్ని కొరుకుతూ పక్కనున్న పెద్దమనిషిని చూసి. ఆయన చిరునవ్వు నవ్వాడు.

టానియా ఆ సాయంత్రం రెండు తప్పనిసరి డిన్నర్లకు అటెండ్ అయింది. మొదటి డిన్నర్‌లో పూర్తిగా భోజనం చేసింది. రెండో డిన్నరులో బలవంతంపై కొంచె పలావు, రెండు యాపిల్స్, ఫ్రూట్‌సాలడ్ తీసుకుంది—తనకోసం ఏర్పాటుచేసిన డిన్నరులో ఆమాత్రం పుచ్చుకోకపోతే బావుండదని.

'తిండి కలిగితె కండ కలదోయ్ కండ కలవాడేను మనిషోయ్!' అని తన టీమ్‌లో అమ్మాయి నవ్వింది.

మర్నా డెవరో స్టూడెంట్స్ డిన్నర్‌కు పిలిస్తే ఇన్విటేషన్ డిక్లైన్ చేసింది.

వాళ్ళు ఒడలిపోయిన మొహాలతో వెళ్ళిపోయారు.

అప్పుడే పన్నీటిలో కడిగిన మల్లెపువ్వులా ఆ రాత్రి టానియా మంచం మీద వ్రాలింది. నిశ్శబ్దం రాత్రికి పహరా కాస్తూంది. యూనివర్సిటీ టవర్‌క్లాక్ కొట్టిన పదకొండు గంటలకు చీకాకుపడ్డ నిశ్శబ్దం టానియాకు మత్తుగా మెలకువ తెచ్చింది. ప్రాజెక్టు గేటుల్లా కళ్ళరెప్పలు తెరిచేసరికి కిటికీలోంచి వెన్నెల వరదలా ముంచెత్తింది. సాయంత్రం తిన్న యాపిల్స్ గొంతులో బ్రతికున్నట్లు—కడుపులో కొండచిలువ కదుల్తున్నట్లు—వికారం—ఆకారంలేని వికారం—వాంతి వెళ్ళేట్టుంది—లేదు—టానియాకు నిద్ర పట్టడంలేదు.

ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు ఆ ఫేకల్టీక్లబ్ లాడ్జి కిటికీలోంచి ఏదో కొత్త లోకంలా కనిపించేసరికి కొలంబస్‌లా ఒకసారి కొత్త అనుభవాన్ని చూద్దామని నైట్‌గౌన్ సరిచేసుకొని నెమ్మదిగా బైటకు నడిచింది. మిస్ టానియా, టెన్నిస్ ప్లేయర్. చలిమంచు. వెన్నెల నిశ్శబ్దం, రాత్రి పెడుతున్న గురకలా సముద్రం హోరు. మంచు దుప్పటి కప్పుకున్న నిశ్శబ్దం. చేతులూ, తలా, చెవీ ఎక్కడన్నా దాచుకొని కళ్ళతో చూడ బుద్ధివేసే వాతావరణం. వులెన్ మఫ్లర్ అందంగా చుట్టుకుని, కోర్టు పక్కగా వున్న సిమెంటు గేలరీపై నిలబడి చేతులు కట్టుకుంది.

స్ట్రీట్ లైట్లని కాపలాపెట్టి యూనివర్సిటీ అంతా నిద్రపోతూంది. పగలంతా జనాన్ని టోపీగా పెట్టుకుని మేచ్ చూసిన 'లా కాలేజి', ఫాకల్టీ క్లబ్ విశ్రాంతి తీసుకొంటున్నాయ్. అప్లైడ్‌ఫిజిక్స్ లేబొరేటరీపై రాడారు తలవంచుకుని కునికిపాట్లు పడుతూంది. వాటర్‌లేని స్విమ్మింగ్‌పూల్‌లా వున్న టెన్నిస్‌కోర్టులో, విరిగిపోయిన కుర్చీలు మధ్యతరగతి జీవితాల్లా ఉన్నాయి. ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతిబింబాల్లా గొప్పవాళ్ళకోసం ప్రత్యేకించబడ్డ సోఫాలు. కుర్చీలు మంచు తాగి నిద్రపోతున్నాయ్. వేదికపై పూలదండల వెనక దాక్కొన్న నాయకుల్లా నీలిరంగు గుడ్డల్లో దాక్కొన్న రెండు తడికలు కోర్టు కిరువైపులా.

వ్యభిచారి వేసుకున్న లిప్స్టిక్‌లా స్కోరుబోర్డు తగిలించుకొన్న విల్స్ అడ్వర్టైజ్‌మెంటు.

టానియాకు మనసు చికాకుగా వుంది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. నిద్రపోతున్నవాళ్ళ ప్రతినిధుల్లాగ అక్కడక్కడ, అప్పుడప్పుడు దూరంగా

కేకలు, చిన్నచిన్న మాటలు, టానియా దృష్టి కోర్టుకు కొంచెం దూరంలో వున్న మూడు ఆకారాలపై పడింది. ఎడారిలో ఏవో మూడు మోడులు మాట్లాడుకుంటు న్నట్లు ఆ గ్రౌండులో ముగ్గురు—అంతలో గట్టిగా దగ్గు.

"పర్లేదు నేవే, ఇదెప్పుడూ ఉండేదే...."

"కాసిన్ని నీళ్ళు దొరికితే బావుణ్ణు."

"ఏఁటి పర్నేదు—పని మానేసి, గూటికి పోక-"

"నీకు తెల్దసే. అప్పుడప్పుడు ఇలా రగతం పడుతుంటదిలే!"

"ఇంకో పది తట్టలుంటది. ఆ కాత్తా పోసేత్తే అంతా కల్సి ఒకేసారి పోవొచ్చు."

మళ్ళీ గట్టిగా దగ్గు.

టానియా వాళ్ళ దగ్గిరగా వెళ్ళింది. సందేహంలేదు. ముగ్గురూ మనుషులే. అందుకు నిదర్శనం వాళ్ళు మాట్లాడుకోవటం. నూనె లేక పోయినా జుట్టుంది. గుడ్డలు చినిగినా శరీరం ఉంది. వాళ్ళ మొహాలు వాళ్ళ జీవితాలకు ప్రతిబింబాలు. పెద్దసైజు కట్ డ్రాయర్‌లా బిగించి కట్టిన వాళ్ళ చీరలు. చీరలుకాదు చింకి కోకలు. మట్టి అద్దకంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న కాళ్ళూ చేతులు, వక్షా లున్నందువల్ల ఆడవాళ్లు. మనుషులు నిద్రపోతున్న వేళ మట్టి మోస్తున్న జీవాలు.

టానియా పిల్లిలా వాళ్ళ దగ్గిరి కెళ్ళింది. మట్టిలో గడ్డకట్టిన రక్తం చూసింది. మనిషి కక్కిన రక్తం చూసి టానియా మనసు పూర్తిగా పాడయింది.

"ఏమైంది?" అంది, ఏమి అనలేక.

అందరూ హాయిగా నిద్రపోతుంటే ఆ రాత్రి వాళ్ళు మట్టెందుకు మోయాలి? మట్టి మోస్తూ ఆమె అలా రక్తం ఎందుకు కక్కాలి?—ఇదంతా టానియాకు కొంచెం బాధ అనిపించింది.

వాళ్ళు లేచి తట్టలు నెత్తిమీద పెట్టుకోబోతున్నారు. చూస్తూ నిలబడితే బావుండదని టానియా సాయం చేయబోయింది. కాని, తన వైపు తట్ట కొంచెం కూడా లేపలేకపోయింది. పవర్-పాక్‌డ్ సర్వీసులికి, పవర్ స్ట్రోక్స్‌కి టెన్నిస్ కోర్టులో తప్పట్లు కొట్టించుకుంది తను! ఆ తట్ట అమాత్రం యెత్తలేకపోడం అవమానంగా ఫీలయింది.

"పర్నేదమ్మా! సదువుకునేవోళ్ళు చేసే పన్లు కావియ్యి. మీరు దేశాన్ని బాగుచేయాలి. మీరు సుఖంగా ఉంటేనే మాబోటాళ్ళకు కాస్తంత కూడు గుడ్డా దొరుకుతాది." అంది వాళ్ళలో ఒక మనిషి.

తను టెన్నిస్ ఆడి వాళ్ళకు కూడూ గుడ్డా ఏవిధంగా పెట్టగలదో అర్థం కాలేదు టానియాకు. వాళ్ళు టెన్నిస్ కోర్టు గోతులు పూడవటానికి మట్టి పట్టి కెళ్తున్నారు. అది చదునుచేయాలని. 'లెవెల్' చేస్తేగాని మర్నాడు ప్రేక్షకులకు సౌకర్యంగా ఉండదని సాయంత్రం ఆర్గనైజర్లు తీర్మానించారు.

తను చూస్తుండగానే వాళ్ళు ముగ్గురూ తట్టలెత్తుకుని వెళ్ళిపోయారు. కష్టాల్లా వెళ్తున్న వాళ్ళను చూస్తూ టానియా ఎప్పుడూలేని ఆలోచనల్లో పడింది.

వాళ్ళూ స్త్రీలే. బరువులు మోయటంలో వాళ్ళకు గొప్ప ప్రావీణ్యం ఉంది. పైగా అర్ధరాత్రి చలిలో నిద్రలేకుండా రక్తం కక్కుకుంటూ అలా బరువులు మొయ్యడం సామాన్యమైన విషయంకాదు. తను కాస్త నేర్పుతో టెన్నిస్ ఆడుతున్నందుకే, నిక్కరుతో అంతమంది ముందు నిల్చున్నందుకే— అన్ని కార్లు, అన్ని కళ్ళజోళ్ళు, అంత గందరగోళం! మరి అర్ధనగ్నంగా తట్టలు మోసే వీళ్ళని గురించి ఆ కార్లూ, ఆ కోట్లూ, ఆ మైక్‌లు తప్పట్లు కొట్టవేం? డిన్నర్‌కు పిలవ్వేం? ఆవిడెవరో 'స్త్రీలు వంటింట్లోంచి ధైర్యంగా బైటకు వస్తున్నా'రంది. యూనివర్సిటీలో ఇలా పట్టపగలు, రాత్రికి రాత్రి తట్టలూ, కట్టెలూ అర్ధనగ్నంగా మోస్తుంటే స్త్రీ జాతికి' ఎంత పురోభివృద్ధి!— ఏఁవిఁటో ఈ ఆలోచనలు వేపకాయల్లా—గొంతు కడ్డంపడ్డ వెలక్కాయల్లా వెగటుగా, వగరుగా ఉన్నాయ్. [నిజంగా ఆలోచించకూడదు. ఆలోచిస్తే ఏ పనీ చేయలేం. తలకాయని—తల దువ్వకోటానికి, స్నో-పౌడర్ రాసుకోటానికి, మగాళ్లైతే గడ్డం గీసుకోటానికి ఉపయోగించుకోవాలి. ఆలోచించకూడదు. కళ్ళతో టెన్నిస్ చూడాలి. చెవులతో క్రికెట్ కామెంటరీ వినాలి. ఆలోచించకూడదు. ఆలోచన భయంకరం] ఏఁవిఁటీ? ఈ రక్తం చూపినప్పటినుంచీ మనసు మరీ చికాకుగా ఉంది. ఇలాంటి అలోచనలు ఇదివర కెన్నడూ రాలేదే. లోకం ఆలోచన నేర్పుతుందేమో! నేను చదువుకొన్న కాన్వెంట్ యెందుకు నేర్పలేదు?

టానియా ఒక్కసారి వులిక్కిపడింది—పిడుగు పడ్డట్టు కెవ్వన కేక!

"ఓలమ్మో, మెట్ల కడ్డుగా యెందుకు దిగావు? నా కొండో, నా కొండో! తిరుపతి పడిపోయినాది, లగెత్తుకురా! ఏళ్ళనన్నా లేపుకురా," అంటూ లబో దిబో మంది అప్పలమ్మ.

టానియా డ్రాప్ ఎత్తటానికి పరిగెట్టే టంత వేగంగా వెళ్ళింది. అవును, ఇందాక రక్తం కక్కుతున్న తిరపతే—ఆ తిరపతే! టెన్నిస్ రాకెట్ ఖరీదు కూడా చేయని తిరపతి—పరపతిలేని తిరపతి!

తిరపతి తలనిండా రక్తం.

తలలో రక్తం.

రక్తంలో తల.

తిరపతి గుడ్లగూబలా మూల్గుతోంది. గాలిలా యేడుస్తోంది. చూస్తూండ గానే తిరపతి చేతిలో తట్టని గుప్పిటతో గట్టిగా బిగించి ఒదిలింది.

ఆ దృశ్యం చూసిన టానియా కెరటంలేని సముద్రంలా, ఆకు కదలని చెట్టులా, మబ్బులాడని ఆకాశంలా, మనసులేని మనిషిలా, జీవంలేని శవంలా వచ్చి బెడ్ మీద పడుకుందిగాని, నిద్రపోడానికి రెప్పల్లేవు. రెప్పలు తిరపతి కళ్ల మూసినచోట వొదిలేసింది.

తెల్లవారింది. తెల్లవారక తప్పదు. సూర్యుడు డ్యూటీ ఛార్జి తీసుకున్నాడు. టానియా బాత్‌రూమ్‌లో ఉండగా బైటమాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి.

"అఁ, ఏఁవీఁ లేదు. రాత్రి ఎవరో పనిమనిషి గుండె జబ్బుతో చచ్చి పోయిందిట, దిక్కులేని పిల్లను ఒదిలేసి. ఆ పిల్లకేఁవైనా సాయం చేయా లంటుంటే రేపు రమ్మంటున్నాను. ఈవాళ ఫైనల్స్ గదా! ఈ గొడవలో ఉన్నాను."

అంతలో రేడియో సిలోన్ ఆ మాటల్ని మింగేసింది.

బైట ఎవరిదో కారు హారన్! ఇన్—గేటు! అవుట్—గేటు వాటి పని అవి చూసుకొంటున్నాయ్. యూనివర్సిటీ మూసేయలేదు. క్లాసులు మామూలుగానే జరుగుతున్నాయి. మధ్యాహ్నంమాత్రం సెలవ్. తిరపతి చచ్చిపోయినందుకుకాదు టానియా ఆట చూడటానికి.

ఆఖరురోజు, ఎండ మంటలా వుంది. ఆర్గనైజర్స్ హడావుడి. చోటుకోసం లాస్టఅవర్ ఎగ్గొట్టేవాళ్ళ హడావుడి పోటీపడుతున్నట్టుంది. పబ్లిక్ రిలేషన్స్‌వాళ్ల

పిక్చరైజ్ చెయ్యటానికొచ్చారు. టౌన్‌లో స్కూళ్ళకు, కాలేజీలకు, ఆఫీసులకు పండుగ. మళ్ళా మామూలే. టెన్నిస్‌కోర్టు, కార్లు, స్కూటర్లు, కళ్ళజోళ్ళు, సైకిళ్ళు, కోట్లు, చీరలు, బ్లౌజులు, పోజులు, జనం, జనం, జనం. నిశితంగా చూస్తున్నాయ్ కళ్లు కళ్లు కళ్లు. మళ్ళా లాకాలేజీ రంగురంగుల జనాన్ని టోపీగా పెట్టుకుంది. ఎత్తు తక్కువగా ఉన్న కేంటీన్. ఎన్. సి. సి. ఆఫీసు మేచ్ చూడలేక సిగ్గుతో తలవంచుకున్నట్టున్నయ్. కారు డ్రైవర్లు సిగరెట్లు కాలుస్తూ కష్టం సుఖం చెప్పుకుంటున్నారు.

టానియా శరీరం ఆడుతోంది. హృదయంలో సైగల్ గొంతులో విషాద ఘోషలా ఉంది. అంపైర్ ప్రతీ కదలికను అతి జాగ్రత్తగా చూస్తున్నాడు. టానియా చికాగ్గా ఆడుతోంది. మొదటి సెట్టు ఎదుటిపక్షం తీసుకుంది.

టానియా—కొట్టు.

టానియా—బీ కేర్‌ఫుల్.

టానియా—డోన్ట్ వర్రీ.

ఎంకరేజ్‌మెంటు ఆకాశంలా విరిగిపడుతూంది.

టానియా చేసిన సర్వీసులు ఫెయిలవుతున్నయ్. అంపైర్ ఫాల్టు, ఫాల్టులతో జనం విసుగెత్తిపోతున్నారు. లాకాలేజి పైనుంచి ఆట చూస్తున్న అమ్మాయి తేలుకుట్టినంత బాధగా చెయ్యి విదిలించుకొంటోంది. అంపైర్ 'డ్యూస్' అన్నాడు.

'ఐ డోన్ట్ వాంట్ డ్యూస్' 'లా' కాలేజీపై అమ్మాయి గట్టిగా అరిచింది. ఆ అరుపులు వినే పరిస్థితిలో లేరు జనం. ఎవరి లోకంలో వారే అరుస్తున్నారు.

టానియాకు చాలా చికాకుగావుంది. తిరపతి కక్కుకున్న రక్తంలా కళ్ళ ముందు ఎండ మెరుస్తోంది. టానియాకు గట్టిగా మైకులో ఎనౌన్స్‌మెంటు చేయాలనిపించింది. ఆ రోజు ఆట ఆపేయాలనిపించింది. తిరపతి చావుకు సంతాప సూచకంగా జనాన్నంతటినీ ఓ అరగంట నిశ్శబ్దంగా నిలబెట్టాలనిపించింది.

జనం.........జనం. సముద్రపొడ్డు ఇసకలా. ఈ దేశంలో దారిద్ర్యంలా.

టానియా చూపు రాత్రి తిరపతి చచ్చిపోయిన చోటుపై పడింది. అక్కడ కార్పెట్‌పై జనం. ఆడటానికికాదు, చూడటానికి.

టానియాకి జనంమీద కోపం హెచ్చింది. ఆ కోపం బాల్ మీద చూపించింది. రెండోసెట్టు తను నెగ్గింది.

మూడోసెట్టుకు మనసు మళ్ళా తక్కెడలా ఊగుతూంది. మూడోసెట్టులో అయిదు గేములు అవతలి అమ్మాయి తీసుకుంది. టానియా మళ్ళా చిరుతపులి అయిపోయింది. వరసగా అయిదు గేములు లాక్కుంది.

జనం కుర్చీలమీద లేరు. సిక్స్త్‌గేమ్‌లో సర్వీసు చేయగానే మళ్ళా ఫాల్టు అన్నాడు అంపైరు. టానియాకు ఆట మానేసి ఎక్కడన్నా ఏకాంతంగా కూర్చోవాలనిపిస్తోంది.

'అంపైర్! నేనుకొట్టిన బాల్‌కాదు. ఈ లోకంఫాల్టు, ఈ జనం ఫాల్టు, వీళ్ళ తెలివి ఫౌల్-వీళ్ళకార్లు ఫౌల్-వీళ్ళంతా ఫౌల్ ఫౌల్.' అని అరవాలనిపించింది. నిద్రలేక కళ్ళు బరువుగా వున్నాయి.

తిరపతి—తల బద్దలైపోయిన తిరపతి—తను మోయలేని తట్టలు మోస్తున్న తిరపతి. తిరపతి చావు నెవరూ పట్టించుకోరే! వీళ్ళంతా ఫౌల్. వీళ్ళకోట్లు ఫౌల్. వీళ్ళకార్లు ఫౌల్. ఆ లాకాలేజి ఫౌల్. వీళ్ళంతా ఫౌల్‌ఫౌల్.

టానియా నిర్లక్ష్యానికి నుదుటిమీద టెన్నిస్‌బాల్ గట్టిగా కసి తీర్చుకుంది. చిన్నబొప్పి కట్టటంతో బాటు కొంచెం పక్కకువాలింది. రాత్రి నిద్రలేక కళ్ళు తిరుగుతున్నాయి. అంతే, జనం సముద్రంలో టానియాను పైకెత్తారు. చేతులపై ఫేకల్టీ కబ్‌లోకి తీసుకుపోయారు. ఆ లాడ్జిచుట్టూ జనం.

'నెవర్‌మైండ్, ఐయామ్ ఆల్‌రైట్.' అంది టానియా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. కోట్లకు, కార్లకు, గౌన్లకు, పేంట్లకు ఆదుర్దా. డాక్టర్లు సిరింజిలు సరిచేసుకొంటున్నారు. టానియాకు ఏడుపులాంటి నవ్వొచ్చింది. తన కేం కాలేదంటే వినరే. జరిగిందంతా తిరపతికి. మట్టితట్ట చేత్తో గట్టిగా పట్టుకొని చచ్చిపోయిన తిరపతికి, దిక్కులేని ఆమె పిల్లకు. ఎవరూ వినిపించుకోరేం? వీళ్ళంతా నిజంగా ఫౌల్. వీళ్ళ అభిమాన ప్రవాహం సముద్రంలాంటి మట్టి తట్టలవైపు ప్రవహించటం మానేసి ఈ టానియా లాంటి నగరాలపై పడటం నిజంగా అసలైన ఫౌల్! ఫౌల్‌ఫౌల్!

చుట్టూ చూట్టం మానేసి టానియా సైలెంట్‌గా గోడగడియారం వైపు చూస్తూ ఆలోచిస్తూంది. ఎన్నో రహస్యాల్ని, సత్యాల్ని దాచుకున్న గడియారం తాపీగా ముందుకు నడుస్తోంది.

('ఎమెస్కో' ప్రచురణ, విద్యార్థి సాహితి-1 సౌజన్యంతో)

తమాషా

యం. వినాకి

తాత సావుబతుకుల్లున్నడంటె సూస్తందుకొచ్చినం. కని, పాపం, తాతను అప్పటికె దవకానకు తీస్కపోయింద్రు.

పొద్దుమీకి నాలుగున్నరకెల్లి ఆరున్నరదాక పోనిస్తరు. అప్పుడు పోదాం, అన్నడు నాయిన.

పెద్దమ్మ మాకు అన్నాలుబెట్టి తినుమన్నది. కని తినబుద్ధికాలేదు. తాత నేను సూడకుంటనే సచ్చిపోతడేమో ననిపిచ్చింది. పెద్దమ్మను సూస్తే మాకు కోపమొచ్చింది. తాత సంగతి యిట్లుంటే, ఆమె తన కొడుకులను, బిడ్డెను బడికి తోలింది. ఏంది, ఈ ఒక్కటి రొండు దినాలు యింట్లుండుమంటే ఏమాయె!

మూడు గంట్లకు పెద్దమ్మ పిల్లగాండ్లు రమేశూ, విద్యానాదూ, చెంద్రికా బడి కెల్లి ఒచ్చిన్రు. పెద్దమ్మ వాల్లకు హార్లిక్సు కలిపిచ్చి, మాకు చా చేసి పోశింది.

దవకానకు పొయ్యే టైమయితుంటె, అమ్మ, పెద్దమ్మ మొకాలు కడుక్కొని, నోస్నొ పెట్టుకొని తయారైంద్రు. ఇంట్ల కట్టుకున్న చీరెలు యిప్పి వేరే మంచి చీరెలు కట్టుకున్నరు. ఇంటి ముందలికి మల్లెపువ్వులమ్మొస్తె ఒక్క చెటాకు పువ్వులు కొనుక్కున్నరు. చెంద్రిక కాటికె పెట్టుకుంటుంటె. "ఏందే చెంద్రికా, పెండ్లికి పోతున్నవా యేం, అంతగనం శోకు చేసుకుంటున్నవు?" అన్నడు పెద్దనాయిన. చెంద్రిక నవ్వింది కని పెద్దమ్మ మొకం మాడ్చుకున్నది.

"అయ్యో. జెర మంచిచీరె కట్టుకోంగనే శోకై పోతది నీకు." అన్నది.

సంచిల పెట్టుకొచ్చుకున్న ఇస్త్రీ అంగీ, పంట్లోను తొడుక్కొని, చెంద్రిక దెగ్గెర పౌడరు అడుక్కొని రాసుకున్న. పెద్దనాయినగూడ బట్టలేస్కున్నంక, రిక్షాలు పిలిస్తందు కొచ్చినం. ఎవ్వన్ని సూశినా రూపాయికి తక్వ రానంటడు. అకరికి బారానకు మాట్లాడి మూడు రిక్షాలు తీసుకొచ్చినం. ఒక్కదాంట్ల నేను, నాయిన, అమ్మ; ఇంకోదాంట్ల పెద్దమ్మ, యిద్దరు పిల్లగాండ్లు; మూడోదాంట్ల పెద్ద నాయిన, చెంద్రిక.

నాయిన చెప్పిండు.

"పెద్దదవకాన శానా పెద్దగుంటది. అక్కడిక్కడ పోయినవంటె అగమై పోతవు. నాచెయ్యి పట్టుకొనుండు. అక్కడంత బీమారి మనుశు లుంటరు. వాల్ల దెగ్గెరికి పోవొద్దు. లొల్లి చెయ్యొద్దు. పెద్దనాయిన పిల్లలంటె యిక్కడుంటోల్లు. వాల్లకన్ని తెలుస్తయి, వాల్లు చేశినట్లల్ల నువ్వు చెయ్యొద్దు."

రిక్ష అప్జలుగంజు దెగ్గెర ఆగింది.

'అగో, అదే దవకాన.' అన్నడు నాయిన.

పెద్దనాయిన మూడు రిక్షలకు పైస లిచ్చేశిండు. నేను నాయిన చెయ్యిపట్టుకొని నడిశిన. మంది శానా వొచ్చింద్రు.

నున్నగ బండలు పరిశున్నయి. తెల్లగ గోడలు. నర్సులు బండ్లమీద డబల్‌రొట్టెలు, పాలు పెట్టుకొని తిరుగుతున్నరు. విద్యానాదు ముందుగాల్నే పొయ్యి చెంద్రికను పిలిశిండు.

"అగో, మార్చువరీ."

నాయిన. తాత పక్కనంబరుకోసం సూస్తున్నడు.

"ఏంది అన్నా ?" అన్న పొయ్యి.

"పీన్గల కొట్టిడి." అన్నడు విద్యానాదు.

"అంటె ?"

"సచ్చిపొయినంక మనుశుల్నక్కడ పెడుతరు."

"ఎందుకు ?"

"ఎవరన్నొచ్చి తీస్కపొయిందాక పీన్గ లక్కడే వుంటయి."

"ఇప్పు డక్కడ ఎన్ని పీన్గ లుంటయి అన్నా ?"

విద్యానాదు జెరసేపు ఆలోచించి.

"శానా వుంటయి." అన్నడు.

"ఎన్నో ?"

"వెయ్యి."

"మనల్ని సూడనిస్తరా ?"

"ఉట్టిగనే సూడనియ్యరు. పనిమీద పోవాలె."

"అరేయ్, మల్లేశా," అని పిలిశిండు నాయిన, ఆ కొనాకు నిలబడి వున్నడు. ఉరికిన.

"ఎక్కడికి పొయినవుర గాడిదీ ?"

"అక్కడ, విద్యానాదు" అంటుంటె.

"ఊఁ, ఊఁ, నడువు. అగో, తాత అక్కడ....అన్నడు నాయిన. విద్యానాదుగూడ వొచ్చిండు.

"ఏం చేస్తున్నవుర అక్కడ ?" అన్నడు నాయిన.

"కిందికి సూస్తున్నము" అన్నడు విద్యానాదు.

"అట్ల సూడొద్దురా. పడితె, చేస్తే కష్టం."

"ఇక్కడెందుకు పడుతరు చిన్నాయినా, పిచ్చోళ్ల దవకాన్ల పడుతరు. అందికే అక్కడ జాలీలు పెడుతరు." అన్నడు విద్యానాదు.

తాత కండ్లు మూసుకొనున్నడు. మెడలదాక దుప్పటి కప్పిన్రు. ముక్కుల్ల నించి గొట్టాలు పెట్టిన్రు. ఇంకో గొట్టం పట్టి గట్టి, రెట్టకు పెట్టిన్రు.

"ఆ గొట్టాలు గాలివి. ఇది గ్లూకోసు." అన్నడు నాయిన అమ్మతోని.

అమ్మ ఏడ్చింది.

"దవకాన్ల అట్ల ఏడ్వొద్దు." అన్నడు నాయిన.

"నాయినా, ఇగో, గ్లూకోసు ఐపోతున్నది. ఇంకోటి తెమ్మని చెప్పాలె." అన్నడు విద్యానాదు పెద్దనాయినతోని.

"ఏంచేస్తంర విద్యా. ఇక్కడ ఎవరింటరు మనం చెపితె? ఏదో, పెద్ద డాక్టరు కాళ్ళు పట్టుకుంటె, ఇంటికి బొయ్యి ఎంతో ముట్టచెపితె యిదన్న దొరికింది. నర్సులు అసలు యింటలేరు. ఆల్లకు గూడ కావాల్నట. ఏం చెయ్యాలె, అంత ఫీ అన్నట్టె, మల్ల అయ్యే పైసలు ఐతనేవుండె."

విద్యానాదు పొయ్యి నర్సునడిగిండు.

"ఇక్కడ స్టాక్ లేదుబాబూ. పొయ్యి హెడ్‌నర్సు నడుగు. లేకపోతె డాక్టరుకు రిపోర్టు చెయ్యి."

"ఇక్కడి డాక్టరెవరు ?"

"ఒస్తడు. ఆగు."

["ఎట్ల సిస్టర్, ఆ ఓల్డ్‌మాన్ క్రిటికల్‌గ వున్నడు."
"సోవ్హాట్, మాకిదొక్కటే కేసనుకుంటవా? వి సీ ఎ హండ్రెడ్ కేసెస్ లైక్ దిస్ ఎవ్వెరీ డే."]

నర్సు కోపంగా నడ్శి పొయ్యింది.

"ఏం చేద్దాం నాయినా, ఇంకెవ్వరికి చెప్పుతం?"

"దేవునికి."

అరై తున్నది.

"ఆఁ. ఇంక లేవుండ్రిరా. పోవాలె." అన్నడు పెద్దనాయిన. చెంద్రిక, రమేశు వార్డంత తిరుగొచ్చిండ్రు.

"నాయినా, అక్కడొక మనిశి కాలిపొయ్యిండట. పెయ్యినిండ కట్లు కట్టిన్రు." అన్నడు రమేశు.

"మీరు దవకాన కొచ్చింది గిందికేనారా? తాతను సూ_స్తమని వొ_స్తరు. ఇక్కడి కొచ్చేమొ వూరంత తిరిగొ_స్తరు."

"తాత మాట్లాడుతలేడుగద నాయిన."

"ఊఁ. ముక్కుల ట్యూబులుంటె ఎట్ల మాట్లాడుతడు?"

"ముక్కుల ట్యూబులుంటె మాట్లాడెతందుకేం?" అని రమేశు తన ముక్కుల్ల రెండు ఏల్లు కుక్కుకొని, 'వాఁ, వాఁ, వాఁ' అని సప్పుడు చేశిండు.

"అట్లగాదు. అవి లోపలిదాక వుంటె?"

"ఎమ్, లొల్లి చెయ్యకుండ్రి బద్మాశ్!" అన్నది పెద్దమ్మ.

జెర సేపటికి నర్సు తిరుక్కుంట వొచ్చి, "ఏమమ్మా, యింక యిక్కడున్న రేం? టైమైపోయింది." అన్నది.

పెద్దనాయిన రాత్రికి యిక్కన్నే పడుకుంటడు. పొయ్యే తొందర మాకే.

అమ్మ ఒక్కసారి మల్ల తాత పక్క దెగ్గెరికి పొయ్యి పిలిశింది. తాత మూలిగిండు. తాత అప్పటినించి మూలుగుతనే వుండు. కని అమ్మ తాత జవాబిచ్చిండనుకోని, ఇంకోసారి ఏడ్శి, కండ్లు తుడుసుకోని వచ్చింది.

దవాకాన గేటు దాటి యివుతలి కొచ్చినం. లోపల ఎంత సున్–సాన్ వుంటదో యివుతల అంత లొల్లి. మల్ల రిక్షలు మాట్లాడుకోని యింటి కొచ్చినం.

అన్నాలు దిన్నం. విద్యాసాదు, రమేశు, చెంద్రిక పుస్తకాలు ముందలేసుకోని కూసున్నరు. అట్ల కూసోకపోతె వాల్లమ్మ కొట్టదట.

'నువ్వు పండుకుంటవా ?' అని అడిగింది చెంద్రిక.

"లేదు." అన్న.

"పండుకో. పండుకో. మీ వూల్లె జెల్దిపండుకునే అల్వాటేమొ. పండుకో." అని పీటమీద జముకాన పరిశింది.

కాల్లు ముడుసుకొని, కండ్లు మూసుకోని, గోడ దిక్కు మొకం చేసి పండుకున్న.

అమ్మ, పెద్దమ్మ వొచ్చి పీటమీద కూసున్నరు.

"పండుకున్నావుర, వారీ." అన్నది పెద్దమ్మ.

నేను మాట్లాడలేదు.

పెద్దమ్మ చెప్పింది.

"గోస సూడలేక పోయినము చెల్లే. ముసలాయిన గోస యింతంతగాదు. ఈ వారం రోజులు యమలోక మనుబవించిండు. హయ్యో. ఎక్కడి దగ్గో, ఎక్కడి తెమ్డనో....అమ్మమ్మమ్మ....ఇంతగాదు. మీ బావ, నేను ఎంత యిదైనమని, ఎన్ని గురుగులు కొనుక్కొచ్చిన మనుకున్నవు....ఎట్ల చెప్పినా నమ్ముతవు చెల్లే. ఒక్కొక్కసారి తెమ్డ వూమిస్తే గురిగి నిండిపొయ్యేది. అవుతల పారేస్తె సపాయోల్లు అడిగిరి. యింట్ల వుంచుకుందామంటె వొశము గాకపాయె. ఎక్కడి వాసన, ఎక్కడి వాసన. ముక్కులు పలిగిపొయ్యే వాసన. ఒగ అన్నం తినబుద్దైతదా, నీల్లు తాగబుద్దైతదా....మొన్న మీ బావ ఆయినను దవకానకు తీసుకపోయినంక జెర యిల్లంత పినాయి లేశి కడిగిన...."

"ఊల్లె మాతాన వున్నప్పుడు గంతే అక్కా." అని అమ్మ మొదలుబెట్టింది. నాకు నిద్రొచ్చింది.

లైటేశింద్రు. పెద్దనాయిన మాటలు యినొచ్చినయి. కండ్లు తెరిశిన. లేశి కూసోని, "ఏమైందక్కా ?" అని అడిగిన చెంద్రికను.

"తాత సచ్చిపొయ్యిండట."

నాయిన, పెద్దనాయిన అప్పుడే పొయ్యింద్రు.

తర్వాత, చెంద్రిక మెల్లెమెల్లెగ చెప్పింది.

మే మొచ్చినంక జెర సేపటికి కొత్త సిలిండరు తెచ్చింగ్రట. గ్లూకోసు సీసాలుగూడ మారుస్తమన్నరట. కాని తాత అప్పుడు తెలివికొచ్చి, 'అరేయి, ఇవి తీశెయ్యింగ్రిరా' అన్నడట. పెద్దనాయిన తాత రొండుచేతులు పట్టుకొని, ట్యూబులు తియ్యకుంట వున్నడట. కాని తాత కొట్లాడిండంట. పెద్దనాయినను తిట్టిండట. పెద్దనాయినకు బయమై నర్సును పిలిశిండట. నర్సు పలుకకపోతే, అక్కడికి పొయ్యిండట. ఒచ్చేటప్పటికే తాత ట్యూబులు పీకేసుకున్నడట. నర్సు సూశి, ఇంక యివన్నీ అక్కర్లేదు. అని గ్లూకోసుకూడ తీసేశిందట. తరువాత జెర సేపటికే తలకాయదెగ్గెర్నించి వొల్లంత నల్లబడ్డదట. ఇప్పుడేమో తాత పీనుగను తెస్తెందుకు పొయింగ్రట.

ఇంక పన్నెండుగూడ గాలేదు.

అప్పుడే యివుతల జాగ తయారుజేశింగ్రు. రమేశు యింక పండుకోమన్నడు. ఇంట్ల లైట్లన్ని ఏశింగ్రు. తాత కొట్లాడిండంటే గమ్మతుగున్నది. ఎట్ల కొట్లాడిండో? వీల్లు పొయ్యేటప్పటికే తాతను మార్చువరీకి తీస్కపొయింగ్రేమొ!

"బట్టలన్ని ముట్టుకోకుంగ్రిరా. మైలబడుతయి." అన్నది పెద్దమ్మ. ఇవుతల మూలకు కూసోని అట్లనే నిద్రబోయినగని లొల్లికి మేలుకొచ్చింది. ఇంటిముందల మోటరాగింది. అందరు పొయ్యి తాత పీనుగను యివతలికి తీసుకొచ్చిగ్రు. చెంద్రిక పొయ్యి లోపల్నించి సాప తెచ్చి పరిశింది. "దాని మీద ఒక పాత దుప్పటి పరుసే చెంద్రికా." అన్నది పెద్దమ్మ. చెంద్రిక ఏదో దుప్పటి తెచ్చింది.

"అది గాదే, పాడుదానా, ఉంకోదుప్పటి, కిందవున్నది సూడు." అన్నది పెద్దమ్మ.

చెంద్రిక యింకోటి దెచ్చింది, పెద్దమ్మ మల్ల ఏదో అనబొయ్యింది. గని "ఊఁ, ఊఁ! ఏదో పరువు," అన్నడు పెద్దనాయిన.

తాతను అక్కన్నే పండబెట్టిన్రు. మొకంమీదికెల్లి బట్ట తీశేశింగ్రు.

పెద్దనాయిన మల్ల టైం సూశిండు.

"ఇప్పట్నించి ఏంచేస్తరు, జెర సేపుకూసోండ్రి. నాలుగైదు గొట్టంగ పొయ్యి అందరికి జెప్పిరావాలె." అన్నది పెద్దమ్మ.

"అరేయి, మల్లేశా, రాత్రంతా మేలుకుంటవాయేం, పొయ్యి పండుకోపో." అన్నడు నాయిన.

తాతను ముట్టుకుంటె సల్లగున్నది. మొకము ఏదో చెక్కతోని చేశినట్టు గట్టిగ వున్నది. రాత్రంత తాతను సూసుకుంట, పెయ్యి ముట్టుకుంట కూసోవా ల్ననుకున్న కని జెరసేపటికే నిద్రొచ్చింది. ఒద్దని ఎంతగట్టిగ అనుకున్నా నిద్ర అగలే. మేల్కొచ్చేటప్పటికి తెల్లారింది. మొకం కడుక్కొ నొచ్చిన.

తాతను యివుతలికి తెచ్చిన్రు. పెద్ద నాయిన పొయ్యి అందరికి చెప్పొచ్చి, మల్ల కాష్టానికి చెప్పేతందుకు పొయిండు. పెద్దమ్మ మాకు పైసలిచ్చి, హోటలుకు పొయ్యి ఏమన్న తిని రమ్మన్నది. విద్యానాదు మమ్ముల్ని ఇరానీ హోటలుకు తీస్కపొయిండు. అక్కడ సీన్మా రికార్డులు ఏస్తున్నరు. విద్యానాదు పేపరు సూశిండు. ఆదివారం శానా సీన్మాలున్నయి. నాకు తాతను ఏంచేస్తున్నరో సూడాలనిపిచ్చింది. అవు. ఇంక జెరసేపట్ల తాతను తీస్కపోతరు. ఈ జెరసేపన్న సూడొద్దా ?

"అన్నా, పోదాం పా." అన్న.

"ఎహె, కూసోవారి. అక్కడంత లొల్లి-పాడు. మంచిగ పాటలిన రాదు." అన్నడు విద్యానాదు. విద్యానాదు కెందు కిష్టంలేదు ? ఇప్పటికి శానా సావులు సూశిండేమొ !

"ఇయ్యాల నేను మాదోస్తులతోని గండిపేటకు పోవాలనుకుంటె యిదొచ్చిపడ్డది!"

"పాపం, ముసులోడు." అన్నది చెంద్రిక.

మంచిమంచి పాటలేస్తున్నరు. విద్యానాదు ఏపాట ఏసీన్మలదో చెపుతు న్నడు. 'ఎహె. అండ్లదిగాదు. ఇండ్లది." అంటున్నది చెంద్రిక. వాల్లు కీసులాడుకుంటున్నరు.

ఆకరికి చెంద్రిక, 'అయ్యో శానసేపైంది. పోదాం పద. అమ్మ తిడ్తది.' అంటె లేశి వొచ్చినం. అప్పటికె తాతకు స్నానం చెయ్యించిండ్రట. సచ్చిపొయినోనికి స్నాన మెట్ల చెయిస్తరో?.... బొట్లు పెట్టిండ్రు. కొత్త బట్టలు కట్టిచ్చి గోడకు కూసోబెట్టిన్రు. దూరంనించి సూస్తె తాత బతికున్నట్టే వున్నడు.

నాయిన గిట్ల మల్ల ఏడ్శిన్రు.

తాతను లేబట్టి పాడెమీద పెట్టిన్రు.

"జెల్ది కానియ్యన్రి. పొద్దుబాయె." అని తొందర జేస్తున్నరు.

అందరు ఏడుస్తనే వున్నరు.

"ఊఁ. జెల్ది. జెల్ది." అనుకుంట పాడె లేపిండ్రు. ఇంక నడుక. అందరు ఎవరి పనులమీద వాల్లు పోతుంటె, మేమేమొ తాతను తీస్కోని కాటికి.

అక్కడ మల్ల తొందర.

బాపనోడొచ్చిండు. మంత్రాలు సదివిండు. కాష్టం అప్పటికె పేర్శివున్నది. కాష్టంల పెట్టేముందు మల్ల ఏడుపు, అప్పుడైతె నాకు గూడ ఏడుపాగలేదు. విద్యానాదు గూడ కండ్లల్ల నీల్లు తెచ్చుకుండు—బాపనోడొక్కడే ఏడ్వలేదనుకుంట. తనపని తను దబదబ చేసుకుంట పోతున్నడు.

తాతను కాష్టంల పెట్టి మీద కట్టెలు పెట్టిన్రు. ఏడుపు. గ్యాసునూనె పోశిన్రు. నిప్పు ముట్టించిన్రు. జెరసేపు పంకా కొట్టిన్రు. మంటలంటుకున్నాయి. మల్ల తొందర. "ఆఁ. ఇంకేం సూస్తరు, పదుండ్రిరా. స్నానాలు చేశి పదుండ్రి." అది అదిగూడ సూడనియ్యకుంట స్నానాలు చేశిండ్రు.

మేం స్నానాలు చేశి వొచ్చేటప్పటికి మంటలెక్కువయినయి. ఒగసారి కాష్టానికి మొక్కి ఇంటికి నడిశినం.

రొండున్నర ఐంది. విద్యానాదు మ్యాట్నీకి పోదామన్నడు. "మూడింటికి రేడియోల సీన్మా వొస్తదట. ఇనొచ్చులే." అన్నది చెంద్రిక.

డచ్ విప్లవ రచయిత ముల్తతులి

ముల్తతులి (Multatuli) కలంపేరు. ఆ మాటకి లాటిన్ భాషలో పెద్ద బాధ (long-suffering) అన్న అర్థముందంట. ముల్తతులి అసలుపేరు ఎడ్వర్డ్ డెక్కర్ (Edward Dekker). హాలెండ్‌ని సముద్రంతో పోరాడే దేశమంటారు. అక్కడి ప్రజలు కష్టాలని ఎదుర్కోగల సాహసికులు. ఆ కష్టజీవుల జీవితాల్లో మరచిపోలేని విప్లవ వీరులు క్లాస్, తిల్ ఇలెన్‌స్పీగెల్‌ల నిత్యంలో జాతిని జాగరూకం చేస్తారు. త్యాగాల విలువని, వెలుగునీ చాటుతారు. ఆ ప్రభావా లన్నిటి ఫలితంగా ముల్తతులి విప్లవ శక్తిగా పీడిత ప్రజల పక్షాన నిలిచాడు.

ఉన్నత కుటుంబంలో సంపదల మధ్య పుట్టాడు. విశ్వవిద్యాలయ విద్య అనంతరం జావాలో ప్రభుత్వ ఉద్యోగాన్ని స్వీకరించాడు. జావా (ఇప్పటి ఇండోనీషియా దీవుల్లో ఒకటి) డచ్చి వలస పాలనలో ఉన్నకాలం. తర్వాత ఆ దీవులలో ఒక రాష్ట్రానికి గవర్నర్ అయ్యాడు. దాంతో అతడికి కీర్తేకాదు, అధికారము, సంపద అన్నీ లభించాయి. వైస్రాయికూడా అయ్యేవాడే. కాని డచ్ విప్లవవీరుల ప్రభావంతో నికృష్టమయిన ఐశ్వర్యాలని వదులుకున్నాడు.

డచ్ పరిపాలనలో ఇండోనీషియా ప్రజలు దీర్ఘకాలం బానిసత్వాన్ని, అవమానాలని భరించారు. గవర్నరుగా వుండికూడా ముల్తతులి పీడిత జావా ప్రజల పక్షాన నిలిచాడు. వాళ్ళ సమస్యల పరిష్కారానికి పూనుకున్నాడు. తన మాతృదేశ విధానాలని నిరసించాడు. ఖండించాడు. జావా ప్రజలు డచ్ వలస పరిపాలకులమీద ఎదురు తిరిగినప్పుడు ముల్తతులి ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్నే బలపరిచాడు.

దాని ఫలితంగా ముల్తతులి పదవి పోయింది. స్వదేశానికి పిలిపించారు. తర్వాత డచ్ పార్లమెంట్ సభ్యుడుగాకూడా డచ్ ప్రజల న్యాయమైన పోరాటాలని సమర్థించాడు. డచ్ ప్రజల స్వాతంత్ర్యం కోసం ఆందోళన చేసాడు. స్వదేశంలో కూడా ముల్తతులి జావా ప్రజల పక్షాన నిలబడి పోరాడడం డచ్ రాజుకీ, మంత్రి వర్గానికి పెద్దసమస్యగా తయారయింది. స్వదేశంలో ప్రభుత్వానికి శత్రువయ్యాడు. పేదరికాన్ని కష్టాలని ఆకారణంగానే కొనితెచ్చుకున్నాడు. పీడిత ప్రజల పక్షానుంచున్న తన నైతికబలాన్ని సడల నివ్వలేదు. చల్లబడ నివ్వలేదు.

సరిగ్గా ఆ సమయంలో రచన పైన ఆర్తి కలిగింది. అంతకు పూర్వం కూడా ఆ ఆర్తి ఉంది. కాని ఈ సమయంలో దాని అవసరం పెరిగి బయట పడింది. జావాలోని డచ్ ప్రజల జీవితాలతో ఒక నవల రాసాడు. దాని పేరు మాక్స్ హవలార్ (Max Havelaar). ఈ దశలో ముల్తతులి ఈ నవల్లో రచయిత జీవితం ఆరంభమయింది. రెండో నవల ప్రేమలేఖలు (love letters) లో రచయిత ప్రతిభ అంతా బయిటపడింది. రచయిత నమ్మకాల్లో, సాహసం స్పష్టమయింది. ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలపట్ల తన తీవ్ర వ్యతిరేక తని ప్రకటించాడు.

ఆ కాలంలో ముల్తతులి జీవితం దుర్భర మయిపోయింది. బ్రతుకుతెరువు వెతుక్కునే ప్రయత్నంలో విదేశాలకి పోయాడు. భార్యా పిల్లలు మాత్రం అమ్ స్టర్‌డమ్‌లో ఉన్నారు. వాళ్ళు దుర్భర దారిద్ర్యానికి గురయ్యారు. ఆకలితో పేదరికంతో యూరప్ దేశాలలోని నగరాలలో జీవితం గడుపుతూ రచనని కొనసాగించాడు. పైసలేక. పేదతనం వలన ఇంటి దగ్గర్నించి ఉత్తరాలు ఎప్పుడో ఏ ఆర్నెల్లకో ఓసారివచ్చేవి. భార్యనీ, పిల్లల్నీ తలచుకునేవాడు. వాళ్ళ కష్టాలు మరింత బాధపెట్టేవి. ఆ చిన్నపిల్లలకి ఈ ప్రపంచంపైన, ఈ సమాజం పైన నమ్మకం పోతుంది కదా అన్న ఆలోచనతో బాధపడేవాడు.

అతడి రచనలు అచ్చుకు నోచుకోలేదు. ఏ పబ్లిషరూ ప్రచురణకు ముందుకు రాలేదు. చివరికి కొందరు డచ్ ప్రచురణ కర్తలు ముల్తతులి రచనలు ప్రచురించుకోవటానికి బేరమాడారు. హక్కులు ప్రచురణకర్తకి వదలుకోమన్నారు. పేదరికం ఒత్తిడివలన తన హక్కులను విడిచిపెట్టాడు. ప్రచురణకర్తలు కొంత డబ్బు ముందుగా యిచ్చారు. ఆ డబ్బుతో అమ్‌స్టర్‌డామ్ వెళ్ళిపోయాడు.

ప్రచురణ కర్తలు ప్రచురణకు తీసుకోవడం ఒక పెద్దకుట్ర. ఆ హక్కులు తీసుకోవడంలో అర్థంకూడా అదే. ప్రచురణకర్తలు ముల్తతులి రచన లన్నిటినీ కాల్చేసారు. ఆ రకంగా ప్రజాశక్తులను క్రూరమైన కుట్రమాటున దెబ్బతీసారు. రచయితకి ఇంతకంటె ఘోర అన్యాయం ప్రపంచంలో జరిగి వుండదు. తన జీవిత సర్వస్వంగా యెంచుకొన్న రచనలు మంటలపాలయినాయి. పాలకవర్గం ఈ నిరంకుశత్వాన్నే స్వాతంత్ర్యం పేరుతో ప్రచారం చేస్తాయి పెట్టుబడుదారుల పత్రికలు.

[*K. Paustovsky* రచన '*The Golden Rose*' ఆధారం.]

అంతర్జాతీయ గీతం

ప్రపంచ ప్రజలంతా ఒకే కుటుంబంగా జీవించాలన్న ఉద్దేశంతో ఇప్పుడు ఎవ్వరూ వ్యతిరేకించరు, సరికదా ఈ జాతీయ ఇరుకు దారులన్నీ తొలగించాలని వసుధైకరాజ్యం స్థాపించాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా యువతరానికి ఈ అంతర్జాతీయ దృష్టి ఈనాటి విద్య. అందుకే వాళ్ళ గొంతుల్లో మోగి గుండెల్లో ధ్వనించే సంగీతం అంతర్జాతీయ గీతం. ఈ తరం నినాదం ఇంటర్నేషనల్ గీతం.

వందేళ్ళు క్రితం సరిగ్గా 1871 మేలో పారిస్ కమ్యూన్ పతనమయింది. పారిస్ కమ్యూన్‌లో వీరుడుగా పాల్గొన్న కవి యూజిన్ పొత్తియె (Eugine Pottier) ఈ గీతాన్ని రాసాడు. అతడు పారిస్‌లో అక్టోబర్, 1816 లో జన్మించాడు. తన 14 వ ఏటనే "స్వాతంత్ర్యం చిరకాలం వర్ధిల్లాలి" అన్న గేయాన్ని రాసాడు. 1848 లో శ్రామిక పక్షాన బూర్జువాలకు వ్యతిరేకంగా పోరాడాడు. శ్రామిక రాజ్యంగా వెలిసిన పారిస్ కమ్యూన్‌కి సభ్యుడుగా ఎన్నుకో బడ్డాడు. ఆ ఎన్నికలో మొత్తం 3600 ఓట్లకి 3352 ఓట్లు ఒక్క పొత్తియెకే లభించాయి. పారిస్ కమ్యూన్ చేపట్టిన కార్యక్రమాలన్నిటిలో ఉత్సాహంతో పాల్గొన్నాడు.

పుట్టింది పేద కుటుంబంలో. పెరిగింది పేదరికం పంచనే. శ్రామికునిగా, కొంతకాలం అద్దకాలు అద్దేవానిగా పొట్ట పోషించుకున్నాడు. శ్రామికుల ఐక్యతని కోరాడు. దోపిడీ శక్తుల దుష్ట శక్తిని తీవ్రంగా ఖండించాడు. తన గీతాలతో వెనుకబడిన ప్రజల ఆర్తనాదాలని వినిపించాడు. వాళ్ళ హృదయాల్లో చైతన్య గీతాలని పండించాడు.

పారిస్ కమ్యూన్ పతనమయింది. ఫ్రాన్స్ వదిలి యూజిన్ పొత్తియె ఇంగ్లండు పారిపోయాడు. తరువాత అమెరికా చేరుకున్నాడు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన అతడి ఇంటర్నేషనల్ గీతం జూన్ 1871 లో రాయబడింది. ఆ గీతం శ్రమైక జీవన సౌందర్యాన్ని దేశ దేశాలకి వ్యాపింపజేసింది. ప్రవాసంలో ఉండగా 1876 లో 'అమెరికా శ్రామికులనించి ఫ్రెంచి శ్రామికులకు' అన్న ఒక గీతాన్ని

రాసాడు. దాంట్లో అతడు పెట్టుబడిదారి సమాజంలో దుర్భర దుస్థితిని, దారిద్ర్యాన్ని, రక్తాన్ని పిండే శ్రమని, దోపిడీని, భవిష్యత్తులో శ్రామిక శక్తులు సాధించే విజయాలమీాది స్థిర విశ్వాసాన్ని కళా ప్రమాణాలలో సృష్టించాడు.

తొమ్మిదేళ్ళ ప్రవాసం తర్వాత పొత్తియె మళ్ళీ ఫ్రాన్స్ చేరుకున్నాడు. కార్మిక పక్షంలో (Workers' Party) లో చేరాడు.

1884 లో అతడి మొట్టమొదటి కావ్యసంపుటి వచ్చింది. విప్లవ గీతాలు (రివల్యూషనరీ సాంగ్స్) అన్న రెండో సంపుటి 1887 లో వెలువడింది. మిగిలిన గీతాలు పొత్తియె మరణానంతరం ప్రచురితమయ్యాయి.

నవంబర్ 8, 1887 నాడు పొత్తియె మరణించాడు. పారిస్ కార్మిక లోకం పొత్తియె భౌతిక దేహాన్ని పేర్‌లషైజ్ (P'ere Lachaise) సెమెటెరీకి తీసుకుపోయారు. పారిస్ కమ్యూన్ పతనానంతరం మరణశిక్ష అనుభవించిన విప్లవ వీరుల సెమెటెరీ అది. వచ్చిన జన సమూహం చేతిలోని అరుణ పతాకాన్ని తీసుకోవటానికి సెమెటెరీ వద్ద పోలీసులు క్రూరంగా ఎదుర్కొన్నారు. కాని ప్రజా వీరుల ముందు విఫలు రయ్యారు. అంత్యక్రియలు అంతిమ వీడ్కోలులో 'లాంగ్‌లివ్ పొత్తియె' నినాదాలు మిన్నుముట్టాయి.

పొత్తియె పేదరికంలో చనిపోయాడు. కాని అతడు ఈ ప్రపంచానికి విడిచిపెట్టిన కానుక మాత్రం అనితరసాధ్యం. గీతాలద్వారా శ్రామిక జాతి ఐక్యతనీ, బలాన్నీ, విజయాలనీ, విశ్వకళ్యాణాన్నీ ప్రచారం చేసిన గొప్ప శ్రామిక కవి (Worker poet) పొత్తియె. అతడు అంతర్జాతీయ గీతం రాసిన నాటికి సామ్యవాదం ఒక స్వప్నం. అప్పుడు సామ్యవాదుల సంఖ్య చాల చిన్నది. ఇప్పుడు సామ్యవాదం ఒక సత్యం. సామ్యవాదుల సంఖ్య వందల కోట్లల్లో. ప్రగతి దారిలో ఉన్నవాళ్ళు విజయ గమ్యాన్ని చేరుకుంటారు.

(*On Literature and Art* లెనిన్ వ్యాసం ఆధారం).

నేనీ ప్రపంచంలోకి దేనితోనూ రాజీపడడానికి రాలేదు.
అన్నిటితోనూ తగవుపడ్డానికే వచ్చాను.

—మాక్సిం గోర్కీ

సమీక్షలు :

దిక్సూచి – రా

ఒకప్పుడు నేను ఆరుద్ర వ్రాసిన "త్వమేవాఽహమ్" చదివి, ఉప్పొంగి పోయి చిందులువేస్తూ, ఇకమీద నేను కవిత్వం వ్రాయకపోయినా పర్వాలేదను కొని సినీమారంగంలోకి నిష్క్రమించాను. నా కో వారసుడొచ్చాడనుకొని సంబర పడ్డాను. కాని ఆ వారసుడుకూడ నాతోబాటే సినీమాలోకి వచ్చేశాడు. విప్లవోత్సా హంతో విజృంభించిన అభ్యుదయ కవిత్వం విగ్రహారాధనల స్థాయికి దిగజా రింది. ఈ లోగా మా చుట్టూ కొన్ని నిక్షిప్త ప్రయోజనాలు ఏర్పడ్డయి. ఏ వెస్టెడ్ ఇంటరెస్ట్స్ మాత్రమే మనిషిచేత మాట్లాడిస్తాయి. ఒకొక్కప్పుడు, వాటిని కాపాడుకోవడం కోసం, ఉద్యమానికే ద్రోహం చేసేదాకా మనిషిని తీసుక వెళ్తాయి.

కాని ఇటువంటి వాళ్ళని ఒడ్డుకు కొట్టేస్తూ విప్లవ ప్రవాహం నిరంత రాయంగా సాగిపోతూనే ఉంటుంది. ఇదో జీవనది. ఒకప్పుడు ఇసుకల్లో ఇంకిపోయి నట్లు కనిపించినా ఇంకోసారి వరద గోదావరిలాగ ముంచుకొస్తుంది. విప్లవ సాహిత్యం కూడ ఇలాంటిదే! జమీందారీ కవిత్వంమీద భావకవిత్వం ఒక తిరుగుబాటు. భావకవిత్వంమీద అభ్యుదయ సాహిత్యం ఒక విరగబాటు. అభ్యు దయ సాహిత్యంమీద విప్లవరచన ఈనాటి సరికొత్త మెరుగుబాటు. ఇదే ఈ శతాబ్దపు సాహిత్య చరిత్ర! ఇవాళ యువతరంలోంచి ఒక కొత్త తరంగం లేచింది. ఇది కొందరి ప్రయోజనాలకి ఎసరుపెడుతున్నమాట నిజమే! అందుకనే దీని మీద అంత వ్యతిరేకతా ప్రచారం!

ఒక్కటి చూడండి! తన పది వేల, పాతికవేల ఆస్తికోసమే ఒక మధ్య తరగతి ఆసామీ హోరాహోరీ పోరాడితే ఇక లక్షలూ, కోట్లూ ఉన్న మహా రాజులూ, మఠాధిపతులూ, పీఠాధిపతులూ, మరెంత తీవ్రంగా పోరాడాలి! సంప్ర దాయ భక్తి, దేశభక్తి, దైవభక్తి అన్నీ వీళ్ళకి అండదండలు చేకూర్చుతాయి. ఇతరులకి వీళ్ళు అహింసని బోధిస్తారు. తమ ప్రయోజనాల్ని ఎదిరించే వాళ్ళ

మీద హింసని పురికొల్పుతారు. హింసించే ఆయుధాలన్నీ వీళ్ళ ఆజమాయిషీ లోనే వున్నాయి. విప్లవకారుడు హింసని ప్రతిహింసతో ప్రతిఘటిస్తాడు. ఈ ప్రతిఘటన నేడు ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. దీని ఫలితంగా అప్పుడే మూడోవంతు భూమి విముక్తమయింది. ఈ విమోచన పోరాటాల విజయంగా ఎప్పుడైతే హింసని ప్రతిహింస నిర్మూలిస్తుందో అప్పుడే అహింస సిద్ధిస్తుంది. అది ప్రపంచమంతా దోపిడినుండి విముక్తి పొందినప్పుడే, అనగా నా అంచనాలో, ఈ శతాబ్దం ముగియకముందే వచ్చేస్తుంది. ఇరవయ్యొకటో శతాబ్దపు మానవుడికి హింసతో అగత్యం ఉండదు. ప్రమేయం ఉండదు.

ఆ నవమానవుణ్ణి ఆవాహన చెయ్యడమే నేటి విప్లవకవుల కర్తవ్యం. అతని రాకకు అడ్డుపడుతున్న అన్ని శక్తుల్నీ, అన్ని సిద్ధాంతాల్నీ చీల్చి చెండాడడమే విప్లవ రచయిత కలం చెయ్యవలసిన పని!

మగవాళ్ళంతా చేగువేరాలూ, వెంపటపు సత్యాలూ, ఆడవాళ్ళంతా పంచాది నిర్మలలూ కాలేకపోవచ్చును. కాని వాళ్ళ త్యాగాలనుంచి గుణపాఠాలను నేర్చుకో లేని తెలివితనాన్ని గురించి ఏమనుకోవాలి?

మానవుడు ఇరవై ఒకటోశతాబ్దం వైపుచేసే ప్రయాణానికి దిక్సూచి చెర బండరాజు 'దిక్సూచి'. అటువైపుకే భైరవయ్య 'రా' అని పిలుస్తున్నాడు.

విప్లవరచయితలే నిజమైన భక్తాగ్రేసరులు. వీళ్ళ సంప్రదాయం విప్లవ సంప్రదాయం! వీళ్ళ దేశం సమస్త విశ్వం! వీళ్ళ దైవం మానవుడు.

—శ్రీశ్రీ

ఉదయతార

(కవితా సంకలనం, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణ, ఏలూరు రోడ్డు–విజయవాడ–2. ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ విజయవాడ–2. వెల: ఒక రూపాయి)

ఆఫ్రికా–ఆసియా రచయితల మహాసభ సన్నాహక సదస్సు సందర్భంగా, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘంవారి కవితానీరాజనం 'ఉదయతార'. అసలు 24, జుమ్లా 42 పేజీలున్న ఈ సంకలనం ఆఫ్రో–ఆసియా రచయితల

ఉద్యమ చరిత్ర, ప్రణాళిక, ఇంకా ముప్పైముగ్గురు ఆంధ్ర 'అభ్యుదయ కవుల' కవితల్తో ఎరుపూ, తెలుపూ కలిసిన ఎత్తినచేతుల సంఘీభావ ముఖచిత్రంతో అందంగానే ఉంది.

సమకాలీన పరిస్థితుల సరియైన అవగాహనతో పీడిత ప్రజల పక్షాన నిలబడగలిగే ప్రతి రచనా అభ్యుదయరచనయే. కాని పాఠకలోకం రచయిత ప్రతి కదలికనూ గుర్తిస్తుంది. ఆ రచయిత పూర్వాపరాల్ని పరిశీలిస్తుంది. ఉదయతారలోని కవులనూ ఈ దృష్టితో చూడక తప్పదు.

ఈ దేశంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పోరాడుతున్న వీరులను సమర్థించలేక, దొంగలు దోపిడీదార్లుగా చిత్రిస్తున్న పెద్దలకు వత్తాసునిస్తున్న కవులు ఆసియా-ఆఫ్రికా దేశాల జాతీయవిముక్తి ఉద్యమాలలో ఆత్మ బలి దానం గావించిన అమరవీరులకు అంకితమివ్వడం చాలా విచిత్రంగా ఉంది. ఆయా దేశాల ప్రభుత్వాలచే ఆయా దేశాల విప్లవకారులు దొంగలు, దోపిడీదార్లు, హంతకులుగా చిత్రించి చంపబడ్డవాళ్ళే. అటువంటి ప్రభుత్వాలనే స్తమే భారత ప్రభుత్వం. ఈ దేశపాలకులకు ప్రక్కతాళం వేస్తున్నవాళ్ళే ఇందులోని కవు లందరూ. సరిహద్దులు దాటినకొద్దీ భావాలు మారుతాయా ? భుజాలు తడుముకో కండి !

'కారు చీకట్లో కాంతిరేఖ' పాట్రిస్ లుముంబా కాంగోను కళ్ళముందు వాస్తవికంగా చిత్రిస్తుంది.

నిగళాలు త్రెంపుకొని నీవు నిలిచిననాడె
కటికికాలము పీడకలవోలె కరగురా—

అంటూ, పీడితజన కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది. సాకోర్టిస్ అంగోల 'ఓ ఆఫ్రికా! నా ఆఫ్రికా !',

అడుగడుగున పరాయి కిరాయిమూకలు
ఎక్కడ చూచిన పారేనెత్తురు
కారే కన్నీళ్ళు
పరాయి దేశాల్లో
పశువుల్లా అమ్ముతున్నారు
మమ్మల అక్కడాయిక్కడా—

అంటూ, ఆఫ్రికా నల్లజాతి అత్యంత దయనీయస్థితిని, వలసపాలకుల దారుణాల్ని

ప్రపంచానికి చాటుతున్నది. భారతదేశంలోకూడా మనుష్యుల వ్యాపారం సాగుతూనే ఉంది. నెత్తురు పారుతూనే ఉంది. అందుకే నిగళాలు త్రెంచుకొని నిలిచి పోరాడమని తమ స్వీయకవితలో రాంభట్ల కృష్ణమూర్తి, పెన్మెత్స హరిశ్చంద్ర రాజుగార్లు ప్రబోధిస్తే సంతోషిస్తాం. లేకుంటే కాంగ్రెసువాళ్ళు లెనిన్ శతజయంతి జరుపుకొన్నట్లు వీళ్ళుకూడా అనువదించారని ఆచరిస్తాం. వియత్నాం జాతీయగీతం,

నవమానవసమాజ నిర్మాణ మొనరింప
బందూకుచేబూని ముందడుగు వేదాము–అంటుంది.

ధనస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి బందూకుపట్టి సాగమని పీడిత జనబాహుళ్యాన్ని చివరి పోరాటానికి సన్నద్ధం చేస్తుంది గేయం. ఇలాంటి గేయాన్ని అనువదించిన నిడమర్తి ఉమా రాజేశ్వరరావుగారు ఈ దేశంలో అలా చేస్తున్న వారిని తప్పు అనే స్థితికి దిగజారిపోరనుకుంటా–పోతే. గర్హనీయమే.

'వియత్నాం' గజ్జల మల్లారెడ్డిగారికి మచ్చలాగే ఉంది. విశాలాంధ్రలో భూపోరాటం గూర్చి పద్యాలురాసుకోక వియత్నాం విముక్తి పోరాటాన్నిగూర్చి రాయటం సబబుగా లేదు.

'అనల పతాకం' లో సోమసుందర్ లుముంబాగ్నిచే

స్వార్థపరవర్గాల స్వాంతాలు తూట్లుపడె
అర్థస్వామ్య తమస్సులణగారి గాట్లుపడె
నీ ప్రాణత్యాగమున కర్థమ్ము తరలినది
నీ జీవగానములు అభయమ్ముకురిసినవి—అంటూ ఉన్న దున్నట్టు

చెప్పారు. భవిష్యద్భారతంలోకూడా జరుగనున్నదిదే. విప్లవాన్ని సొంత ఆస్తిగా మార్చుకొన్న స్వార్థపరుల స్వాంతాలు తూట్లుపడక తప్పదు. విప్లవాగ్ని వాళ్ళను ధ్వంసం చేయకతప్పదు. శృంగార కవి సి. నారాయణరెడ్డిగారికి కూడా అభ్యుదయ కవి ననిపించుకోవాలని తాపత్రయం. అందుకే పాపం 'మేమూ మానవులమే' అంటున్నారు. కాదని ఎవరన్నారు? కాని రెడ్డిగారొకటి గుర్తించాలి. తానూ మనిషినే అనుకుని. మనిషిగా బ్రతకాలనుకునేవాడు.

క్రుంగిన మా వక్షాల్లో గుండుల దండులుదిగినా
కూలిన మా వక్షాల్లో నాళుల నెత్తురుడిగినా
మాబంధితదేహాల్లో మరణకళలు నటించినా

మా ఐక్య గళాలలో మార్మోగు నొకటేధ్వని
ఒకటే కరుణారసధుని అదియేశాంతినినాదం—అంటూ ఎన్నడూ
ఇలాంటి పిరికి నినాదాలు వల్లెవేయడు. శాంతికోసం పోరాడుతాడు. ప్రభంజనం తర్వాత ప్రశాంతిని సాధిస్తారు. ప్రజలకు ఇలాంటి నినాదాలు చెబితే తమ సినిమా బ్రతుకేదో బ్రతుకండి అని సలహాయిస్తారు.

'కిరణ శకలం'లో దాశరథిగారు ఇలా అంటున్నారు :

ప్రతికవి ఒకఫైర్ బ్రిగేడ్
అణ్వస్త్రపు అగ్గురుచికి ప్రతిపద్యం మబ్బుముక్క
కలం అంటే నాగాబలం! కలంలేంది బలంలేదు.

కరెక్ట్. అందుకేనా భారత పాలకులకున్న సైన్యం చాలదని తమరి కలం బలాన్నికూడా మద్దతుగా తోలుతున్నారు. ఫైర్ బ్రిగేడ్‌లుగా పనిచేస్తున్న కవులపై విరుచుకపడుతున్న వీరి నిజాయితీని శంకించవలసివస్తున్నది.

'నావిషాదగీతం'లో తన ప్రక్క ఊళ్ళకుఊళ్ళు ధ్వంసమవుతుంటే చూస్తూ మలయాలోని పెర్మటాంగ్‌టింగీ అని ఏడిస్తే ఎవరూ నమ్మరు శశాంకను.

శాంతీ, విశ్వశాంతి కవితల్లో రెంటాల, కౌముదిగార్లు శాంతి, విశ్వశాంతి అంటూ పలవరిస్తున్నారు. ఊహాసౌధాల్లోంచి శాంతి మంత్రం పఠిస్తే లాభం? గాంధీతాత శాంతి శాంతన్నాడు. వినోబా శాంతి శాంతంటున్నాడు. కాంగ్రెసువాడూ శాంతిశాంతంటున్నాడు. అమెరికావాడు శాంతి శాంతంటున్నాడు. ఈ శాంతి కర్థమేమిటి? ప్రజల్ని మోసంచేయడం. మనిషి మనిషిగా బ్రతికే, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో దగాలేని సమాజాన్ని నిర్మించుకున్ననాడే శాంతి సాధ్యమవుతుంది. అంతదాకా ఈ శాంతికుక్కలు మొరుగకుంటే మంచిది.

'లుముంబాగ్నిలో, ప్రజలిచ్చే తుదిశాపం ఫలించి తీరునురేపే

....

నిన్నటిబానిస ఇవాళతీర్పిచ్చే ప్రజాధిపతి'

అంటారు నార్ల చిరంజీవి. చరిత్రసత్యం. తప్పదు మరి.

పైడిపాటి సుబ్బారామశాస్త్రి. 'ఆసియా'

తన ప్రాచీనపు

ఘన వైశిష్ట్యం
తన ఔన్నత్యం

తానే స్మరించుకు—నిద్దురలేచిందంటాడు. ప్రాచీన వైశిష్ట్యాల్ని, ఔన్నత్యాల్ని నెమరు వేయించి నిద్రబుచ్చకండి శాస్త్రిగారూ!

దనుజలోక మేకంగా దారి కడ్డు నిలుచుంటే

నరజాతి ప్రస్థానం పరిసమాప్తి అవుతుందా? అంటాడు అశ్విని తన 'అజేయ—అనివార్యం'లో. అవును మరి.

పరతంత్రతలో మ్రగ్గు బానిసలముక్తికై
కదన భూములకెత్తి కదలివెళ్ళే మీకు
అడుగడుగున నేనే అండగానిలుస్తాను—అంటూ స్వాతంత్ర్య పోరాటయోధులకు చేయూతనిస్తాడు అనిసెట్టి సుబ్బారావు. నిలిస్తేనే బ్రతుకు సార్థకం.

ఎన్నడో విశ్వమానవ న్యాయస్థానం
విధించిన శిక్ష పంక్తులు
భావి చరిత్ర పుటలలో వ్రాసి భద్రంగానే వుంచింది!

'చెదపురుగులు'లో కొనకళ్ళ ఆఫ్రికా జాత్యహంకారులకు రాబోయే గతిని వర్ణిస్తాడు. ఇది ఒక్క ఆఫ్రికా జాత్యహంకారులకే పరిమితంకాదు. ప్రతి దగాకోరూ దీనినుండి తప్పించుకోలేడు.

'కాలం చెప్పేకథ'లో కవులూరి వియత్నాంలో
కదంతొక్కి విప్లవగీతిపాడి
జయపతాక ఎగురువెయ్—అంటున్నాడు. అన్ని దేశాల పీడిత ప్రజలకు ఇది ఉత్తేజాన్నిస్తుంది. 'వీరవాసంతం'లో శ్రీకాంత్ వియత్నాం ప్రజలు పచ్చని కోర్కెలకై జరిపేపోరాటాన్ని వర్ణిస్తాడు. 'ప్రగతి'లో పచ్చి అభివృద్ధి నిరోధక పాత్ర వహిస్తున్న కవులూరి, శ్రీకాంత్‌లు ఇలారాస్తే అర్థమేమిటి?

'కదనం-దవం'లో ఇంద్రగంటి శ్రీ కాంత్‌శర్మ,

కలలుకనే కవి కవనానికి
కదనదవం సోకేదెప్పుడు?
గుండెలపై వాస్తవగాథలు
గొల్లున పరుగెత్తేటప్పుడు—అని జవాబు చెప్పుకుంటాడు. కళ్ళు

మూసుకొని ప్రపంచాన్ని చూచేవానికి వాస్తవగాథల ప్రస్తావనెందుకు, కదనమంటే పరుగులంఘించుకునేవారికి కదనదవ మెందుకు? ఆత్మాశ్రయవాదం, మానవతా వాదంతో పేరుకొన్న వీరి కవిత్వం శాంతి దైవతంకోసం యజ్ఞం చేస్తున్నది.

భగ్గుమనే యుద్ధ జ్వాలిక
పరమార్థం స్వార్థపరత్వం
గొంతు పగిలి పలికిన సత్యం
కొ. వి. లా. కం. వ్యథా ప్రహేళిక

కొరియా, లావోస్, వియత్నాం, కంబోడియా యుద్ధాల పరమార్థం స్వార్థ పరత్వం కాదు. దురాక్రమణదారుడు స్వార్థపరుడు. విముక్తికోసం పోరాడు తున్న ఆ యా దేశ ప్రజలంతా విప్లవ వీరులు. స్వార్థంకాదు, విముక్తి వాళ్ళ ధ్యేయం. అవి వ్యథా ప్రహేళికలు కాదు. తప్పనిసరైన విముక్తి పోరాటాలు. శ్రీకాంత్ శర్మగారు ఈ విషయాలు అర్థం చేసుకోవాలి. ఇంతకంటే రియాక్షనరీ కవిత్వం ఉంటుందా?

'అమ్మకి ఆఖరి లేఖ' అమెరికా సైనికుని నిజాయితీని చిత్రిస్తుంది. మృత్యువు ఓడిపోయింది, నాకు తెలుసు, గెద్ద అరుపు, శాంతి, వియత్నాం, బిగించిన పిడికిళ్ళు, వియత్నాంలో శ్వేతమహాక్ష్వేళం, జ్వాలపాట, నాగతం అంకితం, సమరకాహళి, డాలర్ ఆజ్ఞ, స్వాగతం మొదలైన గేయాలు ఆసియా ఆఫ్రికా ఖండాల్లోని దేశాల ప్రజా పోరాటాల్ని సమర్థిస్తూ, స్వాగతం చెబుతూ, కీర్తిస్తున్నవి, జగన్మోహన్‌గారి సమాన (వ) త్వం, మార్క్సిస్టు మానవతా వాదాన్ని ప్రబోధిస్తున్నది.

ఈ కవితా సంకలనంలో ఈ దేశంలోని విప్లవ ప్రభంజనానికి చలించక, ప్రక్క దేశాల్లోని విప్లవాలకు జ్వలించిన చాలామంది యువకవు లున్నారు. కారణం వాళ్ళే వెదుక్కుంటే మంచిది. ఈ యువకవులు భారత దేశంలో తమ పాత్ర నిర్వహించడానికి బంధాలు త్రెంచుకొని బయటకొస్తే మంచిది.

ఈ పుస్తకం మొదటి పేజీల్లో ముల్క్‌రాజ్ ఆనంద్ మాటల్లో, "ప్రజల్లో మానవత్వాన్ని మేల్కొల్పడం రచయితల బాధ్యత, ఇందుకు మనకున్న పరికరం-కళ, దాని ద్వారానే మనం మానవజాతి భవితవ్యాన్ని పరిరక్షించాలి. దేవుళ్ళ రోజులు పోయాయి. ఏ జీసస్ క్రీస్తో, ఏ బ్రహ్మదేవుడో యీనాడు మానవుని భవితవ్యాన్ని నిర్ణయింపజాలడు. మానవజాతి భవితవ్యాన్ని ప్రజలు

తమంతట తామే నిర్ణయించుకోవలసిన తరుణం ఆసన్నమైంది. వారిచేత యీ కర్తవ్యాన్ని గుర్తింప చేయటానికై, స్వశక్తిపై వారిలో విశ్వాసాన్ని కల్పించ డానికై రచయితలు తోడ్పడాల్సివుంది."

పై మాటల్ని అభ్యుదయకవులనుకున్న వాళ్ళెంతవరకు పాటిస్తున్నారు? పీడిత ప్రజలకు ఎంతవరకు కర్తవ్య ప్రబోధం చేస్తున్నారు? సినిమాల్లో, వ్యాపారంలో (రచనా), స్వంత బ్రతుకుల్లో నే నా కళద్వారా వీళ్ళు సమాజానికి చేస్తున్న సేవ? రచయితలకు సిద్ధాంతపరమైన కమిట్‌మెంట్ ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘంలో ఎంత మంది సరియైన కమిట్‌మెంటు ఉన్నవా ళ్ళున్నారు? సావధానంగా ఆలోచిస్తారనుకుంటా.

చివరిమాటగా, కొరియా, వియత్నాం, లావోస్, కాంబోడియా మున్నగు దేశాలపైన వెలిగే ఉదయతార భారతదేశంపై కనిపించదేం? ఉదయతారెప్పుడూ భారతదేశంలో భయపడి వియత్నాంలో పొడవదు. విప్లవకారుడు ఎప్పుడూ ఒకే దేశానికి పరిమితం కాడు. విముక్తికోసం పోరాడే వీరు డే దేశంలోనైనా విప్లవ కారుడే, భారతదేశంలో అప్పుడే ప్రొద్దు పొడిచిందనుకుంటా. తన ఇల్లు చక్క బెట్టుకోలేనివాడు ప్రక్కవాళ్ళ ఇల్లు చక్కబెడతానన్నట్టు, ఆత్మ పరిశోధన చేసుకోలేనివాడు ఇతరులను గూర్చి పరిశోధించినట్టున్నాయ్ ఇందులో కవిత లన్నీ. ఈ దేశంలో అభివృద్ధి నిరోధకులుగా, పాలనాయంత్రాంగపు తొత్తుల్లా చెలామణి అవుతున్న కవులు, వేరొక దేశంపై అభ్యుదయ భావాల్ని వెలిబుచ్చితే అభ్యుదయ కవులు కారు.

—ఆర్. ప్రశాంత్

మార్చ్

[రచన : విప్లవ కవులు. 80 పేజీలు — ఒక రూపాయి. ప్రతులకు : పి. కిషన్‌రావు; పోస్ట్ : చెన్నూరు; వయా : కొడకండ్ల; జనగామ తాలూకా; వరంగల్ జిల్లా.]

తెలంగాణాలో 20 ఏళ్ళనాడు సాగిన ప్రజా సాయుధ పోరాటం, కవిత్వాలు రాసే అనేక మందిని నిజమైన కవుల్ని జేసింది. మామూలు ప్రజలనించి చాలా మంది కవుల్ని తయారుజేసింది. ఆ పోరాటమూ దాని ప్రభావంగా తెలుగు

కవిత్వమూ రెండూ భారత దేశంలోకల్లా తెలుగు దేశాన్ని తెలుగు కవిత్వాన్నీ అగ్రగాముల్ని జేసినయ్.

అలాగే మళ్ళీ యీనాడు యీ రెండేళ్ళుగా సాగుతున్న రాజకీయ పోరాటాల ప్రభావంగా తెలుగు కవిత్వంలో సాయుధ కవితాశకం, విప్లవ కవుల యుగం సాగుతున్నది. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయుధ ధారణ వినా మార్గం లేదని ప్రజల్ను ఉద్బోధిస్తున్న మొదటి విప్లవ కవులు వీరు. ఇంతకుముందు దిగంబర కవిత్వం, తిరుగబడు కవిత్వాలు తెలుగులో వెలువడి నూతన ఆలోచనలకు దారి జూపగా మొట్టమొదటిసారిగా "యిదిగో యిదీ దారీ కవులూ కళాకారులూ మేధావులూ శ్రామికులారా! కదలండి, యీ రాక్షస వ్యవస్తను రాక్షసంగానే, హింసతోనే ఆయుధంతోనే కూలదోయగలం, చేతికందిన ఆయుధమల్లా పట్టండి" అని నిర్ద్వంద్వంగా నిజాయితీగా నిప్పులా చెప్పిన కవుల పుస్తకం యిది. అందువల్ల తెలుగులో సాయుధ కవితా శకారంభకులు వీరు. ఈ కవుల దారిలోకే క్రమంగా, త్వరగా దిగంబర కవులు, తిరుగబడే కవులూ, శ్రీశ్రీ వగైరాలు చేరి విరసం ఆవిర్భవానికి దారి తీశారు. అందువల్ల తెలుగులో దారి తెలియని వెతుకులాట స్థితిలో వున్న యీ తీవ్రవాద యువకవుల, మేధావుల నందర్నీ ఉత్సాహపరచి దారిజూపిన ముఖ్యమైన గొప్ప కవిత్వాలివి.

తెలుగు దేశంలో అక్కడక్కడా జర్గుతున్న సాయుధ ప్రజా చర్యలు కవులను ప్రభావితం జేశాయి. తెలంగాణాలో సాగిన ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమం యువకులను మేధావులను తీవ్ర కదలికలోకి కొనివచ్చాయి. ఫలితమే యింతమంది కవుల యింతమంచి కవితలు. "ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీయే నేటికవి" అనే నిగూఢ యుగసత్యాన్ని ప్రముఖంగా కొనివచ్చారు.

"విప్లవాన్ని ముస్తాబుచేసి
ఎన్నికల దొమ్మరి సంతలో అమ్ముకో నేర్చిన బేహారులు
బారికేడ్లు కట్టలేరు"

అన్నాడు కవి.

"కసితో స్వార్థం శిరస్సు గండ్ర గొడ్డలితో
నరక కల్గినవాడే నేటి హీరో."
స్వార్థం శిరస్సును........

స్వలాభ, స్వంత ఆస్తి ఆలోచనను మొదలంటా నరికేసిన్నాడే యీ దేశం యీ ప్రపంచం బాగుపడుతుందని యింతకన్నా చక్కగా ఎవరు చెప్ప గలిగారు ?

తెలంగాణా పోరాటంలో
భుజంమీద తుపాకులు మోసి
నక్సల్‌బరీ రైతాంగ పోరాటందాకా
ఎక్కైన్నల్లో వున్న గెరిల్లా లెనిన్"

గత 20 ఏళ్ళ చరిత్రా ఏమీ లేదని విప్లవం ప్రవాసంలో ఉంచబడిందనీ ఎంతటి సత్యమైన మార్క్సిస్టు అవగాహన యిది !

విప్లవం పేరు చెప్పుకొని ఓట్లు కొనేవాళ్ళు తయారయిన యీ రోజున 'శ్రామికులారా ! ఏకం కండు' అని కవి ఉద్బోధ యిదిగో.

"అన్నా,
నువు ఐదేళ్ళకో, మూడేళ్ళకో
ఒక్కొక్క ఓటుకాసే చెట్టువు
ఒక్కచుక్క నల్లదీ ఒక్కచుక్క తెల్లదీ పోసి
నీ ఓటు రాల్చుకుని
నిన్నటి ఎప్పటి ఎండలోనే మలమల మాడ్చే
ఈ ఎడారి దొంగలు కల్పించే ఎండమావులను
ఇంకా ఎంతకాలం నిజమని
నమ్మించుకుంటావు ?
నీలా ఆకలితో మండి చెమటతో ఆరేవాళ్ళంతా
ఏకంకండి
బాలట్లతో కాదు బులెట్లతో
ఈ రాజ్యాధిపత్యం చేపట్టండి."

ఇందులోని శీర్షికలే యీ పుస్తక ప్రాశస్త్యాన్ని చెప్పేస్తయ్. "రా! సమరానికి", "లెనిన్", "ఇపుడు వీస్తున్న గాలి", "పట్టపగళ్ళకోసమే యీ తుపాకుల ప్రేలుళ్ళు", "ఆయుధం కాగడా యీ తరానికి", "అప్రతిహతం" "సాయుధాలవుతున్న సంకెళ్ళ చేతులు", "ఓట్లచెయ్యి ఒరనించి కత్తి దూసింది",

"కసేనాకు బందూక్", "షూట్", "సామ్యవాద కవిని", "బలమైన తరంకోసం", "తూరుపు దిక్కేరుపెక్కేను"........

"వర్గశతృ నాశనం కోసం
బలియైపోయిన తృప్తి
వెలిగిస్తున్నది ఆ నవ్వును"

"యోధుని వదనంపై పువ్వులా వికసించే" ఆ నవ్వుయొక్క శక్తినీ అందాన్నీ ఎవరు కొలవగలరు?

—అట్లూరి రంగారావు

విద్యుల్లత

వ్యాపార సాంప్రదాయాల నన్నిటినీ ధిక్కరించి చైతన్య సాంప్రదాయాలతో విద్యుల్లత రెండో సంవత్సరంలో అడుగు పెట్టింది. ఇది కథల సంచిక. ఏడు కథలూ, ప్రఖ్యాత ఉర్దూ రచయిత కిషన్ చందర్‌తో ఇంటర్వ్యూ ఇందులో ఉన్నాయి.

'హింసను నిషేధించిన పులిరాజు' ప్రయోగాత్మకంగా ఉన్న బలమైన కథ. అహింస భాషలో మాటాడుతూ కిరాతక పాలకులు చట్టం పేరుతో హింసనూ దౌర్జన్యాన్నీ ప్రజలమీదికి ఎట్లా వదుల్తారో స్పష్టం చేసింది. రచయిత ఎమ్. ఎన్. రావు 'ఎద్దులు-పులి' (సింహం?) కథ? రాజకీయ అవగాహనతో విప్లవ దృష్టితో చెప్పారు. ఎద్దుల ఐక్యత, పోరాట తత్వం, వ్యూహం, ఎద్దుల అసమాన ధైర్య సాహసాలు, విజయం-తొలినష్టాల తర్వాత సాధించుకోవడం గమనార్హం. మొదటిదశలో పులే గెలిచింది. ఎద్దుల అనైక్యత, ఆసరా తీసుకుని. గుణపాఠం నేర్చుకున్నాయి ఎద్దులు. చివరికి గెలిచాయి.

అత్తలూరి నర్సింహరావు కథ ఉద్యమం ఊరేగింపుతో ఆరంభమవుతుంది. ముందుకు సాగినకొద్దీ పలచబడుతుంది. వ్యక్తిగత కక్షల మీదికి ఉరికి లెక్చరర్ గంగాధరం మీద పడుతుంది. తర్వాత బస్ ఆపి డ్రైవర్ మీద పడుతుంది. దాంతో మొత్తం దారి తప్పుతుంది. ఇది వర్తమాన ఉద్యమాల స్వభావాలని తెలియజేసినా ఉద్యమ నాయకత్వంలోని రొమాంటిక్ ఆవేశం తప్ప

వర్గ చైతన్యం, క్రమశిక్షణ, పోరాట స్వభావం అవగాహన లేకపోవటం వలన అల్లరిమూకల అరాచకంగా మిగులుతుంది. వర్గ చైతన్యమే ఉంటే ఏ నేరమూ ఎరగని శ్రమజీవి బస్సు డ్రైవర్‌తో అనవసరంగా విద్యార్థులు పోట్లాట పెట్టుకోరు. క్రమశిక్షణ, లక్ష్యశుద్ధీ ఉంటే ఊరేగింపు కాఫీలకీ సిగరెట్లకీ సినిమా వాల్‌పోష్టర్లకీ జారిపోయేది కాదు. పోరాట స్వభావమే తెలిస్తే విద్యార్థులు అనవసర సాహసాలు కష్టాలు నివారించగలిగే వారు. ఇది కథా వస్తువుగా కొత్తది. ఈ రకమైన కథా వస్తువు వర్తమాన సమాజంని పరిచయం చేస్తుంది.

ఆగ్నేయ రాసిన 'నిందలేందే' పటిష్టమైన మరొక కథానిక. పెళ్ళాంని మారిగాడు తాగొచ్చి కొట్టాడు. అది పడిపోయింది. చచ్చిపోయిందనుకుని బుగులెత్తి ఉరోసుకుందని చెప్పేయటానికి తాడు తీసుకుని దూలానికి వేలాడదీసాడు పెళ్ళాన్ని. పోస్ట్‌మార్టమ్‌లో మారిగాని పెళ్ళం ఉరోసుకుని చచ్చిపోయిందని డాక్టరు చెప్పాడు. మారిగాని పెళ్ళం సరిగ్గా ఎప్పుడు చచ్చిపోయిందో తెలీదు. మొగుని దెబ్బలకా? లేక తాడు తీసి వేలాడేసినప్పుడా?

'తవ్వండిరా-వెధవ నాయాల్లారా? ఒగింత సేపు తవ్వు తారేటి-బొందతవ్వేడు కల్లు నాగించేయగల్బా-తవ్వండి' కసిరాడు నరిసిగాడు అంటూ ఆరంభమయిన ఈ కథ మన పల్లెల్లోని అలగాజనాల దుఃఖాలూ ఉద్రేకాలూ, ఆకళ్ళు కన్నీళ్ళు చిత్రించిన మాస్టర్ పీస్.

సమాజంలోని లోపాలకీ, దోషాలకీ, దోపిడికీ, హింసకీ, వ్యక్తే కారణం అన్న అవగాహనని ఇస్తుంది 'ఉదయం' కథ. ఆ కథలో హరి కనిపెట్టిన పరిష్కారం తప్పు. వర్గ చైతన్యం కలిగించటం ద్వారా వర్గ పోరాటాలు జయప్రదం అవుతాయి. వర్గ రాజకీయాలని వివరించటం ద్వారా వర్గ చైతన్యం జ్వలిస్తుంది. వర్గ దోపిడీ, వర్గ ప్రయోజనాలు అర్థమవుతాయి. విద్యావంతులని చేసి కార్యోన్ముఖులుగా సిద్ధం చేయటం ప్రజలని ఐక్య పరచటం నిర్మాణాత్మక మార్గం అవుతుంది.

రంగారావు కథ 'ఆకలి' చెప్పే పద్ధతి బలంగా లేకపోవటం వలన పాఠకుణ్ని పట్టుకోలేదు. మాండలికాల్ని ఉపయోగించాలనుకున్న రచయితలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే కృతకంగా రచన తయారవుతుంది. 'సుడిగుండం' శిల్పానికి ప్రాధాన్యత యిచ్చిన కథ. బోగస్ విద్యా విధానాన్నీ, కాలేజీ విద్యలోని కృతకతనీ, శూన్యతనీ, యూత్‌లోని రెస్ట్‌లెస్‌నెస్‌నీ, ఇంపేషెన్స్‌నీ స్పష్టం

చేసింది. ఈ వాతావరణంని సన్నివేశంతో జతపరిస్తే సమాజాన్ని చూపే గొప్ప రచనలు తయారవుతాయి.

'గంజాయి గొట్టాలు' కథలో సి. ఎస్. రావు రెండు కథలు చెప్పారు. ఒకే కథ పేరుతో ఆ రెండు కథలు ఎందుకు చెప్పారో ఎంతకీ అర్థంకాదు. మొదటి భాగం లాడ్జింగ్‌లో, రెండో భాగం సుగుణ కొంపలో. మొదటి దృశ్యంలో తాగటం, అయిదుగురు గువ్వల్లాంటి పిల్లల్ని కథానాయకుడు స్నేహితులతో పండుగ చేసుకోవటం.

కథానాయకునికి మత్తు వదిలిన తర్వాత వాళ్ళ జీవితాల్లోని దారిద్ర్యం మీద దీనత్వం మీద జాలి కలుగుతుంది.

రెండో భాగంలో సుగుణ, కథానాయకునికి నచ్చిన మనిషి. నాటువైద్యం చేయించి, గర్భం తీయించుకుని, కళ్ళు లోతుకుపోయి, జుట్టు రేగిపోయి కుక్కిమంచంలో పడుంది. కాళ్ళ దిక్కు మంచం కింద రక్తపు మడుగు. ఆ పని చేసినందుకు కథానాయకుడు సుగుణను కోప్పడతాడు. సుగుణ తనని సమర్థించుకుంటుంది. లంజకొడుకు అని లోకం పిలవడం సహించలేక ఆ పని చేసానంటుంది. కథానాయకునికి జాలి కలిగి హాస్పిటల్ చేరుస్తాడు. తన బాధ్యతని నిర్వర్తించి పోతున్నవాడిని పిలిచి, 'మీ మనసు తీర్చుకుని మరీ వెళ్ళండి, యిప్పుడు కాస్తా సులువుగానే ఉందిగా, పరవాలేదు' అంటుంది.

ఈ కథలో 'నేను' ఎవరో, ఆయన వ్యక్తిగత సాంఘిక హోదాలేమిటో మనకు తెలవ్వు. ఘనమైన పండుగతో ఆయనకు వీడ్కోలు చెపుతున్న మిత్రులెవరో తెలీదు, వాళ్ళ సంబంధాలు అర్థంకావు. రాజకీయాల్లో పిందెను అన్న ఒక అస్పష్ట వ్యాఖ్యానం తప్ప అతడి గత చరిత్ర ఏమిటో తెలియదు. కొత్త చరిత్ర అంతే. తన జీవితంలో మార్పు వచ్చిందంటాడు. అదే రకం మార్పో కథలో ఎక్కడ వెతికినా దొరకదు. ఇలాంటి పాత్రలనే మనం ఆకాశంనించి ఊడిపడిన పాత్ర లంటాం. కథలో మనకు తెలిసినంతవరకూ అతడు వ్యభిచారి. తాగుబోతు కొత్తలోకి అడుగుపెట్టున్న దశలో వ్యభిచారి, తాగుబోతు.

కుక్క మీదికి సైడుకాలవ దగ్గర కూచున్న బిచ్చగాడు రాయి వేయటం, బిచ్చగాని మీదికి రిక్షా బురద చిమ్మటం, ఎదురుగా వస్తున్న లారీ రిక్షాని మురికి నీళ్ళతో తడపటం—దీన్ని కథానాయకుడు 'జీవితంలో అడుగడుగునా వర్గ పోరాటమే' అని వ్యాఖ్యానిస్తాడు. వర్గపోరాటం అంటే దోపిడీ చేస్తున్న వర్గానికీ,

దోపిడీకి గురవుతున్న వర్గానికీ మధ్య పోరాటం. కథల్లో ఈ వ్యాఖ్యానాలు రచయిత అవగాహన మీద సందేహాలని కలిగిస్తాయి. ఈ అనవసర వివరణలు తీసేయటం కథకి నిండుదనాన్నీ సంక్షిప్తతనీ కలిగించుతుంది. దాంతో ఎంత మంచి కథా వస్తువయినా శిల్పంలోని దోషాలవలన ప్రయోజనానికి దూరమవుతుంది

యువతరం ఆందోళన, తిరుగుబాటు, రాజకీయ చైతన్యం, హేతువాదం, విప్లవ పోరాటాలు, వర్తమాన నికృష్ట జీవితం నించి మేల్కొంటున్న సాహసాల సామూహికబలం—యిదీ యీనాటి యువతరం ముందున్న కథా వస్తువు. పేద ప్రజల దిక్కుమాలిన జీవితాలపట్ల అపారమైన ప్రేమతో, వాళ్ళ విముక్తికోసం గురుతరమైన బాధ్యతని స్వీకరిస్తేనేగాని రచయిత సాహిత్యాన్ని చైతన్య వంతం చేయలేడు. విద్యుల్లత పరిచయం చేస్తున్న ఈ రచయితల్లో ఆ బాధ్యతని స్వీకరించే చేవ కనిపిస్తున్నది. అదే తెలుగు సాహిత్యం యొక్క భవిష్యత్తు.

— శ్రీపతి

రచయితలకు విజ్ఞప్తి

నాలుగు సంవత్సరాలుగా సృజనను ఆధునిక సాహిత్య వేదికగా నిర్మించుకోవడానికి మీరిచ్చిన సహకారానికి ధన్యవాదాలు. మీ ఈసహకారాన్ని యింకా వేగవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.

త్రైమాసికకు మాసపత్రికకు వ్యవధిలో వున్న వ్యత్యాసం వంటిదే యీనాటి ఆధునిక సాహిత్యానికి 1966 నవంబర్‌లోని ఆధునిక సాహిత్యానికీ వున్న తేడా.

ఈనాటి ప్రజావసరాలను గుర్తించే, ప్రజాసమస్యలను చిత్రించే రచనలు మీనుంచి కోరుతున్నాం. ముఖ్యంగా కథలు, ఏకాంకికలు జీవితంనుంచి వచ్చి జీవితానికి వెలుగుయిచ్చేవి కావాలని మనవి చేస్తున్నాం.

సృజన ప్రతినెల మొదటివారంలో వెలువడుతుంది. కాబట్టి రచయితలు వచ్చే సంచికకొరకు ముందునెల ఒకటో తేదీవరకే రచనలు పంపించాలి.

సంపాదకుడు, సృజన, పి. బి. 67, వరంగల్-2.

SRJANA Telugu Monthly Feb. 1971 Regd. No. 10953/67

నాలుగేళ్ళుగా
ఆధునిక సాహిత్య వేదికగా
అపూర్వ సంచలనం కలిగించిన

సృజన

మాస పత్రిక తొలి సంచిక మీ చేతిలోవుంది
దీనిని మాస పత్రికగా నిలుపుకోవాల్సిన బాధ్యత మనందరిది.

- నేడే చందాదారులుగా చేరండి
- 'సాహితీ మిత్రులు'గా చేరండి
- విరాళాలివ్వండి
- ప్రకటనలివ్వండి

మీ మీ శక్తికొలది సహకరించండి

సంవత్సర చందా : పది రూపాయలు
అర్ధ సంవత్సర చందా : ఆరు రూపాయలు
విడిప్రతి : ఒక రూపాయి

వివరాలకు : సృజన, పోస్టుబాక్సు 67, వరంగల్-2

Edited Printed and Published by Varavara Rao for Sahithee Mithrulu.
100 Pages. 100 Paise